ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
ప్రకాశం
జిల్లా వార్తలు
మంగళవారం 26, నవంబరు 2024

శివోహం..

జిల్లాలోని శైవక్షేత్రాల్లో ఓంకార నాదం మార్మోగింది. కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా భక్తులు వేకువజాము నుంచే పెద్దఎత్తున ఆలయాలకు తరలివచ్చారు. సర్వేశ్వరుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి సుఖశాంతులతో జీవించేలా చూడాలని ప్రార్థించారు.

- ఆంధ్రజ్యోతి, ఒంగోలు కల్చరల్



ఒంగోలులోని జేఎంబీ చర్చిలో కేకును కట్ చేస్తున్న పాస్టర్ అగస్టీన్


ఒంగోలులోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో కోటి దీపోత్సవం


చీమకుర్తిలోని గాంధీనగర్‌లో శివలింగాకారంలో దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న భక్తులు

సెమీ క్రిస్మస్ సందడి

- మొదలైన వేడుకలు
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

ప్రేమకు ప్రతిరూపమైన ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించుకునే సెమీక్రిస్మస్ సంబరాలు సోమవారం నుంచి మొదలయ్యాయి. పలుచోట్ల కొవ్వొత్తులు చేతపట్టుకొని క్రీస్తు గీతాలాపనలు, ప్రార్థనలు చేశారు. వచ్చేనెల 25 వరకూ ఇవి కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా చర్చిలను అందంగా ముస్తాబు చేశారు. విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. క్రైస్తవ కాలనీలు, ఇళ్ల వద్ద అందమైన స్టార్స్ ఏర్పాటు చేశారు.

- ఒంగోలు కార్పొరేషన్, ఆంధ్రజ్యోతి


క్రిస్మస్ తాతతో చిన్నారి

- అద్దంకి బస్టాండ్ సెంటర్‌లోని మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఓ వ్యక్తి రాజకీయ పలుకుబడితో ఏళ్ల తరబడి తిష్టవేశాడు. ఏపార్టీ అధికారంలో ఉంటే ఆ పేరు చెప్పి అధికారులను బెదిరించడం ఆయనకు ఆనవాయితీగా మారింది. ఆ కాంప్లెక్స్‌లో లీజుకు తీసుకుంది ఒక షాపు కాగా, దానిని మూడు భాగాలు చేశాడు. వేర్వేరు వ్యాపారాలకు కేటాయించి నెలనెలా వేలల్లో అద్దె వసూలు చేస్తున్నాడు. కార్పొరేషన్‌కు పైసా చెల్లించడం లేదు.
- అదే కాంప్లెక్స్‌లో షోరూం నిర్వహిస్తున్న మరో వ్యాపారి మొదట్లో వేరే వ్యక్తి వద్ద తక్కువకు అద్దెకు తీసుకుని ఆ తర్వాత దానిని తన పేరుతో లీజుకు పొందాడు. కార్పొరేషన్ అధికారులు మార్కెట్ ధరకు అద్దెలు పెంచగా దానిపై అభ్యంతరం చెప్తూ కోర్టుకెళ్లాడు. అద్దె చెల్లించకుండా నానాయాగీ చేస్తున్నాడు.
- ఇంకో వ్యక్తి తనకు కేటాయించిన షాపులో తాను వ్యాపారం చేయకుండా మరొకరికి ఎక్కువ ధరకు అద్దెకు ఇచ్చాడు. నెలనెలా మార్కెట్ ధర ప్రకారం అద్దె వసూలు చేసుకుంటూ కార్పొరేషన్‌కు కుచ్చుటోపీ పెడుతున్నారు.
- ఎన్టీఆర్ విగ్రహం వద్ద షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపులు లీజుకు తీసుకున్న వారిలో ఒకరిద్దరే నడుపుతున్నారు. అత్యధికంగా ఇతరులు ఉన్నారు. పూల దుకాణాలు పొందిన వారు మొబైల్ షాపులకు, ఇతరత్రా వ్యాపారాలకు అద్దెకు కేటాయించారు.
- లాయరుపేట సాయిబాబా గుడి వద్ద మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ల్లోనూ కొందరు లీజుదారులు తాము వ్యాపారాలు చేయకుండా అద్దెకు ఇచ్చారు. లీజు కాలం ముగిసినా గత వైసీపీ హయాం నుంచి రాజకీయ అండదండలతో ఖాళీ చేయకుండా కొనసాగుతున్నారు.
- నెల్లూరు బస్టాండ్ వద్ద కాంప్లెక్స్‌లోని షాపుల్లోనూ కొందరు వైసీపీ కార్యకర్తలు తిష్టవేశారు. ఇతరులకు కేటాయించి, వేలల్లో నెలనెలా అద్దెలు వసూలు చేస్తున్నారు. అయితే వారిలో కొందరు అద్దెలు కూడా చెల్లించకుండా రాజకీయ అండదండలతో అధికారులను సైతం బెదిరించి కొనసాగుతున్నారు.



మున్సిపల్ కాంప్లెక్స్‌ల్లో అదే గలీజు

ఇదీ ఒంగోలు నగరంలో గ'లీజు' వ్యవహారం. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లు, కూరగాయల మార్కెట్ తదితర వాటిలో కొందరు తిష్టవేసి సొమ్ము చేసుకుంటున్నారు. కార్పొరేషన్‌కు దక్కాల్సిన ఆదాయాన్ని అప్పనంగా కాజేస్తున్నారు. కోట్లలో గండికొడుతున్నారు. లీజు పేరుతో షాపులను దక్కించుకుని వాటిని ఇతరులకు అద్దెకిచ్చి భారీగా లాభపడుతున్నారు. అధికారులు కూడా వారి విషయంలో మెతకవైఖరిని ప్రదర్శించడం విమర్శలకు తావిస్తోంది.

- పేరు ఒకరిది.. పెత్తనం మరొకరిది!
- బినామీలతో కార్పొరేషన్ ఆదాయానికి గండి
- అమలుకు నోచుకోని జీవో నెం. 56
- మామూళ్ల మత్తులో రెవెన్యూ విభాగం
- ఒక్క కూరగాయల మార్కెట్‌లోనే రూ. 4.5కోట్ల బకాయి

ఒంగోలు, కార్పొరేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరపాలక సంస్థకు చెందిన దుకాణ సముదాయాల్లో 'గలీజు' పర్వం కొనసాగుతోంది. సబ్ లీజుల పేరిట కొందరు దందా చేస్తుండటంతో కార్పొరేషన్ ఆదాయానికి కోట్ల రూపాయల్లోనే నష్టం వాటిల్లుతోంది. రెవెన్యూ సెక్షన్ గూడుపుఠాణీ కారణంగా కొద్దిమొత్తంలో అద్దె రూపంలో చెల్లిస్తున్న లీజుదారులు ఆపై వాటిని మార్కెట్ ధరకు మించి అధిక అద్దెలు వసూలు చేసుకుంటున్నారు. కార్పొరేషన్‌లో పలుకుబడి గలిగిన వ్యక్తులు ఏళ్ల తరబడి షాపింగ్ కాంప్లెక్స్‌లలో తిష్టవేసి ఉన్నారు. వేలల్లో అధికారులకు అద్దెలు చెల్లిస్తూ, లక్షల్లో ఆదాయాన్ని పొందుతున్నారు. కొందరైతే నామమాత్రపు అద్దెను సైతం చెల్లించడం లేదు. ఇటీవలి వరకు కొనసాగిన కొందరు ఆర్ఐలు

మిగతా 6వ పేజీలో

జీజీహెచ్‌లో కేన్సర్ నిర్ధారణ పరీక్షలు

- యూనిట్‌ను ప్రారంభించిన అధికారులు


కేన్సర్ నిర్ధారణ పరీక్ష చేస్తున్న వైద్యుడు

ఒంగోలు, కార్పొరేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో కేన్సర్ ముందస్తు గుర్తింపు యూనిట్ (ప్రివెంట్ అంకాలజీ యూనిట్)ను సోమవారం ప్రారంభించారు. ఆసుపత్రిలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏర్పాటుచేసిన దీన్ని రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ టి.జమున ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రాన్ని కేన్సర్ రహితంగా మార్చేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒంగోలులోని ఈ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. కేన్సర్ లక్షణాలు కలిగిన వారు, అనుమానం కలిగిన ప్రతిఒక్కరూ ఈ కేంద్రంలో నిర్ధారణ పరీక్షలు చేయించుకునే అవకాశం కల్పిస్తామన్నారు. ఈ విధానం ద్వారా ముందుగానే వ్యాధిని గుర్తించి, వైద్యం త్వరితగతిన అందించే వీలు ఉంటుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు అక్కడి వైద్యుల సలహా మేరకు నేరుగా వచ్చి సేవలను పొందవచ్చన్నారు. ప్రతి మంగళ, గురువారాల్లో ఈ సేవలను పూర్తి ఉచితంగా అందిస్తామని తెలిపారు. గుట్కా, పాన్ మసాలాలు రోజువారీ అలవాటు ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. స్త్రీ, పురుషులకు వేర్వేరు ఓపీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రోగాం కోఆర్డినేటర్ డాక్టర్ తిరుమలరావు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్‌తోపాటు, పలువురు వైద్యులు పాల్గొన్నారు.


శ్మశాన భూమిని ఆక్రమించి తోలిన మట్టి

శ్మశానాన్నీ వదలా!

- కట్టావారిపాలెంలో దర్జాగా కబ్జా
- మెరకలు తోలి కంచెలు ఏర్పాటు
- వైసీపీ పాలనలో కొందరి పేర్లతో ఆన్‌లైన్ చేసిన రెవెన్యూ అధికారులు

6

రామ్‌గోపాల్.. పరార్!

- అరెస్టుకు భయపడి అజ్ఞాతంలోకి దర్శకుడు వర్మ
- హైదరాబాద్ వెళ్లి గాలిస్తున్న రెండు పోలీసు బృందాలు
- నేడు హైకోర్టులో విచారణకు రానున్న బెయిల్ పిటిషన్



వివరాలు మెయిన్‌లో..

మట్టి.. కొల్లగొట్టి..

- అడ్డగోలుగా తవ్వకాలు
- అనుమతులు లేకుండా ఇష్టారీతిన భారీ వాహనాల్లో తరలింపు
- అడ్డుకున్న తూర్పుగంగవరం గ్రామస్థులు
- చోద్యంచూస్తున్న అధికారులు

తాళ్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): హైవే పనుల కోసం అడ్డగోలుగా గ్రావెల్ తవ్వకాలకు కొందరు తెగబడుతున్నారు. అనుమతులు లేకుండా ఇష్టారీతిన భారీ వాహనాలలో తరలిస్తున్నారు. యథేచ్ఛగా సాగుతున్న వ్యవహారాన్ని అధికారులు కూడా చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. మట్టి తవ్వకాలు మండలంలోని నాలుగు కొండలలో విచ్చలవిడిగా సాగుతుండగా సోమవారం తూర్పుగంగవరంలో మాత్రం ఉద్రిక్తతకు దారితీసింది. గ్రామ ఉమ్మడి తిప్ప బీడు భూమిలోని మట్టిని ఎలాంటి అనుమతులు లేకుండా భారీ వాహనాల్లో తరలిస్తున్నారు. ఈక్రమంలో సోమవారం తూర్పుగంగవరం గ్రామస్థులు అడ్డుకున్నారు. తిప్ప బీడులో మట్టి తోలేందుకు ఉన్న యంత్రాలను అక్కడి నుంచి బయటకు పంపడంతో తాత్కాలికంగా తరలింపు నిలిచిపోయింది. మండలంలోని నాగంబొట్లపాలెం రెవెన్యూ పరిధి సర్వేనంబర్ 299లోని తిప్పబీడు భూమి 190.50 ఎకరాలు (పశువుల మేత భూమి) తూర్పుగంగవరం గ్రామస్థుల ఉమ్మడి బీడుగా ఉంది. ఇది అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు పూర్వం గ్రామానికి చెందిన ఏడుగురు పెద్దల పేర్ల మీద పట్టాదారులుగా రెవెన్యూ రికార్డులో ఎఫ్ఎల్ఆర్ నమోదు చేశారు. ఆ భూమిలో అనాది నుంచి మూడు, నాలుగు గ్రామాలకు చెందిన పశువులు మేస్తూ ఉంటాయి. ముప్పవరం-బెంగళూరు హైవే నిర్మాణంలో భాగంగా పట్టాదారులకు చెందిన ఇద్దరితో సంప్రదించి ఉమ్మడి తిప్పబీడులోని గ్రావెల్‌ను తరలిస్తున్నారు. ఇది ఉమ్మడి బీడు భూమిగా ఉంది. కాగా పట్టా హక్కుదారులకు చెందిన కుటుంబ సభ్యులు, గ్రామస్థులతో సంప్రదించి ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకొని మైనింగ్ అనుమతి పొందాలి. ఆ తర్వాతే గ్రావెల్ తోలుకోవాలి. అయితే, ఉమ్మడి బీడుకు సంరక్షణగా ఉన్న పట్టాదారుల్లో కొందరు హైవే నిర్మాణ పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌తో లాలూచీ పడి గ్రావెల్

మిగతా 6వ పేజీలో


మట్టి తవ్వకాలను అడ్డుకున్న తూర్పుగంగవరం గ్రామస్థులు


తిప్పబీడు భూమిలో ఎక్స్‌కవేటర్‌తో టిప్పర్‌లోకి నింపుతున్న మట్టి

117 జీవోను రద్దుచేయాలి

- యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్ డిమాండ్

ఒంగోలు విద్య, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులను కుదించేందుకు గత ప్రభుత్వం తెచ్చిన 117 జీవోను రద్దుచేయాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ డిమాండ్ చేశారు. గత వైసీపీ పాలనలో విలీనం చేసిన మూడు, నాలుగు తరగతులను ప్రాథమిక పాఠశాలలకు పంపే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో యూటీఎఫ్ స్వర్ణోత్సవాల మహాసభ రెండోరోజైన శనివారం కొనసాగింది. ప్రసాద్ మాట్లాడుతూ ఉన్నత పాఠశాలలో సమాంతర మీడియంలను నిర్వహించి ఉపాధ్యాయులను సరిపడా ఏర్పాటు చేయాలన్నారు. టీచర్లకు రావాల్సిన ఆర్థిక బకాయిలను విడుదల చేయడంతోపాటు 12వ పీఆర్సీ కమిటీని వేసి వెంటనే అమలు చేయాలన్నారు. పీఆర్సీలో జాప్యం జరిగిందున ప్రభుత్వం 29 శాతం ఐఆర్‌ను ప్రకటించాలన్నారు. ప్రాథమిక పాఠశాలలకు సంబంధించి ఒకటి నుంచి ఐదు తరగతులు నిర్వహించాలని, ప్రతి గ్రామానికి ఒక మోడల్ స్కూలు ఏర్పాటు చేసి ఐదు పోస్టులు ఉండేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సమాఖ్య రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొమ్మోజీ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యా విధానం మెరుగుపడే విధంగా ప్రభుత్వ విధానాలు ఉండాలన్నారు. ఎన్నికల అధికారిగా, పరిశీలకులుగా వచ్చిన రాష్ట్ర కార్యదర్శి నవ కోటేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యమం ఆవశ్యకతను, యూటీఎఫ్ సాధించిన విజయాలను వివరించారు. ఈ మహాసభల్లో 40 మండలాలకు చెందిన కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రసాద్



రెప్పపాటు.. మృత్యుకాటు!

- ట్రాక్టర్‌ను వెనుకనుంచి ఢీకొన్న కారు
- ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు
- అందరూ కర్నూలు వాసులు


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు


ఇమ్రాన్‌ఖాన్ మృతదేహం

బేస్తవారపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్వ్యూకు హాజరై కారులో తిరిగి సొంతూరికి వెళ్తున్న వారిని ట్రాక్టర్ రూపంలో ప్రమాదం వెంటాడింది. ఒకరు మృతిచెందగా ముగ్గురు గాయపడ్డారు. బేస్తవారపేట మండలం శాంతినగర్ వద్ద సోమవారం వేకువజామున ఈ దుర్ఘటన చోటుచేసుకొంది. వివరాల్లోకి వెళితే.. కర్నూలుకు చెందిన నలుగురు యువకులు కారులో ఒంగోలుకు వచ్చారు. అక్కడ ఓ ఇంటర్వ్యూకు హాజరై తిరిగి కర్నూలుకు బయల్దేరారు. అమరావతి-అనంతపురం జాతీయ రహదారిపై మండలంలోని శాంతినగర్ వద్దకు వచ్చే సరికి వారి కారు అదుపు తప్పి ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను వెనుకభాగంలో ఢీకొట్టింది. రెప్పపాటులో జరిగిన ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న పఠాన్ ఇమ్రాన్‌ఖాన్ (35) అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన తమ్ముడు పఠాన్ ఇర్ఫాన్‌ఖాన్, అల్తాఫ్ మాష్, ఖాజా బాషాలు గాయపడ్డారు. వీరిని 108లో గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఏఎస్సై నారాయణరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మోటార్ సైక్లిస్టుకు గాయాలు

అద్దంకి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోపాలపురంలో అసంపూర్తిగా ఉన్న నామ్ రోడ్డులోని గోతులలో పడి మోటార్ సైక్లిస్టుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలివి.. బల్లికురవ మం డలం వి.కొప్పెరపాడుకు చెందిన షేక్ అబీబ్ మరో వ్యక్తితో కలిసి మోటార్ సైకిల్‌పై అద్దంకి నుంచి స్వగ్రామానికి వెళుతుండగా గోపాలపురం వద్ద అ సంపూర్తిగా ఉన్న నామ్ రోడ్డుపై గోతులలో బైకు అదుపు తప్పి పడిపోయారు. దీంతో అబీబ్‌కు తీవ్రగాయాలు కావడంతో 108లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కోనంకిలో మళ్లీ చర్చి వివాదం

మార్టూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోనంకి ఎస్సీ కాలనీలో తెలుగు బాపిస్టు చర్చి వివాదం మళ్లీ సోమవారం రాత్రి రాజుకున్నది. ఈ చర్చిలో పాస్టర్ నియామకంపై రెండు గ్రూపుల మధ్య కొంతకాలంగా వివాదం నడుస్తుండగా ఏడాదికి పైగా చర్చిని మూసివేశారు. గత రెండు నెలలు కిందట కాలనీలోని పెద్దలు, గ్రామ పెద్దలు సమన్వయంతో మరల చర్చి తలుపులను తెరవడంతో చర్చిలో ప్రార్థనలు జరుగుతున్నాయి. సోమవారం రాత్రి ఒక గ్రూపు వారు రెండో గ్రూపు వారితో కోర్టులో తమ పేర్లు ఎందుకు ఫిర్యాదు చేశారనే విషయంపై వివాదం రాజుకుంది. విషయం తెలుసుకున్న సీఐ ఎం.శేషగిరిరావు, ఎస్ఐ సైదా రెండు గ్రూపుల వారిని సమన్వయం చేయడంతో సమస్య తాత్కాలికంగా సద్దుమణిగింది.

ఆరుగురు జూదరుల అరెస్టు

పర్చూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండల పరిధిలోని ఏదుబాడులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై సోమవారం ఎస్సై మాల్యాద్రి ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టుచేసి, రూ.7200 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తామన్నారు.

పాత నేరస్థుల బైండోవర్

చీరాలటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సోమవారం ఏడుగురు పాత నేరస్థులను ఎక్సైజ్ పోలీసులు చీరాల తహసీల్దార్ గోపీకృష్ణ వద్ద బైండోవర్‌లు చేశారు. ఈసందర్భంగా అధికారులు వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. నేరాలను వీడి మానవ మనుగడలో సంతోషంగా జీవించాలని సూచించారు. పునరావృతమైతే కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

బైకిస్టుకు గాయాలు

అద్దంకి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోపాలపురంలో అసంపూర్తిగా ఉన్న నామ్ రోడ్డులోని గోతులలో పడి మోటార్ సైక్లిస్టుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలివి.. బల్లికురవ మం డలం వి.కొప్పెరపాడుకు చెందిన షేక్ అబీబ్ మరో వ్యక్తితో కలిసి మోటార్ సైకిల్‌పై అద్దంకి నుంచి స్వగ్రామానికి వెళుతుండగా గోపాలపురం వద్ద అ సంపూర్తిగా ఉన్న నామ్ రోడ్డుపై గోతులలో బైకు అదుపు తప్పి పడిపోయారు. దీంతో అబీబ్‌కు తీవ్రగాయాలు కావడంతో 108లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కరాటేలో ఎంఎస్ పాఠశాల విద్యార్థి ప్రతిభ


భార్గవ్

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని ఎమ్ఎస్.స్పోర్ట్స్ కరాటే స్కూల్ విద్యార్థులు అనంతపురంలో జరిగిన 68వ ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా కరాటే స్కూల్ నిర్వాహకులు ఎం.శ్రీనివాసరెడ్డి, తోట ప్రసాద్‌లు మాట్లాడుతూ.. తమ పాఠశాలకు చెందిన జేకేఎస్‌సీ భార్గవ్ అండర్-17 విభాగంలో ప్రథమ బహుమతి సాధించి జాతీయస్థాయికి ఆంధ్రప్రదేశ్ తరఫున ఎన్నికయ్యాడన్నారు. జే.సాయి త్రిష, రిజ్వాన, సౌజన్య, షాకీర్ బాషాలు కూడా రెండో స్థానంలో నిలిచారని, జాతీయ స్థాయిలోకి ఎంపికైన భార్గవ్‌ను అభినందించారు.

వినియోగదారుల అభిరుచి మేరకు వస్త్ర ఉత్పత్తి

చీరాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారులు అభిరుచి మేరకు వస్త్రాల ఉత్పత్తి జరగాలని, అప్పుడే డిమాండ్, గిట్టుబాటు ధరలు లభిస్తాయని విజయవాడ హ్యాండ్లూమ్ సర్వీస్ సెంటర్ అసిస్టెంట్ డైరెక్టర్ జ్ఞానశేఖర్ అన్నారు. మండల పరిధిలోని ఈపురుపాలెంలో సోమవారం వెస్ట్ బ్లాక్ లెవల్ హ్యాండ్లూమ్ క్లస్టర్ ట్రైనింగ్ సెంటర్‌ను శిక్షణ పొందేందుకు వచ్చిన చేనేత కార్మికురాలితో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ చేనేత కార్మికులు జాంధాని, జాకార్డు, కుప్పటం, మంగళగిరి, పట్టు రకాలలో శిక్షణ పొంది, ఆ రకాలను నేస్తే గిరాకీ ఉంటుందని సూచించారు.

ఆక్రమణలో శ్మశాన స్థలం

తొలగించాలని గ్రామస్థుల వినతి

కొండపి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కొండపి గ్రామ పంచాయతీలోని కట్టావారిపాలెంలో శ్మశానస్థలం ఆక్రమణలకు గురైంది. గ్రామంలో ఎవరైనా చనిపోతే శ్మశానంలోకి వెళ్లే వీలు లేకుండా పోయింది. పైగా శ్మశాన స్థలం ఎక్కడ ఉందనే ఆచూకీ కూడా కనిపించని దుస్థితి ఏర్పడింది. సర్వేనంబర్ 90 బార్ 1ఓలో 76సెంట్లు స్థలాన్ని దశాబ్దాలుగా గ్రామానికి చెందిన కొందరు శ్మశానానికి వదిలేశారు. గతంలో రావెళ్ల అనే ఇంటిపేరు ఉన్న వారే ఇక్కడ దహన, ఖనన కార్యక్రమాలు చేసుకునేవారు. ఇది దాదాపు 14 మందికి ఉమ్మడి స్థలంగా ఉంది. ఇందులో ఆరుగురు దాతలు దాదాపు 18.05సెంట్ల స్థలాన్ని శ్మశానానికి కేటాయిస్తూ గ్రామపంచాయతీకి రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. మిగతావారు కూడా శ్మశానానికి మిగిలిన స్థలం వాడుకోవడానికి సమ్మతిస్తూ లిఖితపూర్వకంగా వంద రూపాయల స్టాంప్‌పై దానపత్రం రాసిఇచ్చారు. దీంతో కొందరికే కాకుండా గ్రామం మొత్తానికి శ్మశాన వాటికగా ఉపయోగపడేలా ఉంది. 2017లో ప్రభుత్వం ఈస్థలంలో శ్మశాన వాటిక నిర్మాణానికిరెండు లక్షల రూపాయల నిధులు మంజూరు చేసింది. కొంత నిర్మాణ పనులు జరిగాక ప్రభుత్వం మారడంతో శ్మశాన వాటిక పనులు నిలిచిపోయాయి. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం రావడంతో ఆపార్టీకి చెందిన నాయకులు ఈస్థలంలో గ్రామ సచివాలయం నిర్మించాలని ప్రయత్నాలు చేశారు.

అయితే దాతల్లో కొంతమంది లీగల్ నోటీసులు పంపడంతో ఆ ప్రతిపాదనలు ఆగిపోయాయి.


ఆక్రమణకు గురైన శ్మశాన స్థలం

స్థలానికి విలువ పెరగడంతో...

76 సెంట్ల స్థలం దశాబ్దాలుగా రావెళ్ల కుటుంబీకులకు ఉమ్మడి శ్మశానంగా ఉంది. గడచిన ఐదేళ్ల కాలంలో ఈ స్థలం విలువ పెరగడంతో ఇందులోని కొందరు వాటాదారులు తమకు అనుకూలమైన చోట ఆక్రమించుకుని మెరకలు తోలుకుని కంచెలు వేసుకున్నారు. దీంతో ప్రస్తుతం దాతలు ఇచ్చిన స్థలం ఎక్కడనేది తేలకుండా పోయింది. గతంలో గ్రామంలో ఒకరు చనిపోయినపుడు కూడా శ్మశానానికి వెళ్లనివ్వకపోవడంతో రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. గడచిన ఐదేళ్లలో స్థలం సబ్ డివిజన్ చేయకుండానే రెవెన్యూ అధికారులు తమకు తోచిన విధంగా కొందరికి ఆన్‌లైన్ చేశారు. ఇప్పుడు శ్మశాన స్థలానికి వెళ్లే మార్గంకాని, ఆ స్థలంగాని కనిపించడం లేదు. దాతలిచ్చిన స్థలాన్ని సబ్ డివిజన్ చేసి శ్మశానానికి దారి ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సబ్ డివిజన్ చేసి శ్మశాన స్థలాన్ని కేటాయించాలి



గతంలో తమ ఇంటి పేరున్న వారికే ఈస్థలం శ్మశానంగా ఉంది. 2014-19 మధ్య కాలంలో గ్రామం మొత్తానికి ఉపయోగపడేలా దాతలు గ్రామ పంచాయతీకి రాసిచ్చారు. ఆస్థలం ప్రస్తుతం ఎక్కడ ఉందనేది తేలడం లేదు. ఉమ్మడి స్థలం కావడంతో కొందరు తమ స్థలం అంటూ ఆక్రమణలు చేసుకున్నారు. రెవెన్యూ అధికారులు శ్మశాన స్థలాన్ని వేరుచేసి శ్మశానికి కేటాయిస్తే అభివృద్ధి చేసుకుంటాం.

రావెళ్ల రమేష్‌బాబు, కట్టావారిపాలెం

ఆక్రమణదారులను తొలగించాలి



మాకుటుంబం హైదరాబాద్‌లో ఉంటోంది. పూర్వీకుల నుంచి వచ్చిన స్థలాన్ని గ్రామం మొత్తానికి ఉపయోగపడుతుందని పంచాయతీకి రిజిస్ట్రేషన్ చేశాం. కాని తర్వాత ఆ స్థలం తేల్చాలని అధికారులకు అనేక సార్లు అర్జీలు ఇచ్చినా స్పందన లేదు. అధికారులు పంచాయతీకి ఇచ్చిన ప్రకారం మొత్తం స్థలం శ్మశానికి కేటాయించి ఆక్రమణదారులను తొలగించాలి.

రావెళ్ల వెంకటేశ్వర్లు, కట్టావారిపాలెం

సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా

మంత్రి రవికుమార్ పిలుపు

బల్లికురవ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకుంటే కార్యకర్తలకు భరోసా ఉంటుందని, ఏదైనా ప్రమాదాలు జరిగితే పార్టీ వారికి అండగా ఉంటుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. సోమవారం బల్లికురవ మండల పార్టీ కార్యాలయంలో అన్ని గ్రామాల టీడీపీ నేతలతో మంత్రి రవికుమార్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అవగాహన కల్పించి అత్యధికంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాలను చేపట్టాలన్నారు. కొన్ని గ్రామాలలో కార్యకర్తలే ముందుకు వచ్చి నమోదు చేసుకుంటున్నారన్నారు. డిసెంబర్ 2 వతేదీ నాటికి నమోదు పూర్తి కావాలని నాయకులకు సూచించారు. అద్దంకి నియోజకవర్గంలో టీడీపీ పార్టీకి ఉన్న ఆదరణ సభ్యత్వ నమోదు ద్వారా చేసి చూపించాలన్నారు. గ్రామాలలో పార్టీ బలోపేతానికి తీసుకోవల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో మండల పార్టీ నేతలు మలినేని గోవిందరావు, కొండేటి ఇజ్రాయల్, తేలప్రోలు రమేష్, గొట్టిపాటి లక్ష్మయ్య, ఆళ్ల చంద్రమౌళి, ముండ్రు దానయ్య పలు గ్రామాలకు చెందిన నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మట్టి.. కొల్లగొట్టి

(5వ పేజీ తరువాయి)

తరలిస్తున్నారు. ఈ భూమిని సంరక్షించేందుకు ఏడుగురు పెద్దల పేర్ల మీద పట్టాలు ఉన్నా, వారిలో కొందరు చెప్పినట్లుగా గ్రావెల్ తరలిస్తుండటంతో గ్రామస్థులు అడ్డుకున్నారు. ఎటువంటి అనుమతి లేకుండానే ఇష్టారీతిగా గ్రావెల్‌ను తరలించడాన్ని ప్రశ్నించారు. సొంత అవసరాలకు, గృహాల వద్ద చదును కోసం గ్రావెల్ తరలిస్తే నానా హడావుడి చేసే మైనింగ్, పోలీస్, రెవెన్యూ అధికారులు భారీయంత్రాలతో, అధిక సంఖ్యలో టిప్పర్లలో రోడ్డుకు గ్రావెల్ తరలిస్తున్నా పట్టించుకోవడం లేదు.


గ్రావెల్ తరలించేందుకు సిద్ధంగా ఉంచిన టిప్పర్లు

అనుమతులు లేకుండా..

పూర్వం నుంచి ఉమ్మడి తిప్పబీడు (పశువుల మేతభూమి)లో నాగంబొట్ల పాలెం, రామభద్రాపురం, సోమవరప్పాడు తూర్పుగంగవరం తదితర గ్రామాలకు చెందిన పశువులు, గొర్రెలు, మేకలు మేతకు వెళుతుంటాయి. ఈ బీడు నుంచి గ్రావెల్ తరలిస్తే భవిష్యత్తులో మేతకు ఇబ్బందిగా ఉంటుందని గ్రామస్థులు ఆందోళన చెంది పనులు అడ్డుకున్నారు. హైవే రోడ్డు నిర్మాణం పేరిట పనులు చేపడుతున్న కంపెనీ వారు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా గ్రావెల్‌ను తరలిస్తున్నారు. గ్రామస్థులు అనుమతి పత్రాలు చూపమన్నా చూపలేదు. దీంతో యంత్రాలను, టిప్పర్లను ఆ ప్రాంతం నుంచి బయటకు పంపివేశారు. హైవే రోడ్డు కాంట్రాక్టర్లతో ఒప్పందం కుదుర్చుకున్న వారు గ్రావెల్ తరలింపును అడ్డుకున్న వారిని ప్రశ్నించటంతో వాగ్వాదం చోటుచేసుకుంది. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి ఉమ్మడి బీడుగా ఉన్న పశువుల మేతభూమిలో అక్రమ మట్టి తవ్వకాలను నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అదే గ'లీజు'

(5వ పేజీ తరువాయి)

చేతివాటం చూపి, ఉదాసీనంగా వ్యవహరించడం, గడువు ముగిసిన వాటికి తిరిగి వేలం వేయకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగానే గండిపడింది.

ఏళ్లతరబడి అవే అద్దెలు

కార్పొరేషన్ నిబంధనల ప్రకారం 56 జీవో అమలు కావాల్సి ఉంది. అర్హులైన వారికి మాత్రమే షాపులు కేటాయించడంతోపాటు, మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్సు సమీపంలోని ప్రైవేటు వ్యాపార షాపుల అద్దెలను పరిగణనలోకి తీసుకుని వాటిపై పదిశాతం అదనంగా అద్దెలు వసూలు చేయాలి. మూడేళ్లకొకసారి మరో పదిశాతం పెంచుతూ రెన్యువల్ చేయాల్సి ఉంది. ఆదాయానికి నష్టం వాటిల్లే క్రమంలో లీజు రద్దు చేసి, తిరిగి వేలం నిర్వహించవచ్చు. నగరపాలక సంస్థలో రెవెన్యూ అధికారులు మామూళ్ల మత్తులో మునిగిపోయి సొంత ఆదాయంపైనే దృష్టిసారిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో లీజుదారులు ఆడింది ఆట పాడింది పాట మారింది. బినామీలు చొరబడి, ప్రభుత్వ దుకాణాలపై పెత్తనం చేస్తూ ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారు.

ఏడాదికి రూ.2కోట్ల రాబడి

అమరజీవి షాపింగ్ కాంపెక్స్‌లో 25, టీఎల్ఎస్ మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 12, అద్దంకి బస్టాండ్ సెంటర్‌లో కాంప్లెక్స్‌లో 24, జయరామ్ సెంటర్‌లో 3, లాయరుపేటలో 40, ఘోష ఆసుపత్రి వద్ద 15, దామోదర సంజీవయ్య కూరగాయల మార్కెట్‌లో హోల్‌సేల్ దుకాణాలు 69, రిటైల్ షాపులు 123 ఉన్నాయి. అదే కాంప్లెక్స్‌లో పండ్ల వ్యాపారులుకు 38, పూల వ్యాపారులకు 28 షాపులను అధికారుల కేటాయించారు. మాంసాహార విక్రయాలకు చేపల మార్కెట్‌కు 25, మాసం మార్కెట్ 25, బేకరీ 1, క్యాంటీన్ 1 చొప్పున కేటాయించారు. గాయత్రి టైర్స్ ఈఆర్ఓ కార్యాలయం, బీసీ బాలికల వసతి గృహాన్ని అద్దెకు కేటాయించారు. గృహ యజమానుల నుంచి ముక్కుపిండి మరీ పన్నులు వసూలు చేసే అధికారులు ప్రభుత్వ బకాయిలపై మాత్రం ఉదాసీనత చూపుతున్నారు. ఏళ్లతరబడి కార్పొరేషన్‌తో కుదుర్చుకున్న ఒప్పందం నేటికి కొనసాగడమే కారణం అని విమర్శలు ఉన్నాయి. దీంతో రూ.కోట్ల రూపాయల విలువ చేసే మునిసిపల్ ఆస్తులు ఉచితంగానే అనుభవిస్తున్న ఆయా దుకాణాల యజమానులను కార్పొరేషన్ అధికారులు ఏం చేయలేకపోతున్నారు. కాగా మున్సిపల్ కాంప్లెక్స్‌ల అద్దెలతో ఇప్పటివరకు దాదాపు రూ.2కోట్ల మేరకే ఆదాయం వస్తోంది. ప్రస్తుత ధర ప్రకారం తిరిగి వేలం నిర్వహించి అద్దెలు పెంచితే ప్రస్తుతం ఏడాదికి రూ.5కోట్లకు పైనే ఆదాయం పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా ఆర్థిక వనరుల పెంపుపై పాలకులు దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

కూరగాయల మార్కెట్‌లో వైసీపీ కంపు

నగరంలోని ఊరచెరువులో గల దామోదర సంజీవయ్య కూరగాయల మార్కెట్‌లో వైసీపీ కంపు కొడుతుంది. మార్కెట్ నిర్మాణం జరిగినప్పటి నుంచి కొందరు ఆ పార్టీ సానుభూతిపరులు షాపులు దక్కించుకుని వాటిలో వ్యాపారాలు చేయకుండా ఆరుబయట వ్యాపారాలు చేస్తూ కార్పొరేషన్‌కు కుచ్చుటోపీ పెడుతున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కోవిడ్ సమయం నుంచి ఒక్క రూపాయి కూడా అద్దెలు చెల్లించకుండా రాజకీయ పలుకుబడితో కొనసాగుతున్నారు. అద్దె వసూలుకు వెళ్లిన ఆర్ఐలను లోబర్చుకుని ఉద్దరగా షాపులను అనుభవిస్తున్నారు. దీంతో ప్రస్తుతం మార్కెట్‌లోని షాపుల నుంచి సుమారు రూ.4.5 కోట్లు అద్దె బకాయిలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీనిపై శనివారం కమిషనరు లీజుదారులతో సమావేశమై, నెలరోజుల్లో షాపుల అద్దెలు చెల్లించాలని ఆదేశించారు. లేనిపక్షంలో రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం కేసులు పెడతామని హెచ్చరించారు.

బినామీలను గుర్తించి చర్యలు తీసుకుంటాం.

డాక్టర్ కే.వెంకటేశ్వరరావు, కమిషనర్



కార్పొరేషన్ కాంప్లెక్స్‌లో లీజుల వ్యవహారంపై దృష్టిసారించాం. కార్పొరేషన్ ఆదాయ వనరులు పెంచేలా చర్యలు చేపట్టాం. బినామీలు ఉన్నట్లయితే ఖచ్చితంగా ఖాళీచేయిస్తాం. అలాగే కొందరు లీజుదారులు కార్పొరేషన్‌కు తక్కువ మొత్తంలో అద్దెలు చెల్లిస్తూ, వేల రూపాయలకు బయట వ్యక్తులకు అద్దెలకు ఇచ్చినట్లు తెలిసింది. దీనిపై త్వరలోనే తగిన విధంగా చర్యలు తీసుకుంటాం. గడువు పూర్తయిన వాటికి వేలంపాట దారా షాపులు కేటాయిస్తాం. మార్కెట్ ధర ప్రకారం అద్దెలు నిర్ణయిస్తాం.

గనుల వద్ద అప్రమత్తం

డీడీఎంఎస్ అధికారి చక్రబోర్తి


క్వారీలో పనులను పరిశీలిస్తున్న చక్రబోర్తి

బల్లికురవ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గ్రానైట్ గనులలో పనుల వద్ద కార్మికులు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ రీజీయన్ 2 డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (డీడీఎంఎస్) సుప్రియో చక్రబోర్తి అన్నారు. సోమవారం వీర్లకొండ వద్ద గల గిరిరాజ్ గ్రానైట్ క్వారీని డీడీఎంఎస్ అధికారులు తనిఖీ చేశారు. ఈసందర్భంగా క్వారీలో చేపడుతున్న పనులను పరిశీలించారు. భద్రతాపరంగా తీసుకుంటున్న చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం ఆయన క్వారీలో పనిచేస్తున్న కార్మికులు, సిబ్బందితో మాట్లాడుతూ గనులలో ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తగా ఉండాలన్నారు. పనుల వద్ద ఫస్టు క్లాసు మేనేజర్ అందుబాటులో ఉండాలన్నారు. బ్లాస్టింగ్ సమయంలో నలువైపులా ఉన్న క్వారీలకు సమాచారం అందించాలన్నారు. క్వారీలలో పొల్యూషన్ రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ తనిఖీలో వీటీసీ బాధ్యులు సుబాస్కర్‌రెడ్డి, క్వారీ యజమానులు రావిపూడి లక్ష్మీన్నారాయణ, పత్తిపాటి సురేష్, మాలపాటి పోతురాజు పాల్గొన్నారు.

గుప్త నిధుల కోసమా?

గోపాలపురంలో క్షుద్రపూజల కలకలం

అద్దంకి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : అపరిచిత వ్యక్తులు శింగరకొండ దిగువ భాగంలో నామ్ రోడ్డు వెంబడి అర్ధరాత్రి సమయంలో పూజలు నిర్వహించడం కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. అద్దంకి మండలంలోని గోపాలపురం సమీపంలో శింగరకొండ దిగువన రాజమండ్రి, నంద్యాల తదితర ప్రాంతాలకు చెందిన కొత్త వ్యక్తులు ఆదివారం రాత్రి పూజలు చేశారు. విషయం తెలుసుకున్న గోపాలపురం గ్రామస్థులు అక్కడికి వెళ్లి ప్రశ్నించేందుకు ప్రయత్నించగా వారిపై వారు రాళ్లదాడికి ప్రయత్నించారు. దీంతో మరి కొంత మంది గ్రామస్థులను కలుపుకొని మూకుమ్మడిగా వెళ్లగా నలుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. మరో ఇద్దరు పరారయ్యారు. దొరికిన వ్యక్తులను గ్రామస్థులు ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలు చెప్పడంతో అనుమానానికి తావిస్తుంది. గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చి ఆ నలుగురినీ అప్పగించినట్లు సమాచారం. పోలీసుల విచారణలో అసలు విషయం తెలియాల్సి ఉంది. శింగరకొండ మీద గుప్త నిధులు ఉండి ఉంటాయన్న అనుమానంతో పూజలు నిర్వహించి ఉంటారని అనుమానాలు వ్యక్తం అవుతుండగా, మరి కొందరు మాత్రం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ప్రోద్బలంతో క్షుద్రపూజలు జరిగినట్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ కృష్ణయ్య తెలిపారు.



పూజ సామగ్రి, పూజ చేస్తున్న వ్యక్తి

అవీఇవీ

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు భూమి పూజ


భూమిపూజ చేస్తున్న స్థానికులు

సంతనూతలపాడు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి: స్థానిక జడ్పీహైస్కూల్లో డిసెంబరు 5 నుంచి 8 వరకు నాలుగురోజులపాటు జరగనున్న సూదనగుంట కోటయ్య చౌదరి, ఆదిలక్ష్మి మెమోరియల్ 71 వ ఆంధ్ర సీనియర్ పురుషులు, మహిళల రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు సూదనగుంట ఫౌండేషన్ నిర్వాహకులు సూదగుంట కృష్ణమూర్తి సోమవారం భూమిపూజ చేశారు. తొలుత శ్రీవేంకటేశ్వస్వామి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేకపూజల్లో పాల్గొన్నారు. పోటీలలో పాల్గొనే స్త్రీ, పురుష క్రీడాకారులకు వసతి, భోజనం ఉచితంగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కుర్రా భాస్కరరావు, చైర్మన్ ఎన్.చంద్రమోహన్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, నాయకులు రావులపల్లి సురేష్, తన్నీరు శ్రీను, బి.శంకర్, ఆర్.అంకారావు, ఎం.వెంకటేశ్వర్లు, ఎం.శ్రీనివాసరావు, ఎస్.శ్రీరామ్మూర్తి, పలువురు పీడీలు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న సీఐ హజరత్తయ్య, ఎస్సై మహేంద్ర

సింగరాయకొండ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని సీఐ చావా హజరత్తయ్య సూచించారు. మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న పీఎస్‌సీపీ డిగ్రీ కళాశాలలో సోమవారం సైబర్, మహిళలు, బాలికలపై జరుగుతున్న నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాల ఊబిలో చిక్కుకోకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్‌ను తీసుకోవడం, రవాణా చేయడం చట్టరీత్యా నేరమన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. తెలియని నంబర్ల నుంచి వివాహ ఆహ్వానాలు వస్తే వాటిని ఓపెన్ చేయవద్దని సూచించారు. సైబర్ నేరగాళ్లు ఫోన్‌ను హ్యాక్ చేస్తే వెంటనే 1930 నంబరుకు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. విద్యార్థులు, మహిళలు పనిమీద బయటకు వచ్చే సమయంలో సమాచారాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయాలన్నారు. వాహనాలను నడిపే ప్రతి ఒక్కరూ లైసెన్స్ కలిగి ఉండాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్సై బి.మహేంద్ర, ప్రిన్సిపాల్ డి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

హింస లేని సమాజాన్ని సాధించాలి


మాట్లాడుతున్న డాక్టర్ ఉదయిని


ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మహిళలు, చిన్నారులపై ప్రతిక్షణం ఎక్కడో ఒక చోట అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయని, అటువంటి దారుణాలను అరికట్టి హింసలేని సమాజ సాధన కోసం కృషి చేయాలని బేతూన్ నర్సింగ్ హోమ్‌వైద్యురాలు డాక్టర్ ఉదయిని పిలుపునిచ్చారు. ప్రపంచ హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక హర్షిణీ కాలేజీలో ఐద్వా ఆధ్వర్యంలో జరిగిన సెమినార్‌లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఐద్వా నగర కార్యదర్శి ఆదిలక్ష్మి అధ్యక్షతన జరిగిన సదస్సులో ఉదయిని మాట్లాడుతూ సమాజంలో పెరుగుతున్న హింస, అఘాయిత్యాలు మహిళా సమానత్వానికి, సమాజాభ్యున్నతికి ఆటంకంగా మారుతున్నాయన్నారు. ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ అన్ని రంగాల్లో అగ్రభాగానికి ఎదుగుతున్న మహిళలను అణచివేసే విధంగా హింస పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల రక్షణ కోసం తెచ్చిన చట్టాలను సక్రమంగా ప్రభుత్వాలు అమలు చేయాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నేతలు ఎస్కే నాగూర్‌బి, బి. రాజ్యలక్ష్మి, బి. గోవిందమ్మ, బి. పెద్ద గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు. ప్రజానాట్య మండలి సుజాత మహిళా గేయాలను ఆలపించారు.

యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షునిగా పాపారావు

చినగంజాం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) జిల్లా గౌరవ అధ్యక్షునిగా సోపిరాల గ్రామానికి చెందిన సిద్దం పాపారావు ఎన్నికయ్యారు. పాపారావు పల్లెపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని బాపయ్యనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా ఉన్నారు. బాపట్లలోని సూర్యకాళీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన స్వర్ణోత్సవ మహాసభ, నూతన కౌన్సిల్ సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ టీఎస్ఎల్ఎన్. మల్లేశ్వరరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఎన్నికలలో పాపారావుని జిల్లా గౌరవ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. గత మూడు పర్యాయములుగా జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఎన్నికవుతూ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం చినగంజాంలో జరిగిన అభినందన సభలో పాపారావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. పాపారావుకి మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మెట్టు శ్రీనివాసరావు, షేక్ నాయబ్‌రసూల్, గౌరవ అధ్యక్షులు ఎస్.సూర్యనారాయణ, ఉపాధ్యక్షులు సీ.హెచ్.వెంకట్, టీ.సౌజన్య తదితరులు అభినందనలు తెలిపారు.

నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిపైకి దూసుకెళ్లిన బైకు

గణపవరానికి చెందిన అధ్యాపకుడు మృతి


ప్రసాద్ (ఫైల్)

పర్చూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ హైవేరోడ్ పనుల్లో భాగంగా నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిపైకి ద్విచక్రవాహనం దూసుకుపోయి వ్యక్తి మృతి చెందిన సంఘటన చీరాల రోడ్డులోని ఎస్ఎఫ్ఎస్ పాఠశాల సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు సమాచారం మేరకు పల్నాడు జిల్లా, చిలకలూరిపేట మండలం, గణపవరానికి చెందిన జంపని ప్రసాద్(38) చీరాలలోని ఓ ప్రయివేట్ కళాశాలలో ఫ్యాకల్టీగా పనిచేస్తున్నారు. రోజు మాదిరిగానే ఆదివారం రాత్రి చీరాల నుండి తన స్వగ్రామం బైక్‌మీద వెళుతూ ప్రమాదానికి గురయ్యాడు. నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన డైవర్షన్ బోర్డును గమనించకపోవడంతో ద్విచక్ర వాహనం నేరుగా బ్రిడ్జిలోకి దూసుకుపోయింది. దీంతో అతని తల కాంక్రీట్ గోడకు బలంగా ఢీకొనడంతోపాటు, బ్రిడ్జికి ఏర్పాటు చేసిన ఇనుప కడ్డీలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనం కూడా పూర్తిగా దెబ్బతింది. ఉదయాన్నే మృతదేహాన్ని గుర్తించిన వాహన దారులు, బ్రిడ్జి నిర్మాణ కూలీలు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ మాల్యాద్రి తన సిబ్బందితో హుటాహుటినా చేరుకొని సిబ్బంది సహాయంతో లోయలో నుంచి మృతదేహాన్ని బయటకు తీయించారు. విషయం తెలుసుకున్న ప్రసాద్ కుటుంబ సభ్యులు చేరుకొని బోరున విలపించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పంచనామా అనంతరం పర్చూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ప్రసాద్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.



వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో కోటి దీపోత్సవం

త్రిపురాంతకంలో త్రిపురాంతకేశ్వరుడు

మార్కాపురంలోని అర్ధనారీశ్వర అలంకారంలో మార్కండేశ్వర స్వామి

ఒంగోలులోని శివాలయంలో దీపం వెలిగిస్తున్న యువతి

ఒంగోలులోని శివాలయంలో దీపం వెలిగిస్తున్న యువతులు

ఒంగోలులో పూజలు చేస్తున్న భక్తులు

త్రినేత్రం.. పవిత్రం



భక్తితో దీపం పెడుతున్న మహిళ



రాజరాజేశ్వరి దేవాలయంలో దీపాలు పెడుతున్న మహిళలు

కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో జిల్లాలోని పలు ఆలయాలు శివనామస్మరణతో మారుమోగాయి. దూపదీపాలతో కళకళలాడాయి. పలు ఆలయాల్లో ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ముఖ్యంగా మహిళలు పెద్దసంఖ్యలో శివాలయాలకు చేరుకుని కార్తీక దీపారాధనలు చేశారు. ఒంగోలు కేశవస్వామి పేటలోని గంగాపార్వతీ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం, విజయదుర్గా దేవస్థానం, తూర్పుపాలెం రాజరాజేశ్వర స్వామి దేవస్థానం తదితర ఆలయాల్లో పూజలు ఘనంగా చేశారు. త్రిపురాంతకంలోని త్రిపురాంతకేశ్వరస్వామి, మార్కాపురంలోని అర్ధనారీశ్వర అలంకారంలో మార్కండేశ్వర స్వామి ఘనంగా పూజలందుకున్నారు.



టంగుటూరులోని 1116 శివలింగాల క్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి అందుతున్న అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారానికి సమగ్రమైన, సంతృప్తికరమైన పరిష్కారాలు అందించాలన్నారు. అర్జీల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. కాగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజానీకం పలురకాల సమస్యలపై 266 వినతులను అందజేశారు. కార్యక్రమంలో జేసీ ఆర్.గోపాలకృష్ణ, డీఆర్వో చిన ఓబులేసు, డిప్యూటీ కలెక్టర్లు వరకుమార్, లోకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాజీమంత్రి సురేష్ నుంచి తమ భూమిని ఇప్పించాలని కలెక్టర్‌ను కోరుతున్న బాధితులు

మాజీమంత్రి చెర నుంచి భూమిని విడిపించాలి

మార్కాపురం మండలం దరిమడుగు గ్రామంలో తమ భూమిని ఆక్రమించుకున్న మాజీమంత్రి ఆదిమూలపు సురేష్, ఆయన తమ్ముడు సతీ్‌ష్‌పై చర్యలు తీసుకుని, తమకు భూమిని అప్పగించాలని ఆ గ్రామానికి చెందిన బుట్టగిరి రంగరామాంజులరెడ్డి కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. తమకు పూర్వం నుంచి గ్రామంలోని 841/1 సర్వే నెంబరులో మూడు ఎకరాల భూమి ఉందన్నారు. ఆ భూమిని మాజీ మంత్రి సురేష్ 15ఏళ్ల క్రితం ఆక్రమించుకున్నారన్నారు. అప్పటి నుంచి పోరాటం చేస్తున్నా పట్టించుకోలేదన్నారు. ఆ భూమికి సంబంధించిన అన్నిరకాల డాక్యుమెంట్లు తమ వద్ద ఉన్నాయని, అందువల్ల తమకు న్యాయం చేసి ఆదుకోవాలని విన్నవించారు. ఇప్పటికే ఈ భూమి విషయమై హైకోర్టును కూడా ఆశ్రయించామని, తమకు న్యాయంచేసి ఆదుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

మానవత్వం చాటుకున్న అధికారులు

వృద్ధ ఆశ్రమానికి తలించిన అధికారులు



వృద్ధ మహిళతో అధికారులు, ఆశ్రమం ప్రతినిధులు

ఎర్రగొండపాలెం రూరల్ నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : 'ఆ వృద్ధ మహిళ ఎవరో తెలియదు. ఆమెను రెండు రోజుల క్రితం ఎర్రగొండపాలెంలోని ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల సమీపంలో ఆంజనేయస్వామి దేవాలయం పక్కన ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు వదిలి వెళ్లారు. దీంతో ఆ వృద్ధురాలికి దీనావస్థ ఆనే 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన కథనానికి తహసీల్దార్ బాలకిషోర్ స్పందించారు. సోమవారం వృద్ధ మహిళ ఉన్న ప్రదేశానికి వీఆర్వో దానం, ప్రైవేటు ఉపాధ్యాయుడు నానా నాగేశ్వరరావు, పంచాయితీ కార్యదర్శి రాజశేఖరరెడ్డి వైద్యుడు యదిద్యా దేవర సహకారంతో కురిచేడు మండలం వీరాయపాలెంలోని కరుణ వృద్ధాశ్రమానికి తరలించారు.

90 టిక్కీల రేషన్ బియ్యం పట్టివేత

గిద్దలూరు టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 90 టిక్కిల రేషన్ బియ్యాన్ని గిద్దలూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గిద్దలూరు మండలం నుంచి రేషన్‌బియ్యం అక్రమంగా సరఫరా అవుతోందని సీఐ సురేష్‌కు సమాచారం అందింది. దీంతో ఆయన ఆదిమూర్తిపల్లె సమీపంలో తనిఖీలు నిర్వహించారు. టాటా ఏస్ వాహనంలో తరలిస్తున్న 90 టిక్కిల రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. గిద్దలూరు, కొత్తకోట రేషన్‌షాపుల నుంచి ఈ బియ్యం తరలిస్తుండగా ఆదిమూర్తిపల్లె వద్ద పట్టుబడినట్లు తెలుస్తోంది.

పాముకాటుతో బాలుడి మృతి



దేవాన్ష్ (ఫైల్)

కాటారం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పాముకాటుతో మూడేళ్ల బాలుడు మృతి చెందిన సంఘటన భూపాలపల్లి జిల్లా కాటారంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. కాటారం మండల కేంద్రం పరిధి ఎర్రగుంటపల్లిలో కల్లగుంట వెంకటేశ్వర్లు, లక్ష్మి దంపతులు నివసిస్తున్నారు. స్థానిక స్టేట్ బ్యాంకులో వెంకటేశ్వర్లు ఉద్యోగం చేస్తుండగా వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కూతురు త్రివేణికి ఒంగోలుకు చెందిన సత్యనారాయణతో వివాహం జరిపించారు. వారికి ఇద్దరు కూతుళ్లతో పాటు కుమారుడు దేవాన్ష్(3) ఉన్నాడు. త్రివేణి, సత్యనారాయణ దంపతులు ఒంగోలులో ప్రైవేట్ ఉద్యోగాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. దేవాన్ష్‌ను చూసుకోవడానికి ఇబ్బంది అవుతుందని భావించి కాటారంలో ఉన్న అమ్మమ్మ, తాతయ్యల వద్ద ఉంచారు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం ఇంటిముందు ఆడుకుంటున్న దేవాన్ష్ ఒక్కసారిగా ఏడ్వడం మొదలెట్టాడు. అమ్మమ్మ లక్ష్మి బయటికి వచ్చేసరికి పాము తోక కనిపించింది. దీంతో పాము కాటేసిందని గుర్తించి స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం భూపాలపల్లిలోని వంద పడకల ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన అక్కడి వైద్యులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి రెఫర్ చేశారు. చికిత్స అందిస్తున్న క్రమంలోనే దివాన్ష్ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు.

రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా చాంపియన్ కృష్ణా

విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పటమట జడ్పీ ఉన్నతపాఠశాలలో రెండురోజులపాటు జరుగుతున్న 68వ స్కూల్ గేమ్స్ అండర్-13 బాలబాలికల విభాగాల్లో ఉమ్మడి కృష్ణా జట్లు చాంపియన్‌షిప్ వశం చేసుకున్నాయి. క్రీడాకారులు తిరుగులేని ఆధిక్యత కనబరిచి విజేతలుగా నిలిచారు. బాలుర ఫైనల్స్‌లో అనంతపురంపై 15-9, 15-11తో, బాలికల ఫైనల్స్‌లో పశ్చిమగోదావరిపై 15-6, 15-2తో జయభేరి మోగించాయి. రెండు విభాగాల్లో మూడో స్థానాల్లో తూర్పుగోదావరి, నెల్లూరు జట్లు నిలిచాయి. ట్రోఫీల ప్రదానోత్సవంలో కేజీబీవీ పాఠశాలల రాష్ట్ర డైరెక్టర్ డి.దేవానంద్‌రెడ్డి, స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలి

- ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు

- వాటర్ వర్క్స్ సిబ్బందికి కమిషనరు వెంకటేశ్వరరావు ఆదేశం

ఒంగోలు, కార్పొరేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నగరంలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని, ప్రజల నుంచి ఫిర్యాదుల రాకుండా పనిచేయాలని నగర కమిషనరు డాక్టర్ కే.వెంకటేశ్వరరావు వాటర్ వర్క్స్ సిబ్బంది టర్న్‌కాక్, ఎలక్ట్రీషియన్‌లు, పార్కు వర్కర్లను ఆదేశించారు. సోమవారం ఇంజనీరింగ్ విభాగంలోని వాటర్ వర్క్స్ విభాగాన్ని అకస్మికంగా తనిఖీ చేసి, మస్టర్ పరిశీలించారు. ఎవరెవరు, ఎక్కడ పనిచేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. నగరంలో పైపులైను లీకులు, నీటి సరఫరా సమయపాలన, తాగునీటి పరీక్షలు, మురుగునీటి సరఫరా తదితర సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలించి, అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అలాగే నీటి ట్యాంకర్ల శుభ్రత, ఫిల్టర్‌బెడ్‌ల వద్ద విద్యుత్ సరఫరా, మొక్కలకు ప్రతి రోజూ నీరు పోయడం వంటి పనులు సక్రమంగా నిర్వర్తించాలని కమిషనరు ఆదేశించారు. నీటి సరఫరా అయ్యే రోజుల్లో ఆ ప్రాంతాల్లోని ప్రజలకు తెలియజేయాలని, నీటి సరఫరాలో లోపాలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ట్యాప్ ఇన్‌స్పెక్టర్ కాట్రగడ్డ నరసింహారావు, ఫిట్టర్లు, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందిని ఆదేశిస్తున్న కమిషనరు

వసతి గృహ విద్యార్థినులకు దుప్పట్ల పంపిణీ

ఒంగోలునగరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి):స్థానిక సాంఘిక సంక్షేమశాఖ బాలికల వసతి గృహాల్లోని విద్యార్థినులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా సోమవారం రాత్రి దుప్పట్లు, కార్పెట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని వసతి గృహాల్లో సౌకర్యాల కల్పనకు కృషి జరుగుతుందన్నారు. సాంఘిక సంక్షేమశాఖ మంత్రి జిల్లాకు చెందిన వారు కావటంతో వసతి గృహాల్లో సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. రూ.550 కోట్లతో అన్ని వసతి గృహాలను ఆధునికీకరించే కార్యక్రమాన్ని చేపట్టారని ఆమె అన్నారు. శింగరాయకొండలో కళాశాల, వసతి గృహం రెండూ ఒకేచోట ఏర్పాటుచేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. ప్రతి విద్యార్థిప్రభుత్వం కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మానాయక్, సహాయ సాంఘిక సంక్షేమాధికారి లింగయ్య, వసతి గృహాల సంక్షేమాధికారులు డి.అంకబాబు, జి.మునికుమార్,రాఘవులు, ప్రభుదాస్,బి.శిరిష, కె.స్వప్నలత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

కరాటేలో సత్తాచాటిన క్విస్ విద్యార్థి



విద్యార్థినిని అభినందిస్తున్న అధ్యాపకులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గుంటూరుజిల్లా అమరావతిలో జరిగిన ఒపెన్ కరాటే చాంపియన్ షిప్-24 లో క్విస్ హైస్కూలు విద్యార్థి సత్తా చాటాడు. క్విస్ హైస్కూలులో నాల్గో తరగతి చదువుతున్న ఎ. మహేంద్రకుమార్ పోటీల్లో పాల్గొని ద్వితీయ బహుమతి సాధించాడు. ఈ సందర్భంగా క్విస్ సంస్థల ఛైర్మన్ డాక్టర్ ఎన్. సూర్య కల్యాణచక్రవర్తి, వైస్‌ఛైర్మన్ డాక్టర్ ఎన్. గాయత్రిలు మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువు పరంగానే కాకుండా క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి తోడ్పడతాయన్నారు. ఈ సందర్భంగా కరాటేలో బహుమతి సాధించిన మహేంద్రకుమార్‌ను అభినందించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ కమలేశ్వరి, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు గిద్దలూరు విద్యార్థులు

గిద్దలూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరులోని జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థినులు రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికయ్యారు. జిల్లాస్థాయిలో చందలూరులో జరిగిన త్రోబాల్ పోటీలలో అండర్-17 విభాగంలో ఎన్.వీరదీప, పి.రత్నకుమారి, డి.రహీన, స్టాండ్‌బైగా బి.నాగశ్వేత, అండర్-14 విభాగంలో బి.భార్గవి, ఫస్ట్ స్టాండ్ బైగా ఎం.అనూష ప్రతిభ కనపరచి జిల్లా జట్టు తరపున రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికయ్యారు. హెచ్ఎం నాగభూషణ్‌రెడ్డి, మండల స్కూల్‌గేమ్స్ కోఆర్డినేటర్ గుర్రం శోభన్‌బాబు, ఫిజికల్ డైరెక్టర్ ఎం.ధనలక్ష్మిలు పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఈ విద్యార్థులను పలువురు అభినందించారు. కాగా కరాటేలో బ్రౌన్ బెల్టు సైతం సాధించిన బుడత భార్గవికి ధ్రువీకరణపత్రం అందజేశారు.



ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

సంక్షిప్తంగా..

యూటీఎఫ్ అధ్యక్షుడిగా శ్రీనివాసులు

ఒంగోలు(రూరల్)నవంబరు 25(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ ఒంగోలు మండల అధ్యక్షుడిగా దార్ల శ్రీనివాసులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఒంగోలు మండల కార్యవర్గాన్ని స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా బి.సోమసుందరరావు, ఉపాధ్యక్షులుగా కె.వీరనారాయణ, ఎం.సధ్యారాణి, జిల్లాకౌన్సిలర్‌గా ఎస్.రాజేశ్వరి, ఆర్.నారాయ ణ, ట్రెజరర్‌గా ఎం.వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. ఎన్నికల నిర్వహణాధికారులుగా ఎన్. చిన్నస్వామి, ఎస్వీ .కొండారెడ్డి వ్యవహరించారు ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపకరణాలు అందజేత

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గ్రీవెన్స్‌సెల్‌లో ఉపకరణాలు అందజేయాలని సోమవారం ఒంగోలు మండలం పెల్లూరుకు చెందిన వద్దరపు సుబ్బరత్నంకు మూడు చక్రాల సైకిల్‌తో పాటు సంక కర్రలు, పామూరు మండలం బొట్ల గుడూరుకు చెందిన గుంజికొండలరావు వీల్‌చైర్ కోసం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ అన్సారియా వెంటనే స్పందించి దివ్యాంగుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు అర్చనను వాటిని సమకూర్చాలని ఆదేశించారు. వెంటనే మూడు చక్రాల సైకిల్‌తో పాటు వీల్‌చైర్‌ను బాధితులకు అందజేశారు

ఉపాధ్యాయ సమస్యలపై ఆందోళనలు

ఒంగోలు విద్య, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల ఆర్థిక బకాయిలు చెల్లింపులు, విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం జిల్లా స్థాయిలో వచ్చేనెల 20,21 తేదీల్లో, జనవరిలో రాష్ట్ర స్థాయిలో ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు బి. వెంకటరావు, బి.అశోక్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి కేవీజీ కీర్తి, ఐఫియాకౌన్సిలర్ పీవీ సుబ్బారావులు తెలిపారు. ఆ మేరకు అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రాష్ట్ర సంఘం నోటీసులను సోమవారం అందజేసినట్లు తెలిపారు.

సమగ్ర కులగణన చేపట్టాలి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా జాతీయ స్థాయిలో నిర్వహించ తలపెట్టిన జనగణనతో పాటే సమగ్ర కుల గణన చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బలగాని ఆంజనేయులు కోరారు. సోమవారం కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు.

జాగర్లమూడికి కన్నీటి వీడ్కోలు

మర్రిపూడి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గుండెపోటుతో మృతి చెందిన సొసైటీ మాజీ అధ్యక్షుడు, టీడీపీ సీనియర్ నాయకుడు జాగర్లమూడి రామారావు మృతదేహానికి బంధుమిత్రుల అశ్రునయనాల మధ్య సోమవారం స్వగ్రామమైన వేమవరంలో అంత్యక్రియలు నిర్వహించారు. రామారావు భౌతికకాయాన్ని విశ్రాంత డీఈ చప్పిడి చినరామలింగయ్య, తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యర్రమోతు శ్రీనివాసులు, జిల్లా అధికార ప్రతినిధి రేగుల వీరనారాయణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా, మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకురాలు కె.అరుణ తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

మహాధర్నాను జయప్రదం చేయాలి

టంగుటూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా మంగళవారం ఒంగోలులో నిర్వహిస్తున్న మహాధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు కోరారు. ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆయన సోమవారం టంగుటూరులో యూనియన్ నేతలతో కలిసి ఆవిష్కరించారు.

మ్యాపింగ్, జియో ట్యాగింగ్‌ను పూర్తి చేయాలి

- కలెక్టర్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిర్దేశించిన మ్యాపింగ్, జియోట్యాగింగ్ లక్ష్యాలను ఈనెలాఖరులోపు వంద శాతం పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందిని పూర్తిగా ఈ విధులకే పరిమితం చేయాలన్నారు. స్థానిక కలెక్టరేట్ నుంచి సోమవారం సాయంత్రం డివిజనల్, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. ఈనెలాఖరు నాటికి ప్రతి ఇంటిని ఫొటో తీసి జియోట్యాగింగ్ చేయాలని, అందరి బ్యాంకు ఖాతాలను ఎన్‌పీసీఐతో మ్యాపింగ్ చేయాలన్నారు. హౌస్ హోల్డ్ క్లస్టర్లను ఆయా హ్యాబిటేషన్లు, గ్రామ పంచాయతీలు, రెవెన్యూ గ్రామాలతో మ్యాపింగ్ చేయాలన్నారు. ఈ లక్ష్య సాధనలో జిల్లా ఏమాత్రం వెనుకబడితే మాత్రం సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. సచివాలయ సిబ్బంది అందరూ వంద శాతం బయోమెట్రిక్ హాజరు వేసేలా చూడాలని, విధుల పట్ల ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం వహిస్తూ దీర్ఘకాలిక సెలవులు పెట్టిన వారిపైదృష్టి సారించాలని సూచించారు. సిబ్బందిపై సమగ్ర పర్యవేక్షణ లేకపోతే ఎంపీడీవోలు, కమిషనర్లపై తాను చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అలాగే గ్రీవెన్స్ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చే రిఫరల్ అర్జీలను పరిశీలించి వాటికి తగిన ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. కోర్టు కేసుల విషయంలో కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. అంగన్‌వాడీలలో టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలను వచ్చేనెల 10 నాటికి అందుబాటులో తేవాలని కలెక్టర్ సూచించారు. మంచినీటి ట్యాంకర్లకు బిల్లుల చెల్లింపు, తదుపరి చర్యలకు వాటర్ ఆడిట్ కీలకమైనందున సంబంధిత నివేదికలను మండలాల వారీగా సత్వరమే పంపించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం అంశాల వారీగా సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, డీఆర్వో చిన ఓబులేషు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు వెంకటేశ్వర్లు, చిరంజీవి, జి. వెంకటనాయుడు, శ్రీనివాస ప్రసాద్, మాధురి, పద్మజ, జగన్నాధరావు, విద్యాసాగర్, వరలక్ష్మి, అర్చన, జోసఫ్‌కుమార్, వసుంధర, డాక్టర్ బేబిరాణి, గౌస్‌బాషా, కనిగిరి ఆర్డీవో కేశవర్ధనరెడ్డి తదితరులు ఉన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

జండర్ పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్

యునిసెఫ్ భాగస్వామ్యంతో నిర్వహించనున్న జండర్ క్యాంపెయిన్ పోస్టర్లను కలెక్టర్ తమీమ్ అన్సారియా సోమవారం గ్రీవెన్స్ హాలులో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరిచారు. అనంతరం జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, ఇతర జిల్లా అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా సమాఖ్య ఈసీ సభ్యులు చేసిన ర్యాలీని కలెక్టర్ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సోమవారం నుంచి వచ్చేనెల 23వతేదీ వరకు సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు చిరంజీవి, వసుంధర, జోసెఫ్‌కుమార్, మాధురి, రవికుమార్, వెంకటనాయుడు, డాక్టర్ బేబిరాణి, బాలాంజనేయులు, రాజశేఖర్, లక్ష్మానాయక్ తదితరులు ఉన్నారు.

గల్ఫ్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం

గ్రీవెన్స్‌లో ఎస్పీకి బాధితుడి ఫిర్యాదు



ఫిర్యాదుదారుల సమస్యలు వింటున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు(క్రైం), నవంబరు25 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ దేశాలలో ఉద్యోగాలు ఇప్పిస్తానని ఇద్దరు వ్యక్తులు డబ్బులు వసూలు చేసి తనను మోసం చేసారని దొనకొండకు చెందిన బాధితుడు ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశాడు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక జరిగింది. ఉద్యోగాల పేరుతో అనేక మంది వద్ద నగదు వసూలు చేసిన వ్యక్తులు దొనకొండలో యథేచ్ఛగా తిరుగుతున్నారని ఎస్పీకి విన్నవించారు. అదే విధంగా దర్శిలో ఓ కారును ఒంగోలుకు చెందిన వ్యక్తి రూ. 4 లక్షలకు కొనుగోలు చేసి రెండు లక్షలు ఇచ్చి,మిగిలిన రెండు లక్షలు ఇవ్వకుండా డబ్బులు అడిగితే బెదిరిస్తున్నాడని ఎస్పీ వద్ద వాపోయాడు. ఇలా జిల్లా వ్యాప్తంగా 81 మంది తన సమస్యలను ఎస్పీకి విన్నవించారు. ఆయా సమస్యలను చట్ట పరిధిలో సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో సీఐలు శ్రీకాంత్ బాబు ,సుధాకర్, సుబ్బారావు, ఎస్సై రజియా సుల్తానా, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక వనమహోత్సవం



1,116 శివలింగాలను దర్శించుకుంటున్న భక్తులు

ఒంగోలు, కార్పొరేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని చెన్నకేశవ లే అవుట్ పార్కు (ఎన్టీఆర్ పార్కు) నందు కార్తీక వన మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం పార్కులో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వాకర్స్‌తో పాటు, పలువురు సభ్యులు కుటుంబ సమేతంగా పాల్గొని సంతోషాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా పెద్దలు, చిన్నారులు ఆటపాటలతో, సాంస్కృతి కార్యక్రమాలతో సందడి చేశారు. అనంతరం ఏడువందల మందికి పైగా వనభోజనాలలో పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వాహకులుగా పార్కు కమిటీ ప్రతినిధులు చెన్నుపాటి వర ప్రసాద్, చెన్నుపాటి వేణుగోపాల్, కుర్రా భాస్కర్‌రావు, డి.ధనుంజయరావు, గణపతి మాస్టర్, పలువురు కమిటీ ప్రతినిధులు వ్యవహరించారు.

జమ్ములపాలెం శివలింగాల వేదికలో..

టంగుటూరు : కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా మండలంలోని జమ్ములపాలెంలో ఉన్న 1,116 శివలింగాల వేదిక శివనామస్మరణతో మార్మోగింది. వేలాదిగా భక్తులు తరలివచ్చారు. పంచముఖేశ్వరుడిని దర్శించుకొని అభిషేకాలు చేశారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ నిర్వాహకుడు బ్రహ్మయ్య, వలంటీర్లు పర్యవేక్షించారు.

నర్సింగోలులో సత్య ప్రత్యేక పూజలు

జరుగుమల్లి (కొండపి) : రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య నర్సింగోలులోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పొన్నలూరు మండలంలోని సంగమేశ్వరుడిని కూడా ఆయన దర్శించుకున్నారు. సత్య వెంట తెలుగు యువత నాయకులు అనుమోలు సుధాకర్, తాటికొండ మహేంద్ర తదితరులు ఉన్నారు.

చీమకుర్తిలో

చీమకుర్తి : కార్తీక మాసంలో చివరి సోమవారంను పురస్కరించుకొని చీమకుర్తి పట్టణం,మండలంలోనిశివాలయాలుతోపాటు పలు ఆలయాల్లో వైభవంగా పూజలు జరిగాయి.శివాలయాల్లో ఉదయంనుంచే మూలవిరాట్లకు అభిషేకాలు నిర్వహించారు.రాత్రివేళ మహిళలు పెద్దఎత్తున కార్తీకదీపాలు వెలిగించారు.లక్షార్చన కార్యక్రమాన్ని పలు ఆలయాల్లో చేపట్టారు.

మద్దిపాడులో..

శివాలయంలో కార్తీక సోమవార పూజలు ఘనంగా జరిగాయి. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు పరాంకుశం గంగాధర్ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని కార్తీక దీపారాధనలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం జరిగింది.

శనగ రైతులను ఆదుకోవాలి

కొండపి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : శనగలకు ప్రభుత్వం కనీస మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీపతి సతీష్ డిమాండ్ చేశారు. ఆమేరకు తహసీల్దార్ మురళికి సోమవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీపతి ప్రకాశం, పార్టీ మండల అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు మృతి

మద్దిపాడు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని కారుమూడివారిపాలెం ఎంపీపీ స్కూల్ మెయిన్ ప్రధానోపాధ్యాయుడు పూనూరి నాగేశ్వరరావు సోమవారం తెల్లవారు జా మున 3 గంటల సమయంలో గుండెపోటుతో మరణించారు. మండల విద్యాశా ఖ అధికారి మెడబలిమి శ్రీనివాసరావు, ఏపీటీఎఫ్ సంఘ నాయకులు పూలమా ల వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కాల్పులు దుర్మార్గం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరప్రదేశ్‌లో ముస్లింలపై పోలీసులు కాల్పులు జరపడం దుర్మార్గంగా ఉందని సోషియల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ సత్తార్ మండిపడ్డారు. స్థానిక బిలాల్‌నగర్ కమ్యూనిటీ సర్కిల్ సెంటర్‌లో సోమవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.



బాధితులకు ఆర్థిక సహాయం చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

పేదల ఆర్యోగ్యానికి ప్రభుత్వం అండ

- ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు, కార్పొరేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి):పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేయడంతోపాటు, అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించి అండగా నిలుస్తుందని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ తెలిపారు. నియోజకవర్గానికి చెందిన పలువురు అనారోగ్యానికి గురై, ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం వారికి ముఖ్యమంత్రి సహాయనిధి కింద సహాయం అందజేసింది. ఈమేరకు ఒంగోలులోని పార్టీ కార్యాలయంలో 18 మంది బాధిత కుటుంబాలకు దామచర్ల రూ. 13,06,034 చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వారు దామచర్ల జనార్దన్‌ను, ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు కొఠారి నాగేశ్వరరావు, బండారు మదన్, పలువురు పాల్గొన్నారు.

సరళాదేవినగర్ వాసులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న సరళాదేవి నగర్ మహిళలు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలోని సరళాదేవి నగర్ కాలనీ వాసులకు ఇళ్ల పట్టాలు ఇవ్వడంతో పాటు శివారు కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ డిమాండ్ చేశారు. సీపీఐ ఒంగోలు నగర సమితి ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు సామూహిక అర్జీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి శ్రీరామ శ్రీనివాసరావు, సరళాదేవి నగర్ కార్యదర్శి కైలా అజయ్ తదితరులు ఉన్నారు. అంతకు ముందు మల్లయ్యలింగం భవన్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

సమస్యలు పరిష్కరించాలి

- కార్పొరేషన్ ఎదుట కార్మికుల ధర్నా



నిరసన తెలుపుతున్న కార్మికులు

ఒంగోలు, కార్పొరేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏపీ మునిసిపల్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు చీకటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం కార్పొరేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్పొరేషన్‌లో ఆప్కాస్ పద్ధతిన పనిచేస్తున్న పారిశుధ్య, ఇంజనీరింగ్ విభాగంలోని విద్యుత్ కార్మికులు, వివిధ సెక్షన్‌లలో పనిచేస్తున్న కార్మికులకు ఐదు నెలలుగా వేతనాలు పెండింగ్ ఉన్నాయన్నారు. అలాగే కొవిడ్ విధానంలో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు కూడా ఇవ్వకపోవడంతో కార్మికుల కుటుంబ పరిస్థితులు దయనీయంగా ఉన్నాయని తెలిపారు. ఏప్రిల్ నెల నుంచి మెడికల్ అలవెన్స్‌లు పెండింగ్‌లో ఉన్నాయని, అధికారులు సమస్యలు పరిష్కరించకుంటే మెరుపు సమ్మెకు సిద్ధం అవుతామని హెచ్చరించారు. అనంతరం కమిషనరు డాక్టర్ కే. వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు.

లోక్‌సభ స్పీకర్‌ను కలిసిన మాగుంట



లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాతో ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పలు అంశాలపై స్పీకర్‌తో మాట్లాడారు. అనంతరం స్పీకర్‌కు బొకే ఇచ్చి అభినందించారు.

మాగుంట పార్వతమ్మకు సంతాపం

పార్లమెంట్ సమావేశాల్లో ఇటీవల మృతి చెందిన ఒంగోలు లోక్‌సభ మాజీ సభ్యురాలు స్వర్గీయ మాగుంట పార్వతమ్మకు నివాళులు అర్పించారు. సోమవారం పార్లమెంట్ శీతాకాల సమావేశాల ప్రారంభ సమావేశంలో పార్వతమ్మకు సంతాపాన్ని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ఇతర పార్లమెంట్ సభ్యులు తెలిపారు.

క్రైం సమాచారం

ఫోన్‌పే చేయించుకొని యువకుడు పరారీ

ఒంగోలు(క్రైం), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అత్యవసరం అంటు ఫోన్‌పే చేయిచుకొని ఓ యువకుడు పరారయ్యాడు. ఈఘటన సోమవారం స్థానిక నగరానికి ఉత్తరాన ఉన్న ఓ ప్రయివేట్ వైద్యశాలలో జరిగింది. వివరాలలోకి వెళితే పి.జయరాం కుమారుడు అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో ఆసుపత్రి కారిడార్‌లో వేచి ఉన్న జయరాం వద్దకు ఓ యువకుడు వచ్చి తనకు అర్జెంట్‌గా మూడు వేలు ఫోన్‌పే కావాలని అడిగాడు. తమ బంధువులు ఐసీయూలో ఉన్నారని, తాను వేరేవారికి పంపిచాలని, మీకు నగదు ఇస్తానని చెప్పాడు. దీంతో జయరాం రూ.3వేలు ఫోన్ చేశాడు. దీంతో ఆ యువకుని వద్ద ఉన్న బ్యాగ్‌ను అక్కడ పెట్టి ఫోన్ మాట్లాడుకున్నట్లు బయటకు వెళ్లి పరుగుతీశాడు. ఈమేరకు జయరాం తాను మోసపోయాని తెలుసుకొని సీసీ ఫుటేజీ పరిశీలించి ఒంగోలు తాలూకా పోలీసులకు వాట్సప్ ద్వారా ఫిర్యాదు చేశారు.

ఇసుక ట్రాక్టర్‌ల పట్టివేత

మద్దిపాడు, నవంబర్ 15(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని ఇనమనమెళ్లూరు గ్రామ సమీపంలో రెండు ట్రాక్టర్లను సీజ్ చేశారు. సోమవారం ఉదయం ఇనమనమెళ్లూరు గ్రామంలో ఇసుక తరలిస్తున్నారన్న సమాచారంతో ట్రాక్టర్లను పరిశీలించాలని గ్రామ రెవెన్యూ అధికారికి మండల తహసీల్దార్ సృజన కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఆయన ఆదేశాల మేరకు గ్రామ రెవెన్యూ అధికారులు తనిఖీ చేపట్టగా వారిని చూసి ట్రాక్టర్ల డ్రైవర్లు పారిపోయారు. ఈ సందర్భంగా దొరికిన రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. తహసీల్దార్ సృజన కుమార్ మా ట్లాడుతూ గుండ్లకమ్మ పరివాహ ప్రాంతంలో అనుమతులు లేకుండా ఇసుక తరలిస్త చర్యలు తీసుకుంటామన్నారు.

26 మద్యం బాటిళ్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎస్సై అనూక్, సిబ్బంది

పొన్నలూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముండ్లమూరివారిపాలెం గ్రామంలో బెల్టు షాపు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లును పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఆయన వద్ద 26 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. గ్రామాల్లో మద్యం అక్రమంగా విక్రయించినా, బెల్ట్ షాపులు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై అనూక్ హెచ్చరించారు.

రహదారి నిర్మాణ పనుల అడ్డగింతపై ఫిర్యాదు


అర్జీలు ఇస్తున్న ముదిరాజ్ కాలనీ వాసులు

తర్లుపాడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తర్లుపాడులోని ముదిరాజ్ కాలనీలో కొందరు సిమెంట్ రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకుంటు న్నారని కాలనీ వాసులు తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం సమర్పించారు. గత 40 ఏళ్లుగా గృహాలు నిర్మించుకుని ఉంటున్న ప్పటికీ కొందరు వైసీపీ నాయకులు కక్ష కట్టుకుని ప్లాట్ నెం.59, 73, 74 పాట్ల గృహాలకు ఎదురుగా ఉన్న రోడ్డును వేయకుండా నిలిపివేస్తున్నార న్నారు. ఈ రోడ్డు ఆగిపోవటంతో తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రహదారి నిర్మాణానికి అడ్డంకులు తొలగించాలని కాలనీ వాసులు కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న ఎస్ఐ సైదుబాబు

మార్కాపురం వన్ టౌన్ నవంబరు 25, (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండి కుటుంబ సభ్యులకు తగు జాగ్రత్తలు వివరించాలని పట్టణ ఎస్ఐ సైదుబాబు అన్నారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. యువత ముఖ్యంగా విద్యార్థి దశలో తెలిసి తెలియని వయస్సులో మత్తుపదార్థాలకు అలవాటు పడటం మంచిది కాదన్నారు. మరో ఎస్ఐ రామ్మోహన్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే ఉన్నతమైన లక్ష్యాలతో ఎటువంటి చెడుప్రవర్తన లేకుండా నడవాలన్నారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

● విద్యార్థులకు అవగాహన సదస్సులో సీఐ ప్రభాకర్ రావు

పెద్ద దోర్నాల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎర్రగొండపాలెం సీఐ సీహెచ్ ప్రభాకర్‌రావు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రకాశం పోలీసు కార్యక్రమంలో భాగంగా సోమవారం పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ సైబర్ నేరాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. అపరిచితుల ఫోన్‌కాల్స్‌కు స్పందించవద్దన్నారు. అదేవిధంగా గంజాయి, మద్యం, వంటి డ్రగ్స్‌కు దూరంగా ఉండి క్రమశిక్షణతో ఉన్నత విద్య నభ్యసించాలన్నారు. మోటారు సైకిల్ వినియోగించేవారు విధిగా హెల్మెట్లు ధరించాలన్నారు. సైబర్ నేరాలకు గురైన వారు వెంటనే 1930కి కాల్ చేసి జరిగిన నష్టాన్ని తెలియజేయాలన్నారు. పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వీ.మహేశ్, ప్రిన్సిపాల్ ఎస్.సావిత్రి, అధ్యాపకులు విజయబాబు, జయసింహ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కిసాన్‌సభ యాప్‌తో రైతులకు మేలు


రాయితీపై స్ప్రేయర్ అందజేస్తున్న అరవింద్

గిద్దలూరు రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): దళారి వ్యవస్థ నుంచి రైతులను దూరం చేసి వారి పంటను నేరుగా అందుకునే వెసలుబాటును కల్పిస్తున్నట్లు కిసాన్‌సభ జిల్లా కో-ఆర్డినేటర్ అరవింద్ అన్నారు. కిసాన్‌సభ యాప్‌లో నమోదైన రైతులకు రాయితీపై మంజూరైన స్ప్రేయర్లను మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో సోమవారం రాత్రి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కో-ఆర్డినేటర్ అరవింద్ మాట్లాడుతూ రైతులు కిసాన్‌సభ యాప్‌లో తమ పేర్లు నమోదు చేసుకుంటే రాయితీపై వ్యవసాయ పరికరాలు అందజేస్తామన్నారు. అంతేకాకుండా తాము పండించిన పంటను యాప్‌లో అప్‌లోడ్ చేసుకుంటే దేశంలోని ఏ వ్యాపారైన దళారీల సహాయం లేకుండా నేరుగా ఉత్పత్తులు కొనే అవకాశం ఉందన్నారు. తద్వారా అధిక ధరలు పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో కిసాన్‌సభ మండల కోఆర్డినేటర్ నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు రైతు మృతి

గిద్దలూరు టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు రైతు మృతిచెందిన ఘటన మండలంలోని అంబవరం- కొండపేట మధ్య చోటు చేసుకొంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పరమేశ్వరనగర్‌కు చెందిన రైతు రామాంజనేయులు (24) పొగాకు తీసుకొని మోటారు సైకిల్‌పై వెళుతున్నాడు. ఈ క్రమంలో అంబవరం- కొండపేట మధ్య ప్రమాదవశాత్తు విద్యుత్‌స్తంభాన్ని ఢీకొట్టాడు. దీంతో ఆయన తలకు బలమైన గాయాలు తగలడం, అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, ఇరువురు పిల్లలు ఉన్నారు. అర్బన్ సీఐ కె.సురేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నాటుసారా బట్టీలపై దాడి


బట్టీలను ధ్వంసం చేస్తున్న అధికారులు

ఎర్రగొండపాలెం రూరల్ నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రెగులపల్లి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఎక్సైజ్ శాఖ అధికారులు సోమవారం నాటుసారా బట్టీలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 250 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఆశాఖ సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో ఎక్కడైన నాటుసారా తయారు చేసినా, అమ్మినా, ఎక్సైజ్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు కోరారు. అటవీ ప్రాంతాలలో ఉండే ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు.

బాలలతో బిక్షాటన చేయిస్తే చర్యలు

పొదిలి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : బాలలతో బిక్షాటన చేయించడం చట్టరీత్యా నేరమని సీడీపీవో సుధామారుతి అన్నారు. బంగారు బాల్యం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఐసీడీఎస్ పరిధిలోని కొనకనమిట్ల, పొదిలి ప్రాంతాల్లో పోలీస్‌స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, సలుదేవాలయ ప్రాంతాల్లో బ్యానర్ల ద్వారా హెచ్చరికలు చేశారు. బాలల బిక్షాటనను ప్రోత్సహించవద్దని పోలీస్, ఆర్టీసి అధికారులను కోరారు. పబ్లిక్ ప్రదేశాల్లో, ప్రయాణీకులకు మైక్‌ద్వారా తెలియజేసేందకు కృషి చేయాలన్నారు. బస్టాండ్, శివాలయం తదితర దేవాలయ ప్రాంతాల్లో 1972 బెగ్గింగ్ యాక్ట్ ప్రకారం యాచకులకు అవగాహన కల్పిస్తూ బ్యానర్లు డిస్ప్లే చేశారు. బంగారు బాల్యం దీర్ఘకాలిక ప్రణాళిక రూపంలో భాగంగా బాల్యవివాహాలు, బాలలతో బిక్షాటన, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరు కృషి చేద్దామని పిలుపు నిచ్చారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

ఎర్రగొండపాలెం రూరల్ నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) :రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఎర్రగొండపాలెం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు సాంబశివరావు, బాణాల రామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కార్మిక హక్కుల కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ ఆపాలని అన్నారు. రైతులు సాగు చేసి పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలన్నారు. రైతు సమస్యలపై ఈ నెల 26న కలెక్టర్ కార్యలయం వద్ద నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి జి.గురునాథం రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.


మార్కాపురంలో అర్ధనారీశ్వర అలంకరణలో జగదాంబ, మార్కండేశ్వరస్వామి, త్రిపురాంతకేశ్వరుడు, దీపాలు వెలిగిస్తున్న భక్తులు, తర్లుపాడులో నీలకంఠేశ్వరుడు, తురిమెళ్లలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు

వేకువజాము నుంచే ఆలయాలకు పోటెత్తిన భక్తులు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం నాలుగో సోమవారం పురస్కరించుకుని శివనామస్మరణలతో ఆలయాలు మార్మోగాయి. స్థానిక జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు ఏలూరి ఆంజనేయ శర్మ, రెంటచింతల వరుణ్‌తేజశర్మలు మార్కండేశ్వరుడు, జగదాంబమాతలకు అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు చేశారు. మార్కండేశ్వరుడికి, జగదాంబకు అర్ధనారీశ్వర అలంకారం చేశారు. భక్తులు తెల్లవారుజామున 3 గంటల నుంచే దర్శనానికి బారులు తీరారు. ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించి నాగశిలలకు పాలు పోసి పూజలు చేశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేశారు. పట్టణంలోని పలు ఆలయాలలో కార్తీక సోమవారం నిర్వహించారు.

త్రిపురాంతకం : కార్తీక మాసంలోని చివరి సోమవారం కావడంతో భక్తులు ఉదయాన్నే పుణ్యస్నానాలు ఆచరించి ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయంలో ప్రదక్షణలు నిర్వహించి ఆలయ ప్రాంగణంలోని చామరకర్ల రస సిద్ధి గణపతి, అపరాధీశ్వరస్వామి వద్ద దీపాలను వెలిగించారు. అనంతరం త్రిపురాంతకేశ్వర స్వామిని దర్శించుకొని అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు విశ్వం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గిద్దలూరు : దక్షిణ కాశీగా పేరొందిన పట్టణంలోని పాతాళ నాగేశ్వరస్వామి దేవాలయానికి తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. దేవాలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. పాపులవీడు, కెఎస్‌పల్లె సమీపంలోని భీమలింగేశ్వర స్వామి దేవాలయాలలో భక్తులు పూజలు నిర్వహించారు. పట్టణంలోని అమ్మవారిశాల, వేంకటేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి దేవాలయాలలో సోమవారం సాయంత్రం గంగమ్మ, గౌరమ్మలకు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

తర్లుపాడు : నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో, సహస్ర లింగేశ్వర స్వామి ఆలయంలో, వీరభద్ర స్వామి ఆలయంలో కేతగుడిపి కేధార్‌నాథ్ స్వామి ఆలయంలో నాగెళ్లముడుపు పార్వతివర్ధని అమ్మవారి ఆలయంలో కార్తీక సోమవారం పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దేవులపల్లి శర్మ, పలువులు అర్చకులు స్వామి వార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నీలకంఠేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త నేరెళ్లకుమార్‌లు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

కంభం : కంభం మండలం తురిమెళ్ళ గ్రామంలోని వీరభద్రస్వామి ఆలయంలో నిర్వహించిన కార్తీక సోమవార పూజలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొని వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో తురిమెళ్ళ సర్పంచ్ మాదా సుభద్ర, మాజీ సర్పంచ్ నారిశెట్టి వీరమ్మ , భక్తులు పాల్గొన్నారు. చిన్నకంభం వీరభద్రస్వామి ఆలయం, కంభం కోటేశ్వర స్వామి ఆలయం, తురిమెళ్ళ కనక సురభేశ్వర ఆలయాలకు భక్తులు పోటెత్తారు. అర్ధవీడు మండలంలోనూ విశేష పూజలు నిర్వహించారు.

ఆలయాలకు క్యూ కట్టిన భక్తులు

ఎర్రగొండపాలెం రూరల్ : కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో ఎర్రగొండపాలెంలోని శ్రీకాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయానికి భక్తులు క్యూ కట్టారు. తెల్లవారుజామున నుండే భక్తులు, మహిళలు ఆలయానికి చెరుకున్నారు. ఆలయ ప్రాంగణంలో కార్తిక దీపాలు వెలిగించారు. స్వామివారిని ధర్శించుకున్నారు. శంభో శంకర అంటూ భక్తులు పలికారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పెద్దదోర్నాల : కార్తీక సోమవారాన్ని పురష్కరించుకుని స్థానిక షిరిడీ సాయిబాబా మందిరంలో కోటి దీపోత్సవం నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. అయ్యప్పస్వామి దేవాలయంలో అయ్యప్ప మాలధారులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. భక్తి గీతాలతో భజనలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో అన్నా వెంకటప్రసాద్, నాగెళ్ల సత్యనారాయణ, పెరుమాళ్ల యోగి వెంకట నారాయణ, పీ.రామారావు, ఒంటేరు రమణ, మల్లికార్జున రావు, బొగ్గరపు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు

పెద్ద దోర్నాల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): శివ కేశవులకు ప్రీతిపాత్రమైన కార్తీకమాసం చివరి సోమవారం రోజున శైవక్షేత్రాలతో పాటు అన్ని దేవాలయాలు కార్తీకశోభను సంతరించుకున్నాయి. ఈ క్రమంలో దక్షిణ కాశీగా వెలుగొందుతున్న మహాపుణ్యక్షేత్రం శ్రీశైలంలో కొలువైన శ్రీ భ్రమరాంబమల్లికార్జునస్వామి వార్ల దర్శనానికి ఆదివారం రాత్రి నుంచే భక్తులు పోటెత్తారు. ఈ క్రమంలో దోర్నాలలో రద్దీ ఏర్పడింది. రాత్రి 9గంటల సమయం దాటితే నల్లమల అటవీ ప్రాంతం నుంచి ప్రయాణం నిషేధం కావడంతో సుదూర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులకు శ్రీశైలం వెళ్లేందుకు అనుమతులు లేక వాహనాలన్నీ దోర్నాల ఫారెస్టు చెక్ పోస్టు వద్ద నిలిపారు. సుమారు 2 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో భక్తులతో దోర్నాలలో పండుగ వాతావరణం నెలకొంది. సోమవారం ఉదయం 6గంటల నుండి అనుమతివ్వడంతో వాహనాలు బయలుదేరి వెళ్లాయి.

టీడీపీతోనే ప్రజా సమస్యలకు పరిష్కారం సాధ్యం

వై.పాలెం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎరిక్షన్‌బాబు

పెద్దారవీడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే ప్రజాసమస్యల పరిష్కారం సాధ్యమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని టీడీపీ ప్రభుత్వంలోనే ప్రజాసమస్యల పరిష్కారం సాధ్యమని ఎర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు. మండలంలోని వెలిగొండ ప్రాజెక్ట్ నిర్వాసిత గ్రామాలైన సుంకేసుల, గుండంచర్ల, కలనూతలకు రూ.50 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు పనులకు సోమవారం ఆయన శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ నిర్వాసిత గ్రామాలకు వెళ్లేందుకు కనీసం రోడ్డు సౌకర్యం కల్పించడంలో గత వైసీపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలో పాలన సాగిస్తున్నారన్నారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో ప్రాధాన్యతాక్రమంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చంద్రగుంట్ల నాగేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ జడ్డా రవి పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

పుల్లలచెరువు : మండలంలోని నాయుడుపాలెం చర్చిలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో వై.పాలెం టీడీపీ ఇన్‌చార్జీ గూడూరి ఎరిక్షన్‌బాబు పాల్గొన్నారు. సోమవారం నాయుడుపాలెం చర్చిలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో టీడీపీ నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పయ్యావుల ప్రసాద్, టీడీపీ మండల నాయకులు కాకర్ల కోటయ్య, రెంటపల్లి సుబ్బారెడ్డి, ఎంపీటీసీ పెద్దిటి వెంగయ్య, ఆకాశ్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మీ కోసం భవనానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో మీ కోసం భవనానికి సోమవారం భూమి పూజ నిర్వహించారు. మీ కోసం కార్యక్రమంతో పాటు పలు రకాల సమావేశాలు నిర్మించుకునేందుకు నూతన భవన అవస రాన్ని ఇప్పటికే పలుమార్లు అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. కూటమి ప్రభుత్వ చొరవతో రూ.55 లక్షలు నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. దీంతో శనివారం భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి, సబ్‌కలెక్టర్ వెంకట్ త్రివినాగ్‌లు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చిరంజీవి, మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, సీఐ పి.సుబ్బారావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాప్రమాణాల సర్వేపై అవగాహన సదస్సు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ సాధన డిగ్రీ కళాశాలలో జాతీయ విద్యాప్రమాణ సర్వేపై వలంటీర్లకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిసెంబరు 4న జిల్లాలో జాతీయ స్థాయి విద్యాప్రమాణాల అంచనాపరమైన కార్యచరణ నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా మార్కాపురం, దోర్నాల, వైపాలెం, పుల్లలచెరువు, తర్లుపాడు, కంభం తదితర ప్రాంతాల్లో నిర్వహణ సహకారం కోసం జిల్లా కామన్ ఎగ్జామ్ నేషన్ బోర్డు ఆధ్వర్యంలో శ్రీ సాధన విద్యార్థులకు శిక్షణ నిర్వహించారు. నిర్దేశిత కేంద్రాలలో 3, 6, 9 తరగతులు చదువుతున్న ప్రభుత్వ ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల్లోని పిల్లల చదువుల తాలుకా సామర్థ్యాలను అంచనా వేసే ఈ పరీక్షలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎం.శ్రీనివాసరావు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.మధుసూదన్, ఉప విద్యాశాఖాధికారి శ్యామ్యూల్ జాన్, ఎంఈవోలు శర్వాణి, గిరిధర శర్మ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా పశువైద్యశాల

ఇబ్బందులు పడుతున్న పశుపోషకులు


చెత్త సామగ్రితో నిండిన పశువైద్యశాల ప్రాంగణం

కంభం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కంభం పట్టణంలో నిర్మించిన పశువైద్యశాల ఆరేళ్లగా ప్రారంభానికి నోచుకోలేదు. అప్పట్లో నాటి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డితో ప్రారంభిస్తారని అధికారులు ప్రకటించినా వాయిదాలు పడుతూ ప్రారంభోత్సవం కాకుండా పోయింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా అశోక్‌రెడ్డే ఉన్నారు. ప్రస్తుతం పశువైద్యశాలను ప్రారంభిస్తారని ఆశతో ఉన్నారు. ఆరేళ్ల క్రితం 6 లక్షల పంచాయతీ నిధులతో పశువైద్యశాలను నిర్మించారు. అయితే అక్కడ పశు వైద్యాధికారులను నియమించక పోవడంతో నిరుపయోగంగా మారింది. దీంతో చుట్టు పక్కల వారు బట్టలు ఆరబెట్టుకోవడానికి, పశువులను కట్టివేయడానికి వినియోగిస్తున్నారు. తిప్పవీధి, కాపువీధి, తెలుగువీధి పశు పోషకులు తమ పశువులకు జబ్బు చేస్తే 3 కిలోమీటర్ల దూరంలోని కందులాపురం పశు వైద్యశాలకు వెళుతున్నారు. అంతదూరం జబ్బుతో ఉన్న పశువులను తీసుకురాలేక నాటు వైద్యం చేయిస్తున్నారు. అందుబాటులో పశువైద్యశాల ఉంటే బాగుంటుందన్న ఉద్దేశ్యంతో నిర్మించిన పశువైద్యశాలను, ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వినియోగంలోకి తీసుకురావాలని పశుపోషకులు కోరుతున్నారు.

యూటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక


ప్రమాణం చేస్తున్న యూటీఎఫ్ మండల కమిటీ

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ మండల మహాసభ స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారులుగా గురుస్వామి, నాగరాజు, సుబ్బారెడ్డి, గౌరవ అధ్యక్షులుగా అల్లూరిరెడ్డి, అధ్యక్షులుగా పి.జయరామిరెడ్డి, సహాధ్యక్షులుగా మునీర్ బాషా, రమాదేవి, ప్రధాన కార్యదర్శిగా రాజేష్, కోశాధికారిగా రామకృష్ణ, మహిళా కార్యదర్శిగా విశ్వజ్యోతి, సీపీఎస్ కన్వీనర్‌గా పాండురంగ స్వామి, జిల్లా కార్యదర్శి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

గౌడసంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు



మాట్లాడుతున్న గౌడసంఘం నాయకులు

గిద్దలూరు టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సర్దార్ సర్వాయ్ పాపన్న గౌడ్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం కార్తీక వనభోజనాలు నిర్వహించారు. మండలంలోని కే.ఎస్.పల్లె సమీపంలోని ఎగువ భీమలింగేశ్వరస్వామి దేవాలయం నందు సంఘం అధ్యక్షులు బత్తిని వెంకటేశ్వర్లుగౌడ్ ఆధ్వర్యంలో వన భోజనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక పూజలు, మహిళలకు, పురుషులకు వేరువేరుగా ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం గత సంవత్సరం 10వ తరగతి, ఇంటర్ పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన వారికి సంఘం పెద్దలతో బహుమతులు అందించారు. ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు డాక్టర్ జేవీ.నారాయణ, కంచర్ల కోటయ్యగౌడ్, ఉద్యానవన శాఖాధికారిణి విష్ణుప్రియ, ఎక్సైజ్ సీఐ మలిశెట్టి నగేష్, పవన్ కుమార్, ఫారెస్టు డీఆర్‌వో రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన జనసేన నాయకులు

గిద్దలూరు టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పీఏసీ సభ్యులుగా నియమితులైన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని సోమవారం జనసేన నాయకులు సన్మానించారు. రాచర్ల మండలానికి చెందిన జనసేన నాయకులు అలిశెట్టి వెంకటేశ్వర్లు, గోపాల్, కృష్ణ, జనసేన సంయుక్త కార్యదర్శి గజ్జలకొండ నారాయణ తదితరులు ఎమ్మెల్యేను పూలమాలతో సన్మానించారు.

అవసరం లేకున్నా ట్యాంకర్ల ద్వారా నీళ్లు తోలుతున్నారు

మీ కోసం కార్యక్రమంలో రాజుపాలెం వాసి ఫిర్యాదు


అర్జీలు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ వెంకట త్రివినాగ్

మార్కాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): 'మా గ్రామంలో డీప్‌బోర్లలో పుష్కలంగా నీళ్లున్నాయి. అంతేకాక ఇంటింటికి కొళాయి ద్వారా నీళ్లు సమృద్ధిగా వస్తున్నాయి. కానీ కొందరు స్వార్థపరులు జేబులు నింపుకునేందుకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు.' అని మార్కాపురం మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన మురికిపూడి కాశయ్య సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్‌కు ఫిర్యాదు చేశారు. ప్రాథమిక విచారణ చేసి ఆర్ డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి తదుపరి చర్యలు తీసుకుంటామని ఫిర్యాదు దారునికి సబ్ కలెక్టర్ త్రివినాగ్ తెలిపారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో మొత్తం 21 అర్జీలు దాఖలయ్యాయి. అన్నీ రెవెన్యూ సంబంధిత సమస్యలపైనే అర్జీలు అందాయి. కంభం మండలంలోని తురిమెళ్ల గ్రామంలో సర్వేనెంబర్ 1061లో 0.88 సెంట్ల భూమి ఉందని ఖాతా నెంబర్, పాస్‌బుక్ ఉన్నా తహసీల్దార్ డిజిటల్ సైన్ కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు పట్టణానికి చెందిన కనమరపూడి రంగారావు అర్జీ అందజేశారు. ఈ సమస్యపై కంభం తహసీల్దార్ కార్యాలయానికి పలుమార్లు తిరిగినా, పట్టించుకోవడం లేదన్నారు. రికార్డులు పరిశీలించి వెంటనే సమస్యను పరిష్కరించాలని కంభం తహసీల్దార్‌ను సబ్ కలెక్టర్ త్రివినాగ్ ఆదేశించారు. కార్యక్రమంలో డివిజన్‌స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సిమెంట్‌రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

పెద్దదోర్నాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జమ్మిదోర్నాల గ్రామంలో సిమెంట్ రోడ్డునిర్మాణం పనులు సోమవారం ప్రారంభించారు. ఈ పనులను టీడీపీ నాయకులు పడిదెపు ఆదినారాయణ ప్రారంభించారు. పంచాయతీరాజ్ శాఖ నిధులు రూ.10లక్షలతో నిర్మిస్తున్నట్లు టీడీపీ నాయకులు షేక్ మంజూర్ భాష తెలిపారు. కార్యక్రమంలో జిలాని, కాశయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించిన ప్రజాప్రతినిధులు

అధికారులు బిల్లులు పెట్టడం లేదని ఎంపీడీవోకు ఫిర్యాదు


అర్జీ అందజేస్తున్న సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు

తర్లుపాడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : తర్లుపాడు మండల సర్వసభ్య సమావేశాన్ని మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు బహిష్కరించారు. పంచాయతీల్లో పనులు చేసిన ప్పటికీ బిల్లులు ఎందుకు పెట్టరంటూ సర్పంచులు ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్‌తో వాగ్వివాదం చేశారు. ఎనిమిది నెలల నుంచి పంచాయతీల్లో కనీస మౌలిక వసతులు కల్పించేందుకు వివిధ రకాల అభివృద్ధి పనులు చేసినప్పటికీ అధికారులు బిల్లులు పెట్టకుండా నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ ఖాతాల్లో డబ్బులు ఉన్నప్పటికీ బిల్లులు పెట్టకపోవటంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. సర్పంచ్‌లు ఎంపీడీవోతో వాగ్వివాదం చేశారు. బిల్లులు పెట్టనందుకు నిరసనగా ఎంపీటీసీలు, సర్పంచ్‌లు లిఖిత పూర్వకంగా అర్జీలు ఇచ్చి సమావేశాన్ని బహిష్కరించారు. రెండు, మూడు రోజుల్లో గ్రామాల్లో పర్యటించి చేసిన పనులను పరిశీలించి బిల్లులు పెట్టేందుకు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రజాప్రతినిధులకు హామీ ఇచ్చారు. అయితే అప్పటికే ప్రజాప్రతినిధులు వెళ్లిపోవటంతో అధికారులు ఉన్నప్పటికీ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో ప్రకటించారు.

ఘనంగా లక్షదీపోత్సవం


దీపాలు వెలిగిస్తున్న మహిళలు

పొదిలి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) :పవిత్ర కార్తీక సోమవారం సందర్భంగా పట్టణంలోని జూనియర్ కాళాశాల రోడ్డులో ఉన్న రామాలయం ఆవరణలో లక్షదీపోత్సవ కార్యక్రమాన్ని మహిళలు అట్టహాసంగా నిర్వహించారు. విశ్వనాథపురం భక్తులు రామాలయంలో ప్రత్యేకంగా అలంకరించిన స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. కార్యక్రమంలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ముఖాముఖి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

డాక్టర్ సునీత, పీహెచ్‌సీ, దొనకొండ



ప్రశ్న: మండలంలో సీజనల్ వ్యాధులు ఎలా ఉన్నాయి ?

జవాబు: పలు గ్రామాల్లో వైరల్ ఫీవర్స్ ఉన్నాయి. గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాం. వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రక్తనమూనాల పరీక్షలు చేపట్టి తగిన చర్యలు చేపడుతున్నాం.

ప్ర: సీజనల్ వ్యాధుల లక్షణాలు ఏంటి ?

జ: జలుబు, దగ్గు, గొంతువాపు, జ్వరం, వాంతులు, వంటి నొప్పులు లాంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి.

ప్ర: ఆరోగ్యకేంద్రం పరిధిలో సిబ్బంది, మందుల కొరత ఉందా?

జ: దొనకొండ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో తగినంత సిబ్బంది ఉన్నారు. అన్నిరకాల మందులు పూర్తిస్థాయిలో ఉన్నాయి.

ప్ర: ఆరోగ్యకేంద్రంలో కాన్పులు జరగటం లేదనే ఆరోపణలు వాస్తవ మేనా ?

జ: ఆరోగ్యకేంద్రం పరిధిలో నార్మల్ కాన్పులు జరపుతున్నాము. ఈ నెలలో ముగ్గురు గర్భిణులకు కాన్పులు చేశాం.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

పామూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పామూరు పట్టణంలోని విరువూరు రోడ్డులో ఉపాధి హామీ నిధులతో నిర్మించే పనులకు టీడీపీ నాయకులు యారవ శ్రీను సోమవారం భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. పట్టణంలో 23 సిమెంటు రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే ఉగ్ర ఉపాధి నిధులను రూ.5 కోట్లు మంజూరుచేసిన విషయం తెలిసిందే. కార్యక్రమంలో ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, షేక్ ఖాజారహంతుల్లా హజీగౌస్, పువ్వాడి వెంకటేశ్వర్లు, ఆర్‌ఆర్ రఫి, ఇర్రి కోటిరెడ్డి, వై.రహీముల్లా, గౌస్‌బాషా, ముబినా మౌలాలి, చినహజరత్, మాచర్ల రహిమాన్, షేక్ నాయబ్‌రసూల్, కావేరి రసూల్, ఎఫ్ఐ ఖాజాగౌస్, తదితరులు పాల్గొన్నారు.

నారాయణస్వామి దేవస్థాన ఆదాయం రూ.2 లక్షలు

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానానికి ఆదివారం ఆదాయం రూ.2,23,784 వచ్చినట్లు ఈవో నరసింహబాబు తెలిపారు. టిక్కెట్ల అమ్మకంద్వారా రూ.95,340, లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ.76,730, శాశ్వత అన్న దాన పథకానికి విరాళాల రూపంలో రూ. 48,714 వచ్చినట్లు తెలిపారు. అలాగే, ఇతర విరాళాలు కూడా వచ్చాయని తెలిపారు.

నేడు కార్తీక ఏకాదశి పూజలు

పామూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక సత్యదేవుని దేవస్థానంలో మంగళవారం కార్తీక ఏకదశి సందర్భంగా లక్ష తులసి అర్చన పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈసందర్భంగా తెలనాకుల వెంకటనరసింహారావు జ్ఞాపకార్థం సతీమణి లక్ష్మి, కుమారులు వెంకటశ్రీనివాస్, వెంకటరవికుమార్, వెంకటకిశోర్ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

జీరో ఖాతాలను సరిచేయాలని వినతి

పామూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇనిమెర్ల గ్రామంలో గల జీరో ఖాతాలను సరిచేసి రైతుల ఇబ్బందులను తొలగించాలని టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నల్లబోతుల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం స్పందనలో వినతి పత్రం అందజేశారు. పామూరు మండలంలో సుమారు ఆరువేలకు పైగానే రైతు భూములు జీరో ఖాతాల్లో పడ్డాయని తెలిపారు. వీటిని ఆ ఖాతాల్లోంచి తొలగించాలని కోరారు. కాగా, జాతీయ రహదారి నిర్మాణ భూసర్వేలో భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరి హారం చెల్లించాలని కోరుతూ సీపీఎం కార్యదర్శి షేక్ ఖాదర్‌బాషా వినతిపత్రం అందజేశారు.

ఎరువుల దుకాణం తనిఖీ

తాళ్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తాళ్లూరులోని శ్రీలక్ష్మివెంకట రమణ ట్రేడర్స్‌ను మండల వ్యవసాయాధికారి సోమవారం తనిఖీ చేశారు. శాంపిల్స్‌ను రీజనల్ కోడింగ్‌కు పరీక్షల నిమిత్తం పంపుతున్నట్టు చెప్పారు. నాణ్యతా ప్రమాణాల్లో లోపాలు ఉంటే చర్యలు తప్పవన్నారు. ఎరువులు పంపిణీ, తీసుకున్న రైతుల వివరాలు, ఇన్వాయిస్ తేదీలు స్పష్టంగా ఉండాలన్నారు. రికార్డుల్లో పూర్తి వివరాలను డీలర్లు నమోదు చేయాలన్నారు.

కన్నుల పండువగా శాంతి కల్యాణం

పామూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక తూర్పు వీధిలోగల శ్రీకోదండ రామస్వామి దేవస్థాన మూడవ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉదయం నుంచి సహస్ర కుంకుమార్చన పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వార్లకు శాంతి కల్యాణం నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

ప్రారంభమైన సెమీ క్రిస్మస్ వేడుకలు

దొనకొండ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లోని చర్చీల్లో సెమీ క్రిస్మస్ వేడుకలను ఆదివారం రాత్రి ఘనంగా జరుపుకున్నారు. డిసెంబర్ 25న జరిగే క్రిస్మస్ వేడుకలనును పురస్కరించుకొని ఈ వేడుకలు జరుపుకుంటారు. ఈసందర్భంగా చర్చీల వద్ద భారీ స్టార్స్ ఏర్పాటుచేశారు. చర్చీలను విద్యుత్‌దీపాలతో అలంకరించారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో నాణ్యమైన వైద్యసేవలు

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనతి కాలంలోనే ఈ ఆస్పత్రిలో వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో సోమవారం పది కుటుంబాలకు రూ.11లక్షల 9వేల 948లు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గంలో ఆరోగ్యపరంగా పేదలు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో సీఎం సహాయనిధి ద్వారా అండగా నిలుస్తున్నామన్నారు. పేదలు ఖర్చుతో కూడుకున్న అనారోగ్యాల బారిన పడినప్పుడు వారికి సీఎం సహాయనిధి ఎంతో భరోసా కల్పిస్తుందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



సీఎం సహాయనిధి చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

బాలికల హాస్టల్ ఏర్పాటుకు స్థలసేకరణ

పామూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పామూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సంబంధించి బాలికల ప్రత్యేక హాస్టల్ ఏర్పాటుకు అవసరమైన స్థలసేకరణ కోసం పాత ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణాన్ని సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి పరిశీలించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు సుమారు 350 మందికి పైగా బాలికలు విద్యను అభ్యసిస్తున్నారు. వారి కోసం ప్రత్యేక హాస్టల్ ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి అనుమతులు పొందినట్టు ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర తెలిపారు. హాస్టల్ ఏర్పాటుకు అనువైన స్థలసేకరణలో భాగంగా ఉన్నత పాఠశాలకు దగ్గరగా నిరుపయోగంగా ఉన్న పాత ప్రభుత్వ వైద్యశాల స్థలాన్ని పరిశీలిస్తున్నట్టు చెప్పారు. అన్ని అనుమతులు పొందిన తరువాత హాస్టల్ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవో కె.కరుణకుమారి, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె.రామస్వామి, సర్వశిక్షఅభియాన్ ఏఈ సతీష్, ఉప్పలపాటి హరిబాబు, ఇర్రి కోటిరెడ్డి, మెంటా నరసింహారావు, ఆర్‌ఆర్ రఫి, టీవీకే సుబ్బారావు, మోషే తదితరులు పాల్గొన్నారు.

కాగా,, పామూరు పట్టణంలో నూతనంగా ఏర్పాటుచేసిన బ్రైయిట్ జనరల్ అండ్ కార్డియాక్ కేర్ వైద్యశాలను డాక్టర్ ఉగ్ర ప్రారంభించారు. వైద్యశాల డాక్టర్లు గోస్దు వెంకటేశ్వర్లు, డాక్టర్ ప్రతిమలు ఉగ్రను శాలువాతో సత్కరించారు.

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు

» ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి

కనిగిరి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళలను వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో మహిళా హింసా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ సృష్టికి మూలమైన మహిళలను గౌరవించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మహిళా రక్షణ కోసం ప్రభుత్వాలు అనేక చట్టాలు తెచ్చినా అనేకచోట్ల లైంగిక వేధింపులు, అత్యాచార ఘటనలు జరుగుతుండటం బాధాకరమన్నారు. మహిళా సాధికారత, బాల్య వివాహాల నిర్మూలన, మహిళా చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించేందుకు మరింత కృషి జరగాల్సిన అవసరం ఉందన్నారు. వేధింపులు, హింసకు గురవుతున్న మహిళలు ముందుకు వచ్చి మహిళా చట్టాలను, హక్కులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేధింపులకు గురవుతున్న మహిళలు డయల్ 100కు, 112కు ఫోన్ చేసి ప్రభుత్వాధికారులు నుంచి రక్షణ పొందవచ్చునని చెప్పారు.



అధికారులు, ప్రజాప్రతినిధులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి

అనంతరం మహిళా రక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీఐ ఖాజావలి, మున్సిపల్ చైర్మన్ గఫార్, ఐసీడీఎస్ సీడీపీవో సరోజిని, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

» **టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి**

ముండ్లమూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషిచేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత మండలంలోని 21 గ్రామ పంచాయతీలకు కొత్తగా ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించారు. సోమవారం దర్శిలోని ఆమె స్వగృహంలో అన్ని గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్‌లు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, లలిత్‌సాగర్ దంపతులను, టీడీపీ నేత డాక్టర్ కడియాల రమేష్‌ను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో జాబ్ కార్డు ఉన్న ప్రతిఒక్కరికి పని కల్పించాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. ప్రధానంగా వలసలను నివారించాలని ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచించారు.

కార్యక్రమంలో ఎంపీటీసీ నాగమల్లి అంకమ్మరావు, సిమ్మిలి రాజేంద్రప్రసాద్, గోపన బోయిన తిరుమలేశ్వరరావు, చింతల రాజారెడ్డి, తేలప్రోలు శ్రీనివాసరావు, నవులూరి శ్రీనివాసరావు, థామస్ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి లలిత సాగర్ దంపతులను సన్మానిస్తున్న ఉపాధి హామి పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌లు

సైబర్ నేరాలపై అవగాహన కలిగిఉండాలి

పీసీపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ జి.కోటయ్య అన్నారు. సోమవారం నేరేడుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు సమాజంలో జరుగుతున్న మంచి చెడుల గురించి కూడా తెలుసుకోవాలన్నారు. సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండటంతో పాటు తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. మనకి తెలియని వ్యక్తులు చెప్పే మాటలను నమ్మి మోసపోవద్దని చెప్పారు. ఏదైనా సమస్య వచ్చినా, ఆపదలో ఉన్నా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అంజనీదేవి, ఉపాధ్యాయులు తదితరులు పా ల్గొన్నారు.



పీసీపల్లి: సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ కోటయ్య

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ముండ్లమూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ వై.నాగరాజు అన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని చెప్పారు. సోమవారం సాయంత్రం మండలంలోని మారెళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు సైబర్ నేరగాళ్ళ ఉచ్చులో పడవద్దన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుపై దృష్టి పెట్టి ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలు వమ్ము చేయవద్దన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా మహారుద్ర యజ్ఞం

» **లక్కవరంలో పోటెత్తిన భక్తులు**

తాళ్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) మండలంలోని లక్కవరం గ్రామంలో గంగభ్రమరాంబ సమేత చెన్నమల్లేశ్వరస్వామి, శ్రీకాశీఅన్నపూర్ణాదేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో కార్తీక చివరి సోమవారంను పురస్కరించుకుని మహారుద్ర యజ్ఞం నిర్వహించారు. రుత్వికులు వాసుస్వామి,శివభక్తులు కృష్ణస్వామి నేతృత్వంలో కార్యక్రమాలు జరిగాయి. పురాతన చెన్నమల్లేశ్వరాలయంలో ప్రకాశం పంతులు ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో శివభక్తులు కృష్ణస్వామి ఆధ్వర్యంలో ప్రపంచశాంతి, లోకకల్యాణం, సనాతన ధర్మవృద్ధి కోసం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం వరకు మహాయజ్ఞం నిర్వహించారు. మహాగణపతిపూజ, పుణ్యావాచనం, మహారుద్రాభిషేకం, శ్రీసూక్తం, పురుషసూక్తం, నవగ్రహ పూజలు, పూర్ణాహుతి కార్యక్రమాలు జరిగాయి. శివపార్వతుల కల్యాణం, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కాగా, కార్తీక మాసం చివరి సోమవారం కావటంతో భక్తులు వేకువజామునే శివాలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని తాళ్లూరు, తూర్పుగంగవరం, శివరాంపురం, బొద్దికూరపాడు, మాధవరం, గుంటిగంగ తదితర గ్రామాల్లోని శివాలయాలు శివనామస్మరణలతో మారుమోగాయి. ఆలయాల వద్ద శివలింగాకృతిలో కార్తీక దీపాలు వెలిగించారు. అఖండ కర్పూర జ్యోతులను వెలగించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.



చెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో హోమం చేస్తున్న రుత్వికులు

అక్రమార్కుల నుంచి భూమిని కాపాడరూ..!

» **గ్రీవెన్స్‌లో బాధితుడి ఆవేదన**

కనిగిరి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చినా అక్రమార్కులు అమాయకుల భూములను కాజేసే యత్నాలు మాత్రం ఆగలేదు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆపార్టీ నేతలు భూ అక్రమాలకు తెగబడ్డారు. కనిగిరిలో వైసీపీ నేతల అక్రమాల పరంపరను అడ్డుకున్న నాథుడే లేకుండాపోయారు. ప్రభుత్వం మారినా కనిగిరి ప్రాంతంలో వీరి ఆగడాలు ఆగలేదు. తమ భూమిని ఆక్రమించారని, అన్యాక్రాంతమైందని పేదలు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో దళిత వర్గానికి చెందిన ఓ బాలస్వామి ఆవేదన అద్దం పట్టింది. తమ భూమి మరొకరి పేరుపై ఆన్‌లైన్ చేశారని అధికారులకు అర్జీ ఇచ్చాడు.

కనిగిరి మున్సిపాల్టీ పరిధిలోని శంఖవరం గ్రామ సర్వే నెంబరు 478/2 లో బాధితుడు బాలస్వామి తండ్రి అక్కిదాసరి కోటయ్యకు మిలటరీ ఎక్స్‌సర్వీస్ కోటాలో ప్రభుత్వం 4ఎకరాల 87సెంట్లు భూమి మంజూరు చేసింది. అప్పటినుంచి అతనే భూమిని సాగు చేసుకుంటున్నాడు. ఈక్రమంలో వయోభారంతో 2021లో ఆయన మరణించాడు. దీంతో వారి కుమారుడు అక్కిదాసరి బాలస్వామి వారసుడు కావటంతో ఆ భూమి తన తండ్రి నుంచి సంక్రమించింది. బాలస్వామి దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నాడు. ఆరోగ్యం సరిగా లేకపోవడంతో వ్యవసాయం చేసుకోలేకపోయాడు. తన తండ్రి నుంచి వచ్చిన ఆ భూమిని తన పేరుపై మార్చుకునేం దుకు ఆన్‌లైన్‌లో పరిశీలించగా తన తండ్రి పేరు కాకుండా వేరే వారిపై ఉందని తెలిసింది. దీంతో ఆయన తీవ్ర మనోవేదన చెందుతున్నాడు. తాను దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతూ తనకున్న ఒక్క కుమారుడిని కూడా చదివించుకోలేపోతున్నానని కన్నీటి పర్యంతమయ్యాడు. తన తండ్రి నుంచి సంక్రమించిన ఆ భూమిని తనపై మార్చాలని, అక్రమార్కుల నుంచి తనకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాడు.



అర్జీ చూపిస్తూ తన గోడును వివరిస్తున్న బాధితుడు బాలస్వామి

విద్యా బోధనలో మెలకువలు పాటించాలి

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు బోధన చేసే సమయంలో మెలకువలు పాటించాలని ఎంఈవో రాజాల కొండారెడ్డి సూచించారు. సోమవారం సీఎస్‌పురంలోని ఎస్టీ ప్రాథమిక పాఠశాలలో 4,5 తరగతుల విద్యార్థులకు గణితం, ఆంగ్ల బోధన అంశాలను పరిశీలించారు. ఒకటో తరగతి విద్యార్థులకు సులభతర బోధన, సులువైన అభ్యసనం కోసం ఆరు రోజులపాటు ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించాలన్నారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి రాజ్యాంగాన్ని గురించి అవగాహన సమావేశాలు నిర్వహించాలన్నారు.

దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలి

దర్శి నవంబరు 25(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని టీడీపీ దివ్యాంగుల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సందు వెంకటరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మానవవ నరుల శాఖమంత్రి నారా లోకేష్‌ను సోమవారం దివ్యాంగులు మంగళగిరిలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా దివ్యాంగుల సమస్యలను పరిష్కరిస్తామని, వారి అభివృద్ధికి కృషి చేస్తామని మంత్రి లోకేష్ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దివ్యాంగుల పింఛన్ మూడురెట్లు పెంచి ఎంతో మేలుచేశారన్నారు. దివ్యాంగుల సమస్యలను పూర్తిగా కూటమి ప్రభుత్వం పరిష్కరిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు పూసల ఓబయ్య, తదితరులు పాల్గొన్నారు.



మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగుల సంఘం నాయకులు

సర్వేలు సక్రమంగా నిర్వహించకుంటే చర్యలు

ముండ్లమూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన అన్నిరకాల సర్వేలను సక్రమంగా నిర్వహించి లక్ష్యం పూర్తి చేయాలని ఎంపీడీవో ఆర్.జనార్ధన్ అన్నారు. సోమవారం మండలంలోని ఈదర, పూరిమెట్ల, ఉమామహేశ్వర అగ్రహారం గ్రామాల్లో సచివాలయాలను సందర్శించారు. ఈసందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ ఇళ్ల మ్యాపింగ్ సర్వేను వేగవంతం చేయాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్ళి నాలుగు వైపులా కొలతలు తీసి అప్‌లోడ్ చేయాలన్నారు. అలా చేయటంవల్ల పన్ను నిర్ధారించడం జరుగుతుందని చెప్పారు. నిర్లక్ష్యం వహించే పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కొందరు కార్యదర్శులు సర్వేలో వెనుకబడి ఉన్నారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు జె.శ్రీనివాసరావు, వీరబ్రహ్మాచారి, మౌలాలి పాల్గొన్నారు.



ఈదరలో హౌసింగ్ మ్యాపింగ్ సర్వేను పరిశీ లిస్తున్న ఎంపీడీవో జనార్ధన్

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

ముండ్లమూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీనగర్, వీరాయపాలెం గ్రామాల మధ్య సోమవారం సాయంత్రం ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. పెదఉల్లగల్లుకు చెందిన వాతల రామిరెడ్డి ద్విచక్ర వాహనంపై చీమకుర్తి వెళుతున్నాడు. ఈక్రమంలో తూర్పువీరాయపాలెం నుంచి స్వగ్రామమైన పసుపుగల్లుకు మోటారుసైకిల్‌పై వస్తున్న వరగాని ఆదిశేషు ఎదురెదురుగా ఢీకొన్నారు. ప్రమాదం జరిగిన దగ్గర మూలమలుపు ఉండటంతో ఎదురెదురుగా వాహనాలు గుర్తించకపోవడంతో ఢీకొన్నారు. ఈప్రమాదంలో పెదఉల్లగల్లుకు చెందిన రామిరెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే బంధువులు చికిత్స నిమిత్తం ఒంగోలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆదిశేషును దర్శి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

దర్శిలో అయ్యప్ప పడిపూజ

దర్శి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): దర్శిలోని ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి నివాసం వద్ద సోమవారం రాత్రి అయ్యప్ప పడిపూజ కార్యక్రమం వైభవంగా జరిగింది. జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి మాలలు ధరించిన స్వాములతో కలిసి పడిపూజ చేశారు. ఆదివారం రాత్రి పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో దామెర్ల రమేష్ స్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్పస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



కొత్తపాలెంలో బ్లీచింగ్ చల్లుతున్న పారిశుధ్య కార్మికులు

దొనకొండ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని చందవరం గ్రామంలో దొనకొండకు చెందిన త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ సభ్యులు భగవద్గీతపై సోమవారం ప్రచారం నిర్వహించారు. కార్తీకమాసంలో దీపాలు వెలగించటం, అందులోని జ్ఞానాన్ని ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి జ్ఞాన వేదిక అధ్యక్షుడు టి.ఏడుకొండలు, సభ్యులు ఏ.చెన్నకేశవులు, ఏ.బాలరంగయ్య, టి.ఆదిలక్ష్మి, ఏ.కాశీలక్ష్మి, ఏ.సుబ్బులు, ఏ.వైష్ణవి, టి.కొండమ్మ, బి.సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపాలెంలో పారిశుధ్య పనులు

తాళ్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కొత్తపాలెం గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఎంపీడీవో కె.సుందరరామయ్య ఆదేశానుసారం గ్రామపంచాయతీ కార్యదర్శి ఐవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో గత వారంరోజుగా మురుగు కాలువల పూడికతీత పనులు చేశారు. సోమవారం గ్రామంలోని అన్ని వీధులు, మురుగు కాలువల్లో బ్లీచింగ్ చల్లించారు.

సచివాలయ ప్రాంగణంలో పిచ్చి మొక్కల తొలగింపు

తాళ్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం గ్రామ సచివాలయ ప్రాంగణంలోని పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేశారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో 'అపరిశుభ్రంగా సచివాలయ ప్రాంగణం' శీర్షికన ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. మాధవరం సచివాలయ ప్రాంగణాన్ని తక్షణమే శుభ్రం చేయించాలని ఎంపీడీవో కె.సుందరరామయ్య ఆదేశించారు. దీంతో పంచాయతీ కార్యదర్శి అల్లం వెంకటేశ్వర్లు సచివాలయ ప్రాంగణంలో ఉన్న మొక్కలను తొలగించి శుభ్రం చేయించారు.

బడి నుంచే ఉపాధి బాటకు ప్రోత్సాహం

కనిగిరి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు ఉపాధిని పెంచుకునే విధంగా ప్రభుత్వం పీఎంశ్రీ పథకం ద్వారా ప్రోత్సాహ కార్యక్రమాలు నిర్వహిస్తుందని ప్రభుత్వ బాలికల హైస్కూల్ హెచ్‌ఎం కలవ విజయలక్ష్మి అన్నారు. అందులో భాగంగా సోమవారం విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సులో భాగంగా బ్యూటీషియన్ అండ్ వెల్నెస్ శిక్షణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అధునాతన పద్ధతుల్లో సౌందర్య సాధనాలను ఎలా ఉపయోగించాలో విద్యార్థులకు శిక్షణ ఇప్పించారు. ఈ విద్యాసంవత్సరం హైస్కూల్‌లో బ్యూటీషియన్, రిటైల్ సర్టిఫికెట్ కోర్సులు ప్రారంభించినట్లు హెచ్‌ఎం తెలిపారు. పాఠశాల విద్యను అభ్యసిస్తూనే ఉపాధికి సంబంధించి కేంద్రప్రభుత్వం ఏర్పాటుచేసిన కోర్సులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో శిక్షకులు కె.ఆది నారాయణమ్మ, కె.జాన్సీ, ఉపాధ్యాయినులు షేక్ దిల్షాద్‌బేగం, ఆదిలక్ష్మమ్మ, విజయలక్ష్మి, పాలవర్తిని తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు





నందివెలుగు-కొల్లిపర మధ్య చేలల్లో యంత్రాలతో కోతకోసి, ప్లాట్‌ల రోడ్లపై ఆరబోసుకున్న రైతులు

రహదారులకు మహర్దశ

- వైసీపీ సర్కారులో పట్టిన గ్రహణం నుంచి విముక్తి
- మారుమూల ప్రాంతాల్లో సైతం మరమ్మతు పనులు
- ఉమ్మడి జిల్లాకు భారీగా నిధులు మంజూరు



రేపల్లె : బేతపూడిలో సీసీరోడ్డు నిర్మాణ నాణ్యతను పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ ఏఈ



బాపట్లలో శరవేగంగా జరుగుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులు

గుంటూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లపాటు రహదారులను ఆవరించిన గ్రహణం ఎట్టకేలకు వీడుతున్నది. రహదారుల మరమ్మతులు, నిర్వహణ, అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం భారీ మొత్తంలో నిధులు మంజూరు చేసింది. దీంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో రహదారుల మరమ్మతు, విస్తరణ పనులు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే మూడుజిల్లాల్లో ప్యాచ్ వర్కులు, తక్షణ మరమ్మతుల కోసం గత నెలలో రూ. 35 వేల కోట్లు కేటాయించిన ప్రభుత్వం, తాజాగా రహదారుల అభివృద్ధి కోసం భారీగా నిధులు మంజూరు చేసింది.

గుంటూరు జిల్లాకు రూ. 559.84 కోట్లు

విభజిత గుంటూరు జిల్లాలో రహదారుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం భారీ మొత్తంలో నిధులు మంజూరు చేసింది. జిల్లాలోని రహదారులు, వంతెనల నిర్మాణం, అభివృద్ధి కోసం 559.84 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో జిల్లాలో 719 కిలోమీటర్ల మేర రహదారుల్లో మరమ్మతులు చేస్తారు. గుంతలు పూడ్చి రోడ్లు వేస్తారు. వాటితోపాటు ఆగిపోయిన ఆర్వోబీలు, వంతెనలు నిర్మించడానికి కూడా నిధులు కేటాయించారు. ఎండీఆర్ ప్లాన్ కింద జిల్లాలోని 3 రహదారుల్లో 15.6 కి.మీ మేర రోడ్లు వేయనున్నారు. ఇతర జిల్లాలను కలిపే 4 రోడ్లలో 18.4 కి.మీ మేర రోడ్లు వేస్తున్నారు. సీఆర్ఎఫ్ నిధుల కింద 3 రోడ్లలో 14.75 కి.మీ మేర రోడ్లు వేస్తున్నారు. కాగా న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు ఫేజ్- 1 కింద 262.64 కోట్లతో జిల్లాలోని 13 రోడ్లు 94.11 కి.మీ మేర నిర్మిచనున్నారు. బాగా దెబ్బతిన్న 12 రోడ్లలో 69.84 కి.మీ మేర మరమ్మతులు చేపట్టగా, 50 రోడ్లకు సంబంధించి 222 కి.మీ మేర తక్షణ మరమ్మతులు, ప్యాచ్ వర్కులు చేపట్టనున్నారు. ఇంటెన్సివ్ ప్యాచ్ వర్కుల కింద 19 రోడ్లలో 107.79కి.మీ మేర, అంచులు తెగిన రోడ్ల ప్యాచ్ వర్కులు, జంగిల్ క్లియరెన్స్ కింద 33 రోడ్లలో 176.63 కి.మీ మేర రహదారి అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. వీటితోపాటు హనుమాన్‌పాలెం వద్ద ఆర్వోబీ నిర్మాణానికి రూ. 28 కోట్లు కేటాయించారు. కొండవీడు ఘాట్ రోడ్డుకు 6.8 కోట్లు కేటాయించారు. వెనిగండ్ల- జొన్నలగడ్డ రోడ్డు, గుంటూరు- నిడమర్రు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. గుంటూరు- బాపట్ల- చీరాల రోడ్డు, గుంటూరు- ఫిరంగిపురం రోడ్డు, ఎయిమ్స్ గేటు నుంచి ఎన్‌హెచ్- 16 వరకూ అప్రోచ్ రోడ్డుల నిర్మాణానికి మోక్షం లభించింది.

మంగళగిరి-

(మిగతా 6వ పేజీలో..)

తేమ సాకు.. రైతుకు షాకు

- ధాన్యం తేమ సాకుతో రైతు నిలువు దోపిడీ
- వాతావరణ మార్పులతో రైతుల్లో భయం... భయం
- యంత్రాలతో కోసిన ధాన్యంలో తేమ శాతం 19 నుంచి 21 వరకు
- ప్రభుత్వం ఇచ్చిన పరిమితి 17 శాతం
- అదనపు తేమ శాతాలు చూపి ఎదురు వసూలు చేస్తున్న మిల్లర్లు
- బస్తాకు రూ. 200 నుంచి రూ.300 కడితేనే ధాన్యం కొనేది!
- ప్రభుత్వం నిర్ణయించిన ఖుద్దతు ధర రూ. 1740
- బయటి మార్కెట్‌లో ధర రూ.1300 నుంచి రూ.1400 వరకు





ధాన్యం తేమ శాతాన్ని అంచనా వేస్తున్న పరికరం

తెనాలి, నవంబర్ 25, (ఆంధ్రజ్యోతి): ఆకాశం మేఘావృతమై ఎప్పుడు వర్షం పడుతుందోనన్న భయం... ఆరుగాలం పండించిన ధాన్యం ఎక్కడ వర్షానికి తడిచిపోయోనన్న ఆందోళనతో యంత్రాలతోనే వరి కోతకు ప్రాధాన్యం ఇస్తున్నారు డెల్టాలోని రైతులు. అయితే కోత కోసిన ధాన్యాన్ని వెంటనే అమ్మకుండా ఆరబెట్టి, తేమ తగ్గాకే అమ్మకాలు చేస్తారు. అయితే వాతావరణం అనుకూలంగా లేకపోవటంతో రైతులు ఆరబెడితే ఎక్కడ తడిచి పోయి అసలుకే నష్టం వస్తుందన్న భయంతో అమ్మటానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే వీరి భయాన్ని, వాతావరణ ప్రతికూలతను మిల్లర్లు వారికి అనుకూలంగా మార్చుకుంటున్నారు. రైతులను నిలవు దోపిడీ చేసేస్తున్నారు. ప్రభుత్వం రైతులకు మేలు చేసేందుకు అనేక మార్గాలను మార్కెటింగ్ కోసం ప్రవేశపెడితే, అవేమీ రైతులకు అక్కరకు రావటంలేదు. కృష్ణా డెల్టాలో 2024 ఖరీఫ్ పంట వచ్చేసింది. గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల పరిధిలో ఉన్న కోతలు మొదలుపెట్టేశారు. అయితే ధాన్యం అమ్ముకోటానికి గతంలోలాగా ఆర్ఎస్‌కేల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా వాట్సప్‌లో హాయ్ అని పెడితేచాలు... ధాన్యం అమ్మేసుకునేలా మార్పులు కూడా చేశారు. ఇదంతా బాగానే ఉంది. అయితే ఈ తతంగం మొత్తం పూర్తయిన తర్వాత వెళ్లాల్సింది మిల్లర్ల దగ్గరకే కావటంతో వారి దగ్గర దోపిడీకి మాత్రం తెరపడ లేదు. దీంతో రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

కృష్ణా పశ్చిమ డెల్టా కింద గుంటూరు జిల్లా పరిధిలో 1,84,190 ఎకరాలు, బాపట్ల జిల్లా పరిధిలో 3,79,997 ఎకరాలు, ప్రకాశం జిల్లా పరిధిలో 7,164 ఎకరాలలో ఖరీఫ్ వరి సాగవుతోంది. వీటిలో ఒక్క ప్రకాశం జిల్లాలో, బాపట్ల జిల్లాలోని తీర మండలాల్లో కొన్నిచోట్ల మినహాయించితే, మిగిలిన విస్తీర్ణం మొత్తం వరి కోతకు సిద్ధమైంది. తెనాలి, కొల్లిపర, మంగళగిరి, దుగ్గిరాల, పెదకాకాని, గుంటూరు, పొన్నూరు, బాపట్ల జిల్లా పరిధిలో కొల్లూరు, వేమూరు, అమృతలూరు, చుండూరు, భట్టిప్రోలు, చెరుకుపల్లి, రేపల్లె, మరికొన్ని మండలాల్లో వరి కోతలు మొదలయ్యాయి. మనుషులతో కోత కోయించే రైతులు మాత్రం వరుణుడిపై భారం వేసి, కుప్పలు వేసేందుకు వరి ఓదెలను చేలపైనే ఆరేవరకు ఉంచేస్తున్నారు. అయితే వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో, వరి కోత కోసేందుకు, కుప్పలు వేసేందుకు కూలీలు రేట్లు పెంచేశారు. వీరిపరిస్థితి అటుంచితే, 70 శాతం మంది రైతులు యంత్రాలతోనే కోతకోసి, అమ్మేసేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. తడిచి పోతే తర్వాత రేటు రాదని, పండించిన పంట దక్కకుండా పోతుందనే ఆందోళనతో కోత, కుప్ప, నూర్పిళ్లతో పని లేకుండా ఒకేసారి వరికోత యంత్రం సాయంతో కోసేసి, ధాన్యం అమ్ముకుంటున్నారు. అయితే యంత్రాల సాయంతో కోత కోసినప్పుడు ధాన్యంలో తేమ శాతం 19 నుంచి 21 వరకు ఉంటోంది. అదే వాతావరణం బాగుంటే తేమ తగ్గేవరకు ఆరబెట్టి అమ్ముకునేవారు. అయితే వరుణుడి

(మిగతా 6వ పేజీలో..)

రెట్టింపు తేమ శాతం వసూలు చేస్తున్నారు

సాధారణంగా తేమ ఉన్న ధాన్యం ఆరబెడితే, ప్రతి పది బస్తాలకు ఒక బస్తా వ్యత్యాసం ఉంటుంది. ఉదాహరణకు ఒక రైతు 100 బస్తాల ధాన్యం మిల్లర్‌కు వేశారనుకుంటే, దీనిలో తేమ వల్ల తరుగు 10 బస్తాలు ఉండొచ్చు. అంటే ప్రభుత్వ ధర ప్రకారం రూ. 17,400 మిల్లర్‌కు నష్టం వచ్చే మాట వాస్తవమే. అయితే 100 బస్తాలకు రూ. 300 చొప్పున ఎదురు వసూలు చేస్తుండటంతో అన్ని బస్తాలపైనా రూ. 30వేలపైనే మిల్లర్‌లకు రైతు ఎదురు కట్టాల్సి వస్తోంది. అంటే దాదాపు రెట్టింపు రేటును తేమ శాతం సాకుగా చూపి రైతు నుంచి ముందే దోచేస్తున్నారు. అదే తేమ శాతాన్ని బట్టి ఒక శ్లాబ్ రేటును ప్రభుత్వమే నిర్ణయిస్తే అంత నష్టం ఉడదనేది రైతుల మాట.

ప్రభుత్వమే రేటు నిర్ణయించాలి

ధాన్యం కొనుగోలుకు సంబంధించి తేమ శాతం 17 వరకు, మట్టి, రాళ్లు, తాలు గింజల వంటివి ఇతర వ్యర్థాలు 1 శాతం వరకు ఉండొచ్చని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ నిర్ణయించింది. చెడిపోవటం, రంగు మారటం, మొకలు వంటివి ఉన్న ధాన్యమయితే 5 శాతం, పక్వతలేని, ముడుచుకుపోయిన గింజలు 3 శాతం, ఏ గ్రేడ్ రకంలో తక్కువ రకం కానీ, కేళీలు 3 శాతం వరకు ఉండొచ్చని సూచించింది. అయితే ప్రస్తుతం తేమ శాతం సమస్యగా మారింది. 17 శాతం లోపు తేమ ఉంటే, ఎ గ్రేడ్ రకానికి రూ. 1740 చెల్లిస్తారు. అయితే ఆపై తేమ శాతం ఉన్నవాటికి మాత్రం ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం వాతావరణం ఇబ్బందికరంగా ఉన్న తరుణంలో తేమ ఉన్న ధాన్యాన్ని అమ్మక తప్పదని, ప్రభుత్వ కొనకపోతే చివరకు దళారులకైనా తెగనమ్మక తప్పదని రైతులు చెబుతున్నారు. అయితే 17 శాతానికి మించిన అదనపు శాతాలకు 21 శాతం వరకు ప్రభుత్వమే దరలో తరుగుదల నిర్ణయిస్తే, మిల్లర్ల దోపిడీ తగ్గుతుందనేది రైతుల విన్నపం.

'డిజిటల్' తో కదులుతున్న.. పరపతి డొంకలు....!

ఎన్నికల విధానానికి పాతరేసి సెవన్‌మెన్, త్రీమెన్ కమిటీలంటూ నామినేటెడ్ పదవుల పేరిట పార్టీ శ్రేణులకు పునరావాస కేంద్రాలుగా పీఏసీఎస్(ప్రైమరీ అగ్రికల్చరల్ క్రెడిట్ సొసైటీ)లను మార్చిన ఘనత వైసీపీ ప్రభుత్వానిది. సొసైటీ రుణాలను ఐదేళ్లలో ఇష్టారాజ్యంగా దుర్వినియోగం చేశారు. వైసీపీ నేతలు చెప్పిన వారికే రుణాలు తప్ప అర్హులైన రైతుల్లో మట్టి కొట్టి వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. కూటమి ప్రభుత్వంలోకి రాగానే తొలుత అక్రమాలపై దృష్టి పెట్టడంతో పాటు సొసైటీలకు ఎన్నికలు కూడా నిర్వహించాలని తలంచింది. కానీ ఈలోపుగా పారదర్శకతతో పాటు జరిగిన అక్రమాలన్నీ వెలుగుచూడాలంటే సొసైటీల్లో ఉన్న సభ్యుల ఖాతాలన్నీ ఆన్‌లైన్ చేయాలనే కీలక నిర్ణయం తీసుకుని అందుకు అనుగుణంగా ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే.

- కొనసాగుతున్న పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ ప్రక్రియ
- మూడు దశల్లో సభ్యుల ఖాతాలన్నీ ఆన్‌లైన్
- దాదాపు పది సొసైటీల్లో సరిపోని పద్దులు గుర్తింపు
- వాటిపై నిర్ణయం అధికారుల చేతుల్లోనే...
- రేపటితో ఆన్‌లైన్ ప్రక్రియ ముగిసే అవకాశం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సొసైటీల్లో సభ్యులు తీసుకన్న రుణాల వివరాలతో పాటు ఇక ముందు జరగబోయే లావాదేవీలన్నీ కూడా ఆన్‌లైన్ ద్వారానే జరపడం ద్వారా ఎటువంటి అక్రమాలకు ఆస్కారం అవకాశం లేకుండా ఉంటుందనేది ప్రభుత్వ ఆలోచనగా ఉంది. ప్రక్రియకు కావాల్సిన నిధుల సహాయం కేంద్ర ప్రభుత్వం నుంచి అందడంతో కంప్యూటరీకరణ పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ వేగవంతంగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. గతంలోనే జిల్లాలో సొసైటీ రుణాల మీద అనేక ఆరోపణలు వచ్చాయి. కానీ ప్రస్తుతం జరుగుతున్న డిజిటలైజేషన్‌లో భాగంగా టాలీ కానీ ఖాతాలు కూడా బహిర్గతమవుతున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి ఖాతాలు ఇప్పటి వరకు దాదాపు పది వరకు గుర్తించినట్లు తెలుస్తోంది. వీటి వివరాలను ఇప్పటికే యంత్రాంగం పై అధికారులకు పంపించినట్లు సమాచారం. ఆ ఖాతాల ఆన్‌లైన్ విషయంలో వారి ఆదేశాల మేరకే నడుచు కుంటామని యంత్రాంగం చెబుతోంది

61,000 ఖాతాలు డిజిటలైజేషన్...

జిల్లాలో 112 సొసైటీల పరిధిలో 77,752 రైతుల ఖాతాలు ఉన్నాయి. వీటన్నింటిని ఆన్‌లైన్ చేసే ప్రక్రియ గడచిన పదిహేను రోజులుగా సాగుతుండగా ఇప్పటికే 61,000 ఖాతాలు ఆన్‌లైన్ అయ్యాయని అధికారులు చెబుతున్నారు. బుధవారం నాటికి మొత్తం ఖాతాలను కంప్యూటరీకరణ చేయడం జరుగుతుందని, అనుమానాస్పద ఖాతాలతో పాటు, పద్దు సరిపోని వాటి విషయంలో పై అధికారుల ఆదేశాల మేరకు నడుచు కుంటామని యంత్రాం గం చెబుతోంది. జిల్లాలో మొత్తం 112 సొసైటీలు ఉండగా చీరాల, అద్దంకి, పర్చూరు పరిధిలో 68, బాపట్ల, వేమూరు, రేపల్లె కింద 44 పీఏసీఎస్‌లు ఉన్నాయి. డీసీసీబీలు అటు గుంటూరులోనూ, ఇటూ ఒంగోలులోనూ ఉన్నాయి. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కగానే పీఏసీఎస్‌ల్లో కొనసాగుతున్న త్రీమెన్ కమిటీలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన సంగతి విదితమే. వీరి స్థానంలో ప్రతి సొసైటీకి పర్సన్‌ఇన్‌చార్జిగా ప్రభుత్వ ఉద్యోగినే నియమించింది. ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తికాగానే అక్రమార్కులపై చర్య లతో పాటు సొసైటీలకు ఎన్నికలు జరిపి కొత్త పాలకవర్గాలను కూట మి ప్రభుత్వం కొలువుదీర్చనుంది

ఆడిట్ నివేదికలనూ తుంగలో తొక్కి....

ప్రతి ఏడాది సొసైటీల్లో ఆడిట్ చేపట్టడం ఆనవాయితీ. ఆ వివరాలను బహిరంగ పర్చడం ద్వారా పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామనే సంకేతాలను ప్రజలకు పంపించినట్లవుతోంది. కానీ ఐదేళ్ల పాటు ఈ నివేదికలను తొక్కిపెట్టారు తప్పితే బహిర్గతం చేసిన పాపాన పోలేదు. ఈ క్రమంలో నిబద్ధతతో పనిచేసే ఉద్యోగులపై త్రీమెన్ కమిటీలు వేధింపులకు కూడా తెగబడ్డాయి. నిర్ణీత కాలపరిమితితో సొసైటీల్లో పనిచేసే ఉద్యోగులను పర్మినెంట్ చేసేందుకు అప్పటి టీడీపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కానీ వైసీపీ ప్రభుత్వం ఈరెగ్యులర్ విషయంలో అనేక అవకతవకలకు పాల్పడ్డట్లు ఆధారాలతో సహా ఫిర్యాదులు గతంలోనే అందాయి. నిబంధనలకు పాతరేసి తేదీలు మార్చి వారికి కొమ్ముకాసే ఉద్యోగులనే రెగ్యులర్ చేశారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఓ వైపు డిజిటల్ ప్రక్రియ సాగుతుండగానే, గతంలో వచ్చిన అనేక ఫిర్యాదులపై అంతర్గతంగా శాఖాపరమైన విచారణ జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఎన్నో అవినీతి తిమింగలాలు బయటపడే అవకాశం ఉంది.

కదులుతున్న పరపతి డొంకలు

సొసైటీ ఖాతాలను ఆన్‌లైన్ చేసే క్రమంలో రుణాలతో పాటు మొత్తం లావాదేవీల విషయంలో పద్దు టాలీ కానీ ఖాతాలు వెలుగులోకి వచ్చా యి. ఇలాంటివి దాదాపు పది వరకు అధికారులు గుర్తించారు. వీటి విషయంలో కొన్ని మార్గద ర్శకాలను గతంలోనే ప్రభుత్వం ఇచ్చి ఉంది. సభ్యుడి ఖాతాకు సంబంధించిన మొత్తంలో ఒక శాతం వరకు ఖాతా విషయంలో పద్దు సరిపోక పోతే అలాంటి వాటి విషయంలో ముందుగా ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేసేయమనే ఆదేశాలు ఉన్నాయి. కానీ ఒక శాతానికి మించి రుణాల విషయంలో అవకతవకలు జరిగినట్లు ఈ ప్రక్రియలో గుర్తించిన ఖాతాలు కూడా పది వరకు ఉన్నట్లు తెలుస్తోంది. వీటిలో ప్రధానంగా నగరం, తుమ్మల సొసైటీలతో పాటు మరో 8 వరకు ఉన్నట్లు సమాచారం. అద్దంకి నియోజక వర్గ పరిధిలోని పంగులూరు మండలం నూజెళ్ల పల్లి సొసైటీలో బంగారం లేకుండానే రైతుల పేరిట వైసీపీ నేతలే రూ.2.20 కోట్లు రుణాలు కాజేసిన వైనం గతంలోనే వెలుగులోకి రాగా, ప్రస్తుతం పూర్తిస్థాయిలో ఆ వ్యవహారాన్ని నిగ్గు తేల్చే పనిలో అధికారులు ఉన్నారు. పర్చూరు, చీరాల పరిధిలోని 5 సొసైటీల్లో పెద్దఎత్తున అక్ర మాలు జరిగినట్లు గతంలోనే ఫిర్యాదులు వచ్చా యి. వీరందరి బాగోతం ప్రస్తుతం జరుగుతున్న కంప్యూటరీకరణ ద్వారా బహిర్గతం కానుంది

మొత్తం మూడు దశల్లో....పకడ్బందీగా....

సొసైటీల ఖాతాలను డిజిటలైజేషన్ చేసే ప్రక్రియ మూడు దశల్లో పకడ్బందీగా సాగుతోంది. మొదటి దశలో మొత్తం వివరాలను ఆన్‌లైన్ చేస్తారు. తర్వాత రెండో దశలో సైన్ ఆఫ్ ప్రక్రియ చేపడతారు. తర్వాత సొసైటీల మైగ్రేషన్ ఆన్‌లైన్ చేస్తారు. దీనిలో భాగంగా సొసైటీలో ఉన్న ఫర్నీచర్ వివరాలతో పాటు ఇతరత్రా ఆస్తుల వివరాలను డిజిటల్ చేయనున్నారు. సొసైటీ ఖాతాల డిజిటలైజేషన్‌లో కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యం కూడా ఉంది. ఒక్కో సొసైటీకి రెండు లక్షల నిధుల మంజూరు. వీటిద్వారా ఈ ప్రక్రియకు కావాల్సిన 16 రకాల సాంకేతిక పరికరాలను సొసైటీలకు కేంద్రం అందించింది. ఈ ఆన్‌లైన్ ప్రక్రియ మొత్తం నాబార్డ్ పర్యవేక్షణలో జరుగుతుండడంతో కొన్ని సాంకేతిక పరమైన ఇబ్బందులు కూడా ఎదురవుతున్నట్లు యంత్రాంగం చెబుతోంది. ముఖ్యంగా నెట్ సమస్యతో పాటు సిస్టమ్ హ్యాంగ్ అవడం, ఆ సాఫ్ట్‌వేర్ విషయంలో ఉన్న సందేహాలను నివృత్తి చేసే వారు లేకపోవడం కూడా ఆన్‌లైన్ ప్రక్రియ వేగంగా సాగడానికి ప్రతికూలంగా ఉన్నాయని, అయినప్పటికీ బుధవారం కల్లా మొత్తం ఖాతాలను ఆన్‌లైన్ చేస్తామని అధికారులు చెబుతున్నారు.



ఇంకొల్లు పీఏసీఎస్ కార్యాలయ భవనం

ఐపీఎల్ జట్టులో.. గుంటూరు కుర్రోడు

- క్రికెటర్ రషీద్‌కు ఐపీఎల్ వేలంలో రూ. 30 లక్షలు
- చెన్నై సూపర్‌కింగ్స్ జట్టులో చోటు



రషీద్

గుంటూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన యువ క్రికెటర్ షేక్ రషీద్ ఐపీఎల్ వేలంలో రూ. 30 లక్షలకు చెన్నై సూపర్‌కింగ్స్ జట్టు దక్కించుకున్నది. సోమవారం జరిగిన వేలంలో రషీద్‌ని చెన్నై జట్టు కొనుగోలు చేసింది. అయితే ఆ జట్టులో దిగ్గజ ఆటగాళ్లు ఉన్న నేపథ్యంలో ఐపీఎల్ మ్యాచ్‌లలో ఆడే అవకాశం రషీద్‌కు ఇస్తారో, లేదోనన్న అనుమానాలు ఉన్నాయి. గత ఏడాది కూడా ఇలానే చెన్నై జట్టు రషీద్‌ని దక్కించుకోగా మ్యాచ్‌లలో ఆడే అవకాశం కల్పించలేదు. 20 సంవత్సరాల వయస్సు కలిగిన ఈ కుడిచేతి వాటం బ్యాట్స్‌మెన్ స్వస్థలం గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పాతమల్లాయపాలెం గ్రామం. రషీద్ బాల్యం ఇక్కడే గడిచింది. రషీద్ క్రికెట్ ప్రాక్టీసు కోసం ఆయన కుటుంబం గుంటూరు నగరానికి వలస వచ్చింది. ఇక్కడి హౌసింగ్ బోర్డు కాలనీలోని ఒక చిన్న ఇంటిలో నివాసం ఉంటున్నది.

రషీద్ ఇప్పటివరకు 17 ఫస్టుక్లాస్ మ్యాచ్‌లు ఆడారు. 30 ఇన్నింగ్స్‌ల్లో బ్యాటింగ్ చేసి ఒకసారి నాటౌట్‌గా నిలిచారు. 36.13 సగటుతో 1048 పరుగులు సాధించారు. ఇందులో ఇటీవలే హైదరాబాద్‌తో జరిగిన రంజీ మ్యాచ్‌లో 203 పరుగుల డబుల్ సెంచరీతో మెరిశాడు. అలానే లిస్టు ఏ మ్యాచ్‌లు 8 ఆడి 62 పరుగులు మాత్రమే చేశాడు. టీ20లు 11 మ్యాచ్‌లు ఆడి 300 పరుగులు చేశాడు. 42.85 సగటుతో ఈ పరుగులు చేశాడు. టీ20లలో బెస్టు స్కోరు 100గా ఉన్నది. టీ20లలో స్ట్రైక్ రేట్ 139.54గా ఉన్నది. రషీద్ లెగ్‌స్పిన్ కూడా వేయగలిగిన ఆల్‌రౌండర్. అయితే ఆయనకు ఎక్కువగా బౌలింగ్ చేసే అవకాశాన్ని ఆయా జట్లు కల్పించలేదు. ఈ కారణంగా ఇప్పటివరకు రెండు వికెట్లు మాత్రమే తీశారు. రషీద్ అండర్-19 ప్లేయర్‌గా కూడా కొనసాగుతున్నాడు.

అవకాశాలు కల్పించాలి

ప్రతిభ ఉన్న క్రికెటర్లకు అవకాశాలు కల్పిస్తేనే వారు తమ సత్తాని నిరూపించుకోగలుగుతారు. ఈ సూత్రాని ఇండియన్ క్రికెట్‌లో మాజీ కెప్టెన్ సౌరబ్ గంగూలీ ఆచరణలో పెట్టడం వలనే ఎంఎస్ ధోని, యువరాజ్ సింగ్, వీరేంద్ర సెహ్వాగ్, హర్భజన్ సింగ్ వంటి ఆటగాళ్లు తయారయ్యారు. ఆ తర్వాత ఎంఎస్ ధోని తను కెప్టెన్సీగా ఉండగా రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, సురేష్ రైనా వంటి ఆటగాళ్లకు అవకాశం కల్పించారు. రషీద్ ముఖ్యంగా టెస్టు మ్యాచ్‌లలో సుదీర్ఘంగా ఆడగలిగిన సత్తా ఉన్నది. అలానే టీ20లలోనూ చురుకుగా బ్యాటింగ్ చేస్తాడు. ఈ నేపథ్యంలో చెన్నై సూపర్‌కింగ్స్ అతనికి అవకాశాలు కల్పించాలని క్రికెట్ అభిమానులుగా అందరం కోరుకుందాం.

ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందించాలి

- వైసీపీ పాలనలో మాదిరి అవకతవకలకు పాల్పడితే చర్యలు : మంత్రి గొట్టిపాటి



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న మంత్రి గొట్టిపాటి

బల్లికురవ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వంలో మాదిరిగా పథకాలలో అవకతవకలు జరిగితే ఉపేక్షించేది లేదని, సక్రమంగా ప్రజలకు చేరేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. సోమవారం బల్లికురవ మండల కేంద్రంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రామ సభకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరయ్యారు. ముందుగా శాఖలవారీగా ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న అభివృద్ధి పనులు, రాబోవు రోజుల్లో చేపట్టే సంక్షేమ కార్యక్రమాలపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఉపాధి హామీ పథకం కింద తక్షణమే పనులు ప్రారంభించాలన్నారు. పను లు ఎక్కువ చేస్తేనే రోడ్లకు నిధులు మంజూరవుతాయన్నారు. గత వైసీపీ పాలనలో చేసినట్లు బోగస్ మస్టర్‌లు వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిజమైన కూలీలకు 100 రోజుల పని దినాలు కేటాయించాలన్నారు. రేషన్ బియ్యం అక్రమ మార్గంలో తరలిస్తే ఎంతటి వారైనా వదలొద్దన్నారు. అనంతరం మంత్రి రవికుమార్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ కవిత, ఎంపీడీవో కుసుమకుమారి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనలో అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ జె.వెంకట మురళి



బాపట్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటనను జయప్రదం చేయాలని జిల్లా అధికారులకు కలెక్టర్ జె. వెంకటమురళి సూచించారు. జిల్లా అధికారులతో సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపట్ల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగే విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశానికి డిసెంబరు 7న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరుకానున్నారని తెలిపారు. అధికారిక సమాచారం వచ్చినందున అధికారులంతా అప్రమత్తం కావాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత విద్యాశాఖాధికారులు, మున్సిపల్ అధికారులపై ఉందన్నారు. ఎక్కడ ఎలాంటి సమస్యలు రాకుండా సమగ్ర ప్రణాళికతో అధికారులు పనిచేయాలన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు అందుతాయన్నారు. ఆయాశాఖల అధికారులు చేపట్టాల్సిన పనులను వివరించారు. సీఎం పర్యటనకు 10 రోజులు గడువు ఉన్నందున మంచి ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు.



ధర్నా చేస్తున్న సిపాయి కాలనీ ఎస్టీలు

న్యాయం చేయాలని ఎస్టీల ధర్నా

బల్లికురవ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : తాము ఎన్నో ఏళ్ల నుంచి నివాసం ఉంటున్న స్థలాన్ని ఖాళీ చేయమనడం అన్యాయమని సిపాయికాలనీకి చెందిన ఎస్టీలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు తహసీల్దార్ కవితకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మంత్రి రవికుమార్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. మంత్రి రవికుమార్ వెంటనే ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడుని ఎస్టీల సమస్యను పరిష్కరించాలని, వెంటనే ఎస్టీలకు ఇచ్చిన పట్టాలను పరిశీలించి వారికి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షునిగా పాపారావు



పాపారావు

చినగంజాం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) జిల్లా గౌరవ అధ్యక్షునిగా సోపిరాల గ్రామానికి చెందిన సిద్ధం పాపారావు ఎన్నికయ్యారు. పాపారావు పల్లెపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని బాపయ్యనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా ఉన్నారు. బాపట్లలోని సూర్యకాశీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన స్వర్ణోత్సవ మహాసభ, నూతన కౌన్సిల్ సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ టీఎస్ఎల్ఎన్. మల్లేశ్వరరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఎన్నికలలో పాపారావుని జిల్లా గౌరవ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. గత మూడు పర్యాయములుగా జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఎన్నికవుతూ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం చినగంజాంలో జరిగిన అభినందన సభలో పాపారావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. పాపారావుకి మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మెట్టు శ్రీనివాసరావు, షేక్ నాయబ్‌రసూల్, గౌరవ అధ్యక్షులు ఎన్.సూర్యనారాయణ, ఉపాధ్యక్షులు సీ.హెచ్.వెంకట్, టీ.సౌజన్య తదితరులు అభినందనలు తెలిపారు.

యూటీఎఫ్ జిల్లా కమిటీలో ఇంకొల్లు ఉపాధ్యాయులు

ఇంకొల్లు : యూటీఎఫ్ జిల్లా కార్యవర్గంలో ఇంకొల్లు మండలానికి చెందిన ఉపాధ్యాయులకు అవకాశం దక్కింది. ఈ నెల 24న బాపట్లలో జరిగిన జిల్లా కార్యవర్గ ఎన్నికలో జిల్లా కార్యదర్శిగా ఇంకొల్లు మండలం దుద్దుకూరు ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న యూ చెంచయ్య, జిల్లా మహిళా కార్యదర్శిగా గంగవరం వలేటి కృష్ణయ్య ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న వలేటి విజయలక్ష్మి, అకడమిక్ సెల్ కన్వీనర్‌గా పావులూరు ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న చిలుకూరి హనుమంతరావు ఎన్నికయ్యారు. వీరి ఎన్నికపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిపైకి దూసుకెళ్లిన బైకు

గణపవరానికి చెందిన అధ్యాపకుడు మృతి



బ్రిడ్జి వద్ద ఇనుప కడ్డీకి వేలాడుతున్న ప్రసాద్, ప్రసాద్ (ఫైల్)

పర్చూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ హైవేరోడ్ పనుల్లో భాగంగా నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిపైకి ద్విచక్రవాహనం దూసుకుపోయి వ్యక్తి మృతి చెందిన సంఘటన చీరాల రోడ్డులోని ఎస్ఎఫ్ఎస్ పాఠశాల సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికల సమాచారం మేరకు . పల్నాడు జిల్లా, చిలకలూరిపేట మండలం, గణపవరానికి చెందిన జంపని ప్రసాద్(38) చీరాలలోని ప్రైవేటు కళాశాలలో ఫ్యాకల్టీగా పనిచేస్తున్నారు. రోజూ మాదిరిగానే ఆదివారం రాత్రి చీరాల నుంచి తన స్వగ్రామం బైక్ మీద వెళుతూ ప్రమాదానికి గురయ్యారు. నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన డైవర్షన్ బోర్డును గమనించకపోవడంతో ద్విచక్ర వాహనం నేరుగా బ్రిడ్జిలోకి దూసుకుపోయింది. దీంతో అతని తల కాంక్రీట్ గోడకు బలంగా ఢీకొనడంతోపాటు, బ్రిడ్జికి ఏర్పాటు చేసిన ఇనుప కడ్డీలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందారు. వాహనం కూడా పూర్తిగా దెబ్బతింది. ఉదయాన్నే మృతదేహాన్ని గుర్తించిన వాహనదారులు, బ్రిడ్జి నిర్మాణ కూలీలు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ మాల్యాద్రి తన సిబ్బందితో హుటాహుటినా చేరుకొని సిబ్బంది సహాయంతో లోయలో నుంచి మృతదేహాన్ని బయటకు తీయించారు. విషయం తెలుసుకున్న ప్రసాద్ కుటుంబ సభ్యులు చేరుకొని బోరున విలపించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పంచనామా అనంతరం పర్చూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ప్రసాద్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

హక్కుల రక్షణకు ప్రత్యేక చర్యలు

డీఎస్పీ మొయిన్

చీరాలటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : హెచ్ఐవీ బాధితులకు ప్రత్యేక హక్కులు ఉన్నాయని వాటికి భంగం కలిగించకుండా సహకరించాలని చీరాల డీఎస్పీ ఎండీ మొయిన్ పేర్కొన్నారు. సోమవారం డీఎస్పీ కార్యాలయంలో జిల్లా హెచ్ఐవీ ఎయిడ్స్ నిర్మూలన సమీకృత వ్యూహం(దిషా) హెల్ప్ స్వచ్ఛంద సంస్థ, టీఐ చీరాల మహిళా మండలి ఆధ్వర్యంలో హెచ్ఐవీ ఎయిడ్స్ ప్రివెన్షన్, కంట్రోల్ యాక్ట్ 2017పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ బాధితుల ఫొటోలు వైరల్ కాకుండా చూడాలన్నారు. బాధిత కుటుంబాలకు చెందిన పిల్లలకు స్కూల్స్, కళాశాలల్లో వివక్ష లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్య, ఎస్సై సురేష్, చినగంజాం ఎస్సై రమేష్, కారంచేడు ఎస్సై వెంకటరావు, ప్రోగ్రాం మేనేజర్ వెంకటరావు, అవుట్ రీచ్ వర్కర్స్ పాల్గొన్నారు.

వాజ్‌పేయి విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

అద్దంకిటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ వద్ద భారతరత్న, మాజీ ప్రధాని వాజ్‌పేయి విగ్రహ ఏర్పాటుకు సోమవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానిగా వాజ్‌పేయి దేశంలో చేపట్టిన అభివృద్ధిని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ మోర్చా జోనల్ ఇన్‌చార్జి పరుచూరి శ్రీనివాసరావు, రాష్ట్ర ఆర్టిజన్ సెల్ కన్వీనర్ కొండమూది బంగారు బాబు, జాగర్లమూడి యలమందరావు, టీడీపీ సీనియర్ నాయకులు సందిరెడ్డి రమేష్, కోనేటి అనిల్‌కుమార్, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం చైర్మన్ ఊటుకూరి రామకోటేశ్వరరావు, కముదాని శ్రీరామ్, ఎంఎల్ సుబ్రహ్మణ్యం, రమణ, వెంకన్న, ఫణి పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న బీజేపీ, టీడీపీ నాయకులు

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

- ఉపాధిలో బోగస్ మస్టర్‌లు, బియ్యం అక్రమ తరలింపుపై ఉపేక్షించేది లేదు
- మంత్రి గొట్టిపాటి



సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న మంత్రి గొట్టిపాటి

బల్లికురవ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సూచించారు. సోమవారం బల్లికురవ మండల కేంద్రంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రామ సభకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరయ్యారు. ముందుగా శాఖలవారీగా ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న అభివృద్ధి పనులు, రాబోవు రోజుల్లో చేపట్టే సంక్షేమ కార్యక్రమాలపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామాలలో ఉపాధి హామీ పథకం కింద తక్షణమే పనులు ప్రారంభించాలన్నారు. పనులు ఎక్కువ చేస్తేనే రోడ్లకు నిధులు మంజూరవుతాయన్నారు. గత వైసీపీ పాలనలో చేసినట్లు బోగస్ మస్టర్‌లు వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిజమైన కూలీలకు 100 రోజుల పని దినాలు కేటాయించాలన్నారు. రేషన్ బియ్యం అక్రమ మార్గంలో తరలిస్తే ఎంతటి వారైనా వదలొద్దన్నారు. రోడ్ల వెంబడి గ్రానైట్ వ్యర్థాలు వేస్తే సంబంధిత ఫ్యాక్టరీలు, క్వారీల వారికి నోటీసులిచ్చి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతు సేవా కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. గోకులం షెడ్లు రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున మంజూరు చేయిస్తామన్నారు. అర్హులైన ప్రజలందరికీ పక్కా గృహాలు కేటాయిస్తామని, యూనిట్ ధర ఎంత అనేది ప్రభుత్వం నిర్ణయించాల్సి ఉందన్నారు. జనవరి నుంచి నూతన పింఛన్‌లు మంజూరు చేస్తారన్నారు. ఎంపీడీవో కార్యాలయ నిధులను వైసీపీ హయాంలో అడ్డగోలుగా దోచుకున్నారని, నిధులు లేకుండా రెండు కోట్లకు తూతు మంత్రంగా మట్టి రోడ్లు వేశారని తక్షణమే అన్ని రోడ్లను పరిశీలించి పనులు నాణ్యతగా ఉంటేనే బిల్లులు చెల్లించాలని పంచాయతీ రాజ్ ఏఈ మాధవ్‌కు సూచించారు. తాగు నీరు అందించే సీపీడబ్ల్యూ పథకం ద్వారా పనిచేసే పథకాలకు తక్కువకు టెండర్ వేసే వారితో డిపాజిట్ చేయించుకోవాలని, ఎక్కడా నీటి కొరత రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాలలో విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. రెవెన్యూ సమస్యలు అధికంగా ఉన్నదృష్ట్యా గ్రామాల్లో పర్యటించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఎస్ఎల్ గుడిపాడులో ఉన్న సిపాయి కాలనీ వాసుల సమస్యలను పరిష్కరించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలను పూర్తిస్థాయిలో చేపట్టేలా నిధులను మంజూరు చేయిస్తామన్నారు. అనంతరం మంత్రి రవికుమార్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ కవిత, ఎంపీడీవో కుసుమకుమారి, ఎంపీపీ శ్రీలక్ష్మి, సర్పంచ్ అంజిబాబు, టీడీపీ మండల నాయకులు మలినేని గోవిందరావు, కొండేటి ఇజ్రాయల్, గొట్టిపాటి లక్ష్మయ్య, చింతల శ్రీనివాసరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి సమస్యల వెల్లువ

తొలిసారిగా వచ్చిన మంత్రికి పలు గ్రామాల ప్రజలు సమస్యలను చెప్పుకున్నారు. నక్కబొక్కలపాడు గ్రామానికి చెందిన రైతులు పశువైద్యశాలను బల్లికురవకు కేటయించాలన్నారు. బల్లికురవ - మార్టూరు రోడ్డును అభివృద్ధి చేయాలని కోరారు. జూనియర్ కళాశాలకు బాలుర హాస్టల్‌ను మంజూరు చేయాలని కోరారు. కస్తూర్బా ఆటస్థలాన్ని అభివృద్ధి చేయాలని అధ్యాపకులు విజ్ఞప్తి చేశారు. అద్దంకి నుండి కొణిదెన చిలకలూరిపేట నైట్ బస్సును పునరుద్ధరించాలని, వల్లాపల్లి పాఠశాలలో అదనపు తరగతి గదులను నిర్మించాలని ఉపాధ్యాయులు మంత్రి దృష్టికి తెచ్చారు.

సీఎం సహాయం అందజేత

నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన 55 మందికి సీఎం సహాయ నిధి చెక్కులను మంత్రి గొట్టిపాటి అందజేశారు. రూ.కోటీ 11అక్షల 32వేలకు ఎల్‌వోసీలను అందజేశారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో 123 మందికి రెండు కోట్ల మేర చెక్కులను అందజేసిన్నట్లు మంత్రి తెలిపారు.

తేమ సాకు.. రైతుకు షాకు

(5వ పేజీ తరువాయి)

గుబులుతో కోత కోయటం ఆలస్యం ధాన్యాన్ని చేను నుంచి దాటించేస్తున్నారు. అయితే ఇక్కడే తేమ శాతాలతో చిక్కు వచ్చిపడింది.

బస్తాకు రూ. 200పైన ఎదురు వసూళ్లు

రైతు పండించిన ధాన్యం అమ్మితే కొన్న వ్యాపారి కానీ, మిల్లర్లు కానీ రైతుకే డబ్బు చెల్లించటం సహజం. అయితే ఇప్పుడు పరిస్థితి దీనికి విరుద్ధంగా ఉంది. తాను పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం అమ్ముకోవాలంటే ఎదురు డబ్బు కట్టాల్సి వస్తోంది. వరి కోతలు మొదలయిన తరుణంలో ధాన్యం మద్దతు ధరను ప్రభుత్వం 75 కిలోల బస్తా ఎ గ్రేడ్ రకానికి రూ. 1740, సాధారణ రకం ధాన్యానికి రూ. 1725గా ధర నిర్ణయించింది. అదే బయట మార్కెట్‌లో అయితే యంత్రాలతో కోసిన ధాన్యానికి ఎంత తేమ ఉన్నా బస్తా రూ. 1300 నుంచి రూ. 1400 వరకు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం మద్దతు ధర దీనికి మించి ఉండటంతో రైతులు కొనుగోలు కేంద్రాలకే అమ్మేందుకు ఇష్టపడుతున్నారు. అనుకున్నట్టే మార్కెటింగ్ శాఖ చూపిన ప్రకారం ధాన్యం అమ్మేందుకు రైతులు ముందుకు వస్తున్నారు. అయితే దీనికి సంబంధించిన ప్రక్రియ అంతా బాగానే ఉన్నా, తీరా మిల్లర్ దగ్గరకు వెళ్లే సరికి రైతుకు సమస్య ఎదురవుతోంది. తేమ 17 శాతంలోపు ఉంటే మాత్రం ఏ ఇబ్బందీ పెట్టటంలేదు. సమస్యంతా తేమ ఎక్కువగా ఉండే ధాన్యానికే. 18 నుంచి 21 శాతం వరకు తేమ ఉంటుండటంతో మిల్లర్లు కొనుగోలు చేయమని చెప్పకుండా, రైతుల నుంచి ముందస్తుగానే వసూళ్లకు దిగుతున్నారు. తేమ శాతం 17 నుంచి 19 శాతం ఉంటే బస్తాకు రూ. 200 చొప్పున, 20 నుంచి 21 శాతం తేమ ఉంటే రూ. 300పైన ఎదరు కట్టాలని రైతుల నుంచి నిలబెట్టి వసూలు చేస్తున్నారని, చెబుతున్నారు.

బస్తాకు రూ. 200 నుంచి రూ. 300 ఎదురు కట్టాల్సి రావటం ఇబ్బదిగా ఉందని, అదే ప్రభుత్వమే రేటులో కోత విధిస్తే, మిల్లర్లకు ఎదురు కట్టే పరిస్థితి ఉండదని, పైగా వారు మద్దతు ధరలో కోతకోసి దోపిడీ చేయకుండా తెరపడుతుందని, రైతులకు మేలు జరుగుతుందనేది రైతుల మాట. 75 కిలోల బస్తాకు ఎంత తేమ ఉంటే ఎంత తరుగుదల ఉంటుందనే అంశాన్ని వ్యవసాయ, పౌరసరఫరాల శాఖలు సమన్వయంతో నిర్ణయించి రేటు నిర్ణయిస్తే చాలావరకు మేలు జరుగుతుంది. రైతుల నిలువుదోపిడీ లేకుండా పోతుంది. త్వరలో రైతు సంఘాల నాయకులు కూడా ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి, పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్ దగ్గరకు తీసుకువెళ్లాలనే ఆలోచనకు వచ్చినట్లు చెబుతున్నారు. దీనిపై మరోసారి పునరాలోచించాలనేది రైతుల విన్నపం.

రహదారులకు మహర్దశ

(5వ పేజీ తరువాయి)

తెనాలి రోడ్డు దుగ్గిరాల వద్ద, చిలకలూరిపేట- పెదనందిపాడు రోడ్డు, వట్టిచెరుకూరు- పొంద్రపాడు, యర్రగుంట్లపాలెం- తుళ్లూరు, కాజ- ఉప్పలపాడు, గుంటూరు- హనుమాన్‌పాలెం, తెనాలి నారాకోడూరు రోడ్లను నిర్మించనున్నారు.

పల్నాడు జిల్లాకు

పల్నాడు జిల్లాలో తక్షణ మరమ్మతుల కోసం భారీగా నిధులు కేటాయించారు. ఏడు నియోజకవర్గాల్లో జిల్లా ప్రధాన రహదారుల మరమ్మతుల నిమిత్తం 4.86 కోట్లు కేటాయించారు. అత్యధికంగా గురజాల నియోజకవర్గానికి 1.12 కోట్లు కేటాయించగా, చిలకలూరిపేటకు 93.7 లక్షలు, నరసరావుపేటకు 89.6 లక్షలు, మాచర్లకు 85 కోట్లు చొప్పున కేటాయించారు. వీటితోపాటు అత్యవసర మరమ్మతుల కింద 567.8 కిలో మీటర్ల రహదారుల్లో 82 పనులకు మొత్తం 22.44 కోట్లు కేటాయించారు. వీటిలో 72 మరమ్మతులకుగానూ 3.44 కోట్లు, 371 కి.మీ మేర ప్యాచ్ వర్కుల నిమిత్తం 11.57 కోట్లు, రోడ్డు అంచుల ప్యాచ్ వర్కుల కోసం 94.5 లక్షలు, కంపచెట్ల తొలగింపు కోసం 91.7 లక్షలు, వర్షపు నీటికి దెబ్బతిన్న రోడ్లకు 4.15 కోట్లు కేటాయించారు. ప్రధానంగా రొంపిచర్ల, చిలకలూరిపేట, మాచర్ల, దాచేపల్లి, పెదకూరపాడు, సత్తెనపల్లి, నరసరావుపేట, వినుకొండ, శావల్యాపురం, కారెంపూడి, గురజాల, పిడుగురాళ్ల, క్రోసూరులలో ఈ రోడ్లకు మరమ్మతులు చేయించనున్నారు.

బాపట్ల జిల్లాకు రూ. 72.5 కోట్లు

బాపట్ల జిల్లాలో బాపట్ల- రేపల్లె సబ్ డివిజన్లో 217 కి.మీ మేర రాష్ట్ర రహదారులు, 599.6 కి.మీ మేర జిల్లా ప్రధాన రహదారులకు మరమ్మతులు నిర్వహిస్తున్నారు. జిల్లా రహదారు మరమ్మతులకు సంబంధించి కోటిన్నర రూపాయలతో ఇప్పటికే పనులు పూర్తి చేశారు. కేంద్ర రహదారుల నిధుల కింద రూ. 36.31 కోట్లతో 60.35 కి.మీ మేర రోడ్డు పనులు నిర్వహిస్తున్నారు. నేషనల్ డెవలప్‌మెంట్ బ్యాంకు నిధులు రూ. 8.91 కోట్లతో 5.97 కి.మీ మేర రోడ్లు నిర్మిస్తున్నారు. వాటితోపాటు రేపల్లె- నిజాంపట్నం మధ్య రెండు చోట్ల పైప్ కల్వర్టులు, గుంటూరు చీరాల మధ్య మరో కల్వర్టు నిర్మిస్తున్నారు. బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గంలో కట్టపాడు- శంకరపురం రోడ్డు, రావినూతల రోడ్డు, రేపల్లె- నిజాంపట్నం రోడ్డు, పర్చూరు వంకాయలపాడు- కొడవవలివారిపాలెం రోడ్డు, చీరాల- దగ్గుబాడు రోడ్డు, గన్నెపూడి- తిక్కరాజుపాలెం, నూతలపాడు- కారంచేడు, కారంచేడు- ఇంకొల్లు, పందిళ్లపల్లి- కడవకుదురు, వేటపాలెం, సంతరావూరు, జాండ్రపేట- వేటపాలెం, పర్చూరు- ఇంకొల్లు, వేమూరులో వెల్లటూరు- జువ్వలపాలెం, గాజుల్లంక- చింతమోటు, చినపులివర్రు- రావికంపాడు, తెనాలి- వెల్లటూరు, బాపట్లలో కాజీపాలెం- బుద్దం మొత్తం 22 పనులకు రూ. 1.15కోట్లు కేటాయించారు. వీటితోపాటు 14 చోట్ల జంగిల్ క్లియరెన్సు పనుల నిమిత్తం 71.28 లక్షలు కేటాయించారు.

ఎమ్మెల్యే ఏలూరికి అభినందనలు

చినగంజాం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : బ్రిటీష్ పార్లమెంట్ నుంచి విజనరీ లీడర్-2024 అంతర్జాతీయ పురస్కారం పొందిన పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావుకి చినగంజాం గ్రామ టీడీపీ నాయకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ మండల కార్యాలయంలో చినగంజాం గ్రామ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నాయకులు కేకు కట్ చేశారు. కేకు కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు, టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు చెరుకూరి రాఘవయ్య, నాయకులు తుమ్మలపెంట జయరావు, సందు శ్రీనివాసరావు, బెల్లంకొండ రమేష్‌బాబు, పర్వతరెడ్డి పార్థసారిధి, నరహరి శ్రీనివాసరావు, షేక్ జిలాని, గుండ్రెడ్డి నరసింహారావు, భయ్యా సతీష్, షేక్ నబీషా, ఎం.లక్ష్మయ్య, మన్యం పద్మ, మాచవరపు రామాంజనేయులు, గంటా వెంకటనారాయణ, జి.నరసింహారవు, టీ.వెంకటేశ్వరరావు, షేక్ బాజీ, ఎస్.సూరిబాబు, చేవూరి రవణమ్మ, ఉదయ్ భాస్కర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

మేదరమెట్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : విద్యతోనే అభివృద్ధి సాధ్యమని తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం రాత్రి మేదరమెట్లలోని బీసీ సంక్షేమ హస్టల్‌లో విద్యార్థులతో అయన మాట్లాడారు. విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చలి తీవ్రత అధికంగా ఉన్నందున దుప్పట్లు ఇతర వసతులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పెట్టే ఆహార మెనూను కచ్చితంగా అమలు చేయాలన్నారు. విద్యార్థులతో మాట్లాడుతూ క్రమశిక్షణతో కష్టపడి చదివి కుటుంబానికి, గ్రామానికి మంచి పేరు తేవాలన్నారు. మీరు మీతో పాటు మీ కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే విద్యే దానికి మార్గమన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ కృష్ణమోహన్, వీఆర్‌వో ప్రియాంక, ఇన్‌చార్జి వార్డెన్ సుమలత, హస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రభుత్వం చేయూత

బల్లికురవ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో పూర్తి దివ్యాంగులుగా బాధ పడుతున్న వారికి ప్రభుత్వం చేయూతను ఇస్తుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ భరోసా ఇచ్చారు. సోమవారం బల్లికురవ వచ్చిన అయన కాన్పూర్ ఆర్టిఫిషియల్ కార్పొరేషన్ నెల్లూరు వారి ద్వారా బల్లికురవ మండలంలోని నలుగురు దివ్యాంగులకు అందించిన బ్యాటరీ సైకిళ్లను మంత్రి చేతుల మీదుగా అందజేశారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామాలలో ఎవరైనా తమకు ట్రై సైకిళ్లు కావాలంటే వెంటనే దరఖాస్తు చేసుకొంటే వెంటనే మంజూరు చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు దమ్ము అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నేత్రదానం

అద్దంకిటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో సోమవారం నేత్రదానం జరిగింది. పట్టణంలోని కొత్తపేటకు చెందిన మీరా పాన్ షాపు యజయాని, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ తండ్రి షేక్ మీరాసాహెబ్(85) సోమవారం మృతి చెందారు. మీరాసాహెబ్ కుటుంబ సభ్యుల అంగీకారంతో రోటరీ కార్యదర్శి నేత్ర విభాగం డైరెక్టర్ చుండూరి మురళీసుధాకరరావు సమాచారంతో పెద్ద కాకాని శంకర్ నేత్రలయం వైద్యులు డాక్టర్ సందీప్ బృందం మీరా సాహెబ్ కార్నియాలను సేకరించారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, ట్రెజరర్ శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, చిన్ని మురళీకృష్ణ, ఊటుకూరి రామకోటేశ్వరరావు షేక్ అంజాద్ బాషా పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు

- ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు

క్షతగాత్రులు కర్నూలు వాసులు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

బేస్తవారపేట, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): ఇంటర్వ్యూకు హాజరై కారులో తిరిగి సొంతూరికి వెళ్తున్న వారిని ట్రాక్టర్ రూపంలో ప్రమాదం వెంటాడింది. ఈ దుర్ఘటనలో ఒకరు మృతిచెందగా, ముగ్గురు గాయపడ్డారు. బేస్తవారపేట మండలం శాంతినగర్ వద్ద సోమవారం వేకువజామున ప్రమదం చోటుచేసుకొంది. కర్నూలుకు చెందిన నలుగురు వ్యక్తులు కారులో ఒంగోలుకు వచ్చారు. అక్కడ ఓ ఇంటర్వ్యూకు హాజరై తిరిగి కర్నూలుకు వెళుతున్నారు. అమరావతి- అనంతపురం జాతీయ రహదారిపై మండలంలోని శాంతినగర్ వద్ద తెల్లవారుజామున 5గంల ప్రాంతంలో ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను గమనించకుండా వెనుకభాగంలో ఢీకొట్టారు. దీంతో వీరు ప్రయాణిస్తున్న కారు నుజ్జు నుజ్జయ్యింది. కారులో ప్రయాణిస్తున్న పటాన్ ఇమ్రాన్‌ఖాన్(35) అక్కడికక్కడే మృతిచెందాడు మిగిలిన మృతుని తమ్ముడు పటాన్ ఇర్ఫాన్‌ఖాన్, అల్తాఫ్ మాష్, ఖాజాబాషాలు గాయపడ్డారు. వీరిని 108 ద్వారా గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఏఎస్ఐ నారాయణరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు ముళ్లకంచె



ట్రాన్స్‌ఫార్మర్ చుట్టు కంచెను ఏర్పాటు చేస్తున్న సెక్రటరీ

తోటవారిపాలెం(చీరాలటౌన్), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండలం తోటవారిపాలెంలో ఆరేళ్ల బాలుడు మృత్యుంజయుడిగా నిలిచాడు. అవగాహన లేమితో ఆడుకుంటూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకాడు. అయితే స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. ఈఘటన ఆదివారం ఇందిరా కాలనీలో జరగగా స్పందించిన పంచాయతీ కార్యదర్శి మేడికొండ భారతి సిబ్బంది సహాయంతో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ముళ్ల కంచెను ఏర్పాటు చేశారు. స్థానికులతో మాట్లాడి చిన్న పిల్లల పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. అలాగే విద్యుత్ రూరల్ ఏఈ ఎల్ బ్రహ్మం కూడా స్పందించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి రక్షణ వలయం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అయితే ఈ ఘటన రెండు రోజులుగా ఆ ప్రాంతంలో హాట్ టాఫిక్‌గా నిలిచింది.

మట్టి కొల్లగొట్టి!



తిప్పబీడు భూమిలో ఎక్స్‌కవేటర్‌తో టిప్పర్‌లోకి నింపుతున్న మట్టి

- అనుమతులు లేకుండా ఇష్టారీతిన భారీ వాహనాల్లో తరలింపు
- అడ్డుకున్న తూర్పుగంగవరం గ్రామస్థులు
- చోద్యం చూస్తున్న అధికారులు

తాళ్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి):హైవే పనుల కోసం అడ్డగోలుగా గ్రావెల్ తవ్వకాలకు కొందరు తెగబడుతున్నారు. అనుమతులు లేకుండా ఇష్టారీతిన భారీ వాహనాలలో తరలిస్తున్నారు. యథేచ్ఛగా సాగుతున్న వ్యవహారాన్ని అధికారులు కూడా చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. మట్టి తవ్వకాలు మండలంలోని నాలుగు కొండలలో విచ్చలవిడిగా సాగుతుండగా సోమవారం తూర్పుగంగవరంలో మాత్రం ఉద్రిక్తతకు దారితీసింది. గ్రామ ఉమ్మడి తిప్ప బీడు భూమిలోని మట్టిని ఎలాంటి అనుమతులు లేకుండా భారీ వాహనాల్లో తరలిస్తున్నారు. ఈక్రమంలో సోమవారం తూర్పుగంగవరం గ్రామస్థులు అడ్డుకున్నారు. తిప్పబీడులో మట్టి తోలేందుకు ఉన్న యంత్రాలను ఆ భూమి నుంచి బయటకు పంపటంతో తాత్కాలికంగా తరలింపు నిలిచిపోయింది. మండలంలోని నాగంబొట్లపాలెం రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్ 299లోని తిప్పబీడు భూమి 190.50 ఎకరాలు (పశువుల మేత భూమి) తూర్పుగంగవరం గ్రామస్థుల ఉమ్మడి బీడుగా ఉంది. ఇది అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు పూర్వం గ్రామానికి చెందిన ఏడుగురు పెద్దల పేర్ల మీద పట్టాదారులుగా రెవెన్యూ రికార్డులో ఎఫ్ఎల్ఆర్ నమోదు చేశారు. ఆ భూమిలో అనాది నుంచి మూడు, నాలుగు గ్రామాలకు చెందిన పశువులు మేస్తూ ఉంటాయి.

హైవే నిర్మాణానికి మట్టి తరలింపు

అయితే, ముప్పవరం-బెంగళూరు హైవే నిర్మాణంలో భాగంగా పట్టాదారులకు చెందిన ఇద్దరితో సంప్రదించి ఉమ్మడి తిప్పబీడులోని గ్రావెల్‌ను తరలిస్తున్నారు. ఇది ఉమ్మడి బీడు భూమిగా ఉంది. కాగా పట్టా హక్కుదారులకు చెందిన కుటుంబ సభ్యులు, గ్రామస్థులతో సంప్రదించి, ప్రభుత్వానికి దరఖాస్తు పెట్టుకుని మైనింగ్ అనుమతి పొందాలి. ఆ తర్వాతే గ్రావెల్ తోలుకోవాలి. అయితే, ఉమ్మడి బీడుకు సంరక్షణగా ఉన్న పట్టాదారుల్లో కొందరు హైవే నిర్మాణ పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌తో లాలూచి పడి గ్రావెల్ తరలిస్తున్నారు. ఈ భూమిని సంరక్షించేందుకు ఏడుగురు పెద్దల పేర్ల మీద పట్టాలు ఉన్నా, వారిలో కొందరు చెప్పినట్లుగా గ్రావెల్ తరలిస్తుండటంతో గ్రామస్థులు అడ్డుకున్నారు. ఎటువంటి అనుమతి లేకుండానే ఇష్టారీతిగా గ్రావెల్‌ను తరలించడాన్ని ప్రశ్నించారు. సొంత అవసరాలకు, గృహాల వద్ద చదును కోసం గ్రావెల్ తరలిస్తే నానా హడావుడి చేసే మైనింగ్, పోలీస్, రెవెన్యూ అధికారులు భారీయంత్రాలతో, అధిక సంఖ్యలో టిప్పర్లలో సమీప రోడ్డుకు గ్రావెల్ తరలిస్తున్నా పట్టించుకోవడం లేదు.



మట్టి తవ్వకాలను అడ్డుకున్న తూర్పుగంగవరం గ్రామస్థులు

అనుమతులు లేకుండా

పూర్వం నుంచి ఉమ్మడి తిప్పబీడు(పశువుల మేతభూమి)లో నాగంబొట్లపాలెం, రామభద్రాపురం, సోమవరప్పాడు తూర్పుగంగవరం తదితర గ్రామాలకు చెందిన పశువులు, గొర్రెలు, మేకలు మేతకు వెళుతుంటాయి. ఈ బీడు నుంచి గ్రావెల్ తరలిస్తే భవిష్యత్తులో మేతకు ఇబ్బందిగా ఉంటుందని గ్రామస్థులు ఆందోళన చెంది పనులు అడ్డుకున్నారు. హైవే రోడ్డు నిర్మాణం పేరిట పనులు చేపడుతున్న కంపెనీ వారు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా గ్రావెల్‌ను తరలిస్తున్నారు. గ్రామస్థులు అనుమతి పత్రాలు చూపమన్నా చూపలేదు. దీంతో యంత్రాలను, టిప్పర్లను ఆ ప్రాంతం నుంచి బయటకు పంపివేశారు. హైవే రోడ్డు కాంట్రాక్టర్లతో ఒప్పందం కుదుర్చుకున్న వారు గ్రావెల్ తరలింపును అడ్డుకున్న వారిని ప్రశ్నించటంతో వాగ్వాదం చోటుచేసుకుంది. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి ఉమ్మడి బీడుగా ఉన్న పశువుల మేతభూమిలో అక్రమ మట్టి తవ్వకాలను నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా

మంత్రి రవికుమార్ పిలుపు

బల్లికురవ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకుంటే కార్యకర్తలకు భరోసా ఉంటుందని, ఏదైనా ప్రమాదాలు జరిగితే పార్టీ వారికి అండగా ఉంటుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. సోమవారం బల్లికురవ మండల పార్టీ కార్యాలయంలో అన్ని గ్రామాల టీడీపీ నేతలతో మంత్రి రవికుమార్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అవగాహన కల్పించి అత్యధికంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాలను చేపట్టాలన్నారు. కొన్ని గ్రామాలలో కార్యకర్తలే ముందుకు వచ్చి నమోదు చేసుకుంటున్నారన్నారు. డిసెంబర్ 2 వతేదీ నాటికి నమోదు పూర్తి కావాలని నాయకులకు సూచించారు. అద్దంకి నియోజకవర్గంలో టీడీపీ పార్టీకి ఉన్న ఆదరణ సభ్యత్వ నమోదు ద్వారా చేసి చూపించాలన్నారు. గ్రామాలలో పార్టీ బలోపేతానికి తీసుకోవల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో మండల పార్టీ నేతలు మలినేని గోవిందరావు, కొండేటి ఇజ్రాయల్, తేలప్రోలు రమేష్, గొట్టిపాటి లక్ష్మయ్య, ఆళ్ల చంద్రమౌళి, ముంద్రు దానయ్య పలు గ్రామాలకు చెందిన నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు

- మణికేశ్వరానికి పోటెత్తిన భక్తులు
- పలుచోట్ల అన్నదానాలు



మార్టూరులో ఘట్టేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



ప్రత్యేక అలంకరణలో చిదంబరేశ్వరస్వామి

అద్దంకి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో మణికేశ్వరానికి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి పూజలు నిర్వహించారు. గుండ్లకమ్మ నదిలో స్నానాలు చేసి కార్తీక దీపాలను వెలిగించారు. దేవస్థానానికి వచ్చిన భక్తులకు గొట్టిపాటి యూత్ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసా దాన్ని పంపిణీ చేశారు. ఈవో వాసుబాబు ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. టీడీ పీ నేతలు షేక్ కరిముల్లా ముత్తంశెట్టి ఆశోక్, మౌలాలి, అబ్దుల్లా, ఆదినారాయణ పాల్గొన్నారు.

చినగంజాం : కార్తీక మాస సోమవారాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళా భక్తులు కార్తీక దీపాలు వెలిగించి పరమ శివుని మది నిండా కొలిచారు. స్వామివార్లకు రుద్రాభిషేకాలు, వివిధ ద్రవ్యాలతో అభిషేకాలతో పాటు విశేష అలంకరణలు చేశారు. మండలంలోని చినగం జాం గంగా పార్వతీ సమేత చిదంబరేశ్వరస్వామి ఆల యం, కడవకుదురు గోకర్ణేశ్వరస్వామి ఆలయం, సోపిరాల లలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి ఆలయం, కొత్తపాలెం బాల కోటేశ్వరస్వామి ఆలయం, సంతరావూరు, గొనసపూడి, పెదగంజాం, నీలాయపాలెం తదితర గ్రామాల్లోని ఆలయాల్లోని త్రినేత్రుడుని భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రాలు, ఆలయాలు భక్తి పారవశ్యంతో ఉప్పొంగింది. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కార్తీక దీపారాధనలు చేశారు. ఆలయాలు కార్తీక దీపాల వెలుగులతో దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను వినియోగం చేశారు.

దగ్గుబాడు(పర్చూరు) : కార్తీక మాసం చివరి సోమవారం శివాలయాలు కిక్కిరిసాయి. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. కారంచేడు మండల పరిధిలోని దగ్గుబాడు శివాలయంలో పెద్ద ఎత్తున భక్తులు పూజలు చేశారు.

మార్టూరు : వేకువజామునే భక్తులతో శివాలయాలు కిటకిటలాడాయి. ముఖ్యంగా మహిళలు దేవస్థానం ఆవరణలో పెద్ద ఎత్తున దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా దేవస్థానంలో స్వామి వారితోపాటు, అమ్మ వారిని ప్రత్యేకంగా అలంకరించారు. జాతీయ రహదారి పక్కన ఉన్న దుర్గామల్లీశ్వరి దేవస్థానంలో దీపాలు వెలిగించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇంకొల్లు : ఘంటసాల స్మారక సమితి ఆధ్వర్యంలో కోటిదీపోత్సవం, సహస్ర లింగార్చన జరిగింది. వేదపండితులు సమితి అధ్యక్షుడు ఓరుగంటి సత్యనారాయణ ఆధ్వర్యంలో పూర్ణారామశాస్త్రి, వెంకటేశ్వరశాస్త్రి, షణ్ముఖ శర్మ, శివ, ప్రసాద్ అభిషేకాలు నిర్వహించారు. అనంతరం దీపోత్సవం చేసి అన్నదానం ఏర్పాటు చేశారు.



మాట్లాడుతున్న ఏపీసీఎన్ఎఫ్ డీపీఎం వాణిశ్రీ

ప్రకృతి సాగు పంటలతో ఆరోగ్యం

అద్దంకిటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి విధానంలో పంటలు సాగు చేసి ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని ఏపీసీఎన్ఎఫ్ డీపీఎం వాణిశ్రీ అన్నారు. సోమవారం అద్దంకిలోని వెలుగు కార్యాలయంలో ఫుడ్ బాస్కెట్ కార్యాచరణపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బహిరంగ మార్కెట్‌లో ఉన్న సరుకులు కల్తీగా ఉన్నాయని, ఆ సరుకులు వాడి హస్పిటల్‌కు లక్షల రూపాయలు ఖర్చుచేసి ఆర్థికంగా నష్టపోతున్నారని డాక్టర్ రాజ్‌గోపాల్ అన్నారు. ప్రకృతి సాగుకు అవసరమైన రుణాలను గ్రామ సంఘం నుంచి ఇస్తారని, వాటిని రెండు నెలల్లో తిరిగి చెల్లించాలని ఏపీఎం కోటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో సీసీలు, ఫుడ్ బాస్కెట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజా వేదిక

పంగులూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజా వేదికలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలకు సంబంధించిన సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని తహసీల్దార్ పీ సింగారావు తెలిపారు. రెవెన్యూ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా వేదికలో తహసీల్దార్‌కు 15 మంది పలు సమస్యలపై అర్జీలను అందజేశారు. తూర్పు కొప్పెరపాడులో సర్వేనెంబరు 125-1లో తన రెండెకరాల వ్యవసాయభూమికి హద్దులు చూపాలని కోరగా, గ్రామ సర్వేయర్ ఎస్సెన్సీ పంటకాలువలో భూమిని చూపిస్తున్నారని గ్రామానికి చెందిన కొర్రపాటి భూలక్ష్మి ఫిర్యాదు చేశారు. న్యాయం చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. డిజిటల్ సైన్‌తో పాటు విస్తీర్ణ వ్యత్యాసాలు, ఇతర సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా



ట్యాంకర్ నుంచి తాగునీటి పట్టుకుంటున్న వార్డువాసులు

చీరాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వాటర్ ట్యాంక్ మరమ్మతుల నేపథ్యంలో మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం కలిగింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఆదేశానుసారం సోమవారం 29 వార్డు నాయకులు నరాల తిరుపతిరాయుడు, పల్లా సుబ్బారావు తదితరుల చొరవతో ట్యాంకర్ల ద్వారా వార్డు ప్రజలకు తాగునీటిని సరఫరా చేశారు. దీంతో వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బత్తుల వెంకటరఘునందన్, అనంద్, అన్నం వెంకటేష్ పాల్గొన్నారు.

నేడు ప్రజాబంధు ప్రగడ కోటయ్య వర్ధంతి

చీరాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజాబంధు ప్రగడ కోటయ్య వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆయన విగ్రహం వద్ద సభను నిర్వహిస్తున్నట్లు ప్రగడ కోటయ్య యూత్ వలంటరీ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ గౌరవాధ్యక్షుడు, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు తదితరులు సోమవారం తెలిపారు. ముందుగా కోటయ్య విగ్రహానికి ఉదయం 9 గంటలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతర సభ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పాఠశాలకు ఫ్యాన్ బహూకరణ

పంగులూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోటపాడు గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి గోళ్లమూడి బాస్కరరావు ఫ్యాన్‌ను బహూకరించారు. పాఠశాల ప్రహరీ నిర్మాణం, వంటగది ఏర్పాటు, మెరకతోలే విషయంలో ఆయన సహకరించారని విద్యా కమిటీ మాజీ చైర్మన్ వెంకటరావు, హెచ్ఎం వడ్లమూడి వేణుబాబు అభినందించారు.

ఉసిరిచెట్టుకు స్టీల్ రెయిలింగ్ ఏర్పాటు



ఉసరిచెట్టుకు మొక్కుతున్న ఆలయ పూర్వ కమిటీ ప్రతినిధులు

వేటపాలెం(చీరాల), నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : రామన్నపేట పంచాయతీ పరిధిలోని నాగవరపమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఉసరి చెట్టుకు దాతల సహకారంతో స్టీల్ రెయిలింగ్‌ను ఏర్పాటు చేశారు. ఆ రెయిలింగ్‌ను సోమవారం ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెయిలింగ్ కోసం దాతలు పింజల పమేశ్వరరావు రూ.50వేలు, వేళ్ల వెంకట శివరామకృష్ణప్రసాద్ దంపతులు రూ.25వేలు, ఆమంచి వెంకటస్వామి దంపతులు రూ.7,500, పిచ్చుక మహాలక్ష్మయ్య దంపతులు రూ.5,000 మొత్తం రూ.82,500 వ్యయంతో ఆ రెయిలింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పోతిని శ్రీనివాసరావు, ఆలయ పూర్వ కమిటీ ప్రతిధులు ఏ.భానుమూర్తి, బండ్ల బాబు, దేవాంగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కూర్మా రాహుల్జీ, కార్యదర్శి యారాజు అరుణ బాబు, ఆలయ సిద్ధాంతి దోగుపర్తి కోటసుబ్బారావు, చల్లా విజయ్, నాసిక జగన్, గణపతి, రవీంద్రబాబు, శివకుమార్ పాల్గొన్నారు.

వివక్షలేని సమాజంతోనే ప్రగతి



పర్చూరులో మాట్లాడుతున్న సీడీపీవో సుభద్ర

పంగులూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వివక్ష లేని సమాజంతోనే ప్రగతి సాధ్యమని వెలుగు ఏపీఎం జ్యోతి ప్రసాద్ అన్నారు. జండర్ వాలోత్సవాలలో భాగంగా సోమవారం పంగులూరులో స్త్రీశక్తి భవన్ నుంచి వెలుగు అధికారులు, వీవోఏలు అవగాహన ర్యాలీని చేపట్టారు. సమాజంలో ఆడ, మగ బేధం లేకుండా పుట్టిన ప్రతి బిడ్డకూ సమాన అవకాశాలు కల్పించి వారి అభివృద్ధికి తల్లిదండ్రులు తోడ్పాటును అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీసీలు సాల్మన్, సురేష్, చంద్రశేఖర్, భాస్కరమ్మ, వీవోఏలు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ కార్యక్రమంపై గ్రామాల్లో ఎస్‌హెచ్‌జీ మహిళలకు అవగాహన కల్పించాలని ఏపీఎం కోటేశ్వరరావు అన్నారు. సోమవారం వెలు గు కార్యాలయం వద్ద జండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా గ్రూపు మహిళలతో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. లింగ వివక్ష, మహిళలు, పురుషుల మధ్య అసమానత్వం, మహిళలపై జరిగే లైంగిక దాడులకు వ్యతిరేకంగా ఈనెల 25 డిసెంబర్ 25 వరకు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

పర్చూరు : లింగ వివక్ష చట్టరీత్యా నేరమని ఆడ, మగ పిల్లలను సమానంగా చూడాలని ఐసీడీఎస్ సీడీపీవో సుభద్ర అన్నారు. లింగ ఆధారిత హింసకు వ్యతిరేకంగా సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వెలుగు కార్యాలయంలోని స్వయం సహాయక సంఘాల కార్యకర్తలకు బాల్య వివాహాల నియంత్రణ చట్టంపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు జరగకుండా గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. బాల్యవివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే తక్షణమే సమాచారం ఇచ్చే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ కొసనా సత్యనారాయణ, ఏపీఎం రామకృష్ణ, సిబ్బంది ప్రమీల, విజయ కుమార్, శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.



పడి పూజ నిర్వహిస్తున్న గురుస్వామి

వైభవంగా అయప్పస్వామి పడి పూజ

అద్దంకి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 19 వార్డు కౌన్సిలర్ ఏజెండ్ల నాగరాజు ఆధ్వర్యంలో సోమవారం రాత్రి అయప్ప స్వామి పడి పూజ కార్యక్రమం వైభవంగా జరిగింది. వాసు గురుస్వామి ఆధ్వర్యంలో అయప్పకు పడిపూజ, అభిషేకాలు నిర్వహించారు. అయప్ప, శివమాల, కనకదుర్గమ్మ, హనుమాన్ దీక్షధారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వెంకటేష్ బృందం భజన పాటలు భక్తులను ఆకట్టుకున్నాయి.

ఐకమత్యంగా ఉందాం

వేటపాలెం(చీరాల), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : అందరం ఐకమత్యంగా ఉందాం. పరస్పరం సహకరించుకుందామని పలువురు రెడ్డిసామాజికవర్గ ప్రతినిధులు పేర్కొన్నారు. రామన్నపేట పంచాయతీ పరిధిలోని కనకనాగవరమపమ్మ ఆలయ ప్రాంగణంలో జాగృతి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వనసమారాధన కార్యక్రమంలో రెడ్డి సంఘీయులు పాల్గొన్నారు. భవిష్యత్ కార్యాచరణపై చర్చించుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

హెచ్ఐవీ రోగులపై వివక్ష చూపొద్దు

మార్టూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : హెచ్ఐవీ రోగులను వివక్షతో చూడకుండా అండగా నిలవాలని డీఆర్డీఏ ఏపీఎం సురేంద్ర బాబు అన్నారు. సోమవారం మార్టూరులో హెల్ప్ స్వచ్ఛంద సంస్థ వారు స్వయంసహాయక గ్రూపులకు చెందిన వీవోలకు వారి కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు.



ప్రారంభమైన రోడ్డు పనులు

ఏలూరి చొరవతో రోడ్డుకు మరమ్మతులు

ఇంకొల్లు,నవంబరు 25,(ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చొరవతో మండల పరిధిలో అధ్వానంగా ఉన్న రహదారుల మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. ఇంకొల్లు నుంచి పంగులూరు గంగవరం రహదారికి మరమ్మతు పనులు గత రెండు రోజులుగా వేగవంతంగా జరుగుతున్నాయి. ఆరికట్లవారిపాలెం వైపు నుంచి పనులు సాగుతున్నాయి. ప్రయాణ ఇబ్బందులు గుర్తించి రోడ్డు మరమ్మతులకు ఆదేశించిన ఎమ్మెల్యే ఏలూరికి ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా సామూహిక సత్యవ్రతాలు

చీరాలటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వైకుంఠపురంలోని కోదండ రామాలయంలో సోమవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు వైభవంగా నిర్వహించారు. కార్తీకమాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని భక్తులు విశేషంగా పాల్గొన్నారు. అర్చక స్వాములు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. దంపతులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా కుంకుమార్చన, కలశ స్థాపన, గణపతి, నవగ్రహ పూజలు వైభవంగా జరిపారు. భక్తులు పాల్గొని స్వామి సేవలో తరించారు. కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వినియోగదారుల అభిరుచి మేరకు వస్త్ర ఉత్పత్తి

శిక్షణ కేంద్రం ప్రారంభంలో చేనేత అధికారులు



శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చేనేత కార్మికురాలు

చీరాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారులు అభిరుచి మేరకు వస్త్రాల ఉత్పత్తి జరగాలని, అప్పుడే డిమాండ్, గిట్టుబాటు ధరలు లభిస్తాయని విజయవాడ హ్యాండ్లూమ్ సర్వీస్ సెంటర్ అసిస్టెంట్ డైరెక్టర్ జ్ఞానశేఖర్ అన్నారు. మండల పరిధిలోని ఈపురుపాలెంలో సోమవారం వెస్ట్ బ్లాక్ లెవల్ హ్యాండ్లూమ్ క్లస్టర్ ట్రైనింగ్ సెంటర్‌ను శిక్షణ పొందేందుకు వచ్చిన చేనేత కార్మికురాలితో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ చేనేత కార్మికులు జాంధాని, జాకార్డు, కుప్పటం, మంగళగిరి, పట్టు రకాలలో శిక్షణ పొంది, ఆ రకాలను నేస్తే గిరాకీ ఉంటుందని సూచించారు. సెంటర్‌లో శిక్షణకు వచ్చిన వారికి 45 రోజులు శిక్షణ, రోజుకు ఒక్కొక్కరికి రూ.300 చొప్పున స్టయిఫండ్ చెల్లిస్తారని తెలిపారు. కార్యక్రమంలో హ్యాండ్లూమ్ అధికారి నాగమల్లేశ్వరరావు, జడ్పీటీసీ, మాజీ సభ్యుడు జీ చంద్రమౌళి, గుర్రం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్, రిటైల్ ట్రేడ్‌పై విద్యార్థులకు అవగాహన

చినగంజాం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు వృత్తి విద్యా కోర్సులు చేయడం వలన ఉద్యోగ అవకాశాలు వస్తాయని, ఎస్ఎస్‌సీ బోర్డు ద్వారా పబ్లిక్ పరీక్ష కూడా ఉంటుందని పాఠశాల హెచ్ఎం ఎం.దేవదత్తం అన్నారు. పెదగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 9, 10 తరగతుల విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సులలో భాగంగా రిటైల్ ట్రేడ్, ఇండిస్ట్రియల్‌పై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వృత్తి విద్యా కోర్సుకు ఎంపికైన మొదటి బృందం విద్యార్థులు రిటైల్ ట్రేడ్‌పై అవగాహన కోసం సోపిరాల గేటు సెంటర్‌లోని ఎస్.మార్ట్‌ను సందర్శించారు. ఎస్.మార్టులో అమ్మకాలు, కస్టమర్ల సర్వీసు గురించి వృత్తి విద్యా కోర్సుల ఉపాధ్యాయుడు కోడూరి సుబ్రహ్మణ్యం, మోటుపల్లి రవిదేవరాజు విద్యార్థులకు అవగాహన కల్పించారు. వృత్తి విద్యా కోర్సులో భాగంగా రెండవ బృందం విద్యార్థులు ఉప్పుగుండూరు యూనియన్ బ్యాంక్‌ను సందర్శించారు. బ్యాంకింగ్ ఫైనాన్సియల్ సర్వీసు, ఇన్సూరెన్స్‌పై బ్యాంక్ మేనేజర్ ఎం.ప్రవీణ్‌కుమార్ బ్యాంక్ ఫారాలు, సర్వీసులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వృత్తి విద్యా కోర్సులకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల హెచ్ఎం దేవదత్తం, ఉపాధ్యాయులు డి.నారాయణరెడ్డి, బి.నాగేశ్వరావు, ఏ.వీరాచారి, బి.చెంచురెడ్డి, పీడీ ఎం.అనిల్‌కుమార్, విద్యా కమిటీ చైర్మన్ ఎ.సుదర్శనరెడ్డి, రికార్డు అసిస్టెంట్ కుమార్‌లు అభినందించారు.



క్వారీలో పనులను పరిశీలిస్తున్న చక్రబోర్తి

గనుల వద్ద అప్రమత్తం

డీడీఎంఎస్ అధికారి చక్రబోర్తి

బల్లికురవ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గ్రానైట్ గనులలో పనుల వద్ద కార్మికులు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ రీజియన్ 2 డైరెక్టర్ అఫ్ మైన్స్ సేఫ్టీ (డీడీఎంఎస్) సుప్రియో చక్రబోర్తి అన్నారు. సోమవారం వీర్ల కొండ వద్ద గల గిరిరాజ్ గ్రానైట్ క్వారీని డీడీఎంస్ అధికారులు తనిఖీ చేశారు. ఈసందర్భంగా క్వారీలో చేపడుతున్న పనులను పరిశీలించారు. భద్రతా పరంగా తీసుకుంటున్న చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం ఆయన క్వారీ లో పనిచేస్తున్న కార్మికులు, సిబ్బందితో మాట్లాడుతూ గనులలో ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తగా ఉండాలన్నారు. పనుల వద్ద ఫస్టు క్లాసు మేనేజర్ అందుబాటులో ఉండాలన్నారు. బ్లాస్టింగ్ సమయంలో నలువైపులా ఉన్న క్వారీలకు సమాచారం అందించాలన్నారు. క్వారీలలో పొల్యూషన్ రా కుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ తనిఖీలో వీటీసీ బాధ్యులు సుభాస్కర్‌రెడ్డి, క్వారీ యజమానులు రావిపూడి లక్ష్మీనారాయణ, పత్తిపాటి సురేష్, మాల పాటి పోతురాజు పాల్గొన్నారు.

మోటార్ సైక్లిస్టుకు గాయాలు

అద్దంకి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోపాలపురంలో అసంపూర్తిగా ఉన్న నామ్ రోడ్డులోని గోతులలో పడి మోటార్ సైక్లిస్టుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలివి.. బల్లికురవ మండలం వి.కొప్పెరపాడుకు చెందిన షేక్ అబీబ్ మరో వ్యక్తితో కలిసి మోటార్ సైకిల్‌పై అద్దంకి నుంచి స్వగ్రామానికి వెళుతుండగా గోపాలపురం వద్ద అసంపూర్తిగా ఉన్న నామ్‌రోడ్డుపై గోతులలో బైకు అదుపు తప్పి పడిపోయారు. దీంతో అబీబ్‌కు తీవ్రగాయాలు కావడంతో 108లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

విద్యార్థులకు ఆట వస్తువుల పంపిణీ

పర్చూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) :పర్చూరు మండలం నాగులపాలెం బీఆర్.అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలోని విద్యార్థినులకు రోటరీక్లబ్ అధ్యక్షులు తోకల కృష్ణ మోహన్ ఆర్థిక సహకారంతో సమకూర్చిన ఆట వస్తువులను సోమవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యతోపాటు ఆటల్లో కూడా రాణించాలని కోరారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ విశ్వరాణి, క్లబ్ కార్యదర్శి కోమటి అంజనేయులు, సభ్యులు కొల్లా సుబ్బారావు, పోలిశెట్టి చంద్రం, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

కోనంకిలో మళ్లీ చర్చి వివాదం

మార్టూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోనంకి ఎస్సీ కాలనీలో తెలుగు బాపిస్టు చర్చి వివాదం మళ్లీ సోమవారం రాత్రి రాజుకున్నది. ఈ చర్చిలో పాస్టర్ నియామకంపై రెండు గ్రూపుల మధ్య కొంతకాలంగా వివాదం నడుస్తుండగా ఏడాదికి పైగా చర్చిని మూసివేశారు. గత రెండు నెలలు కిందట కాలనీలోని పెద్దలు, గ్రామ పెద్దలు సమన్వయంతో మరల చర్చి తలుపులను తెరవడంతో చర్చిలో ప్రార్థనలు జరుగుతున్నాయి. సోమవారం రాత్రి ఒక గ్రూపు వారు రెండో గ్రూపు వారితో కోర్టులో తమ పేర్లు ఎందుకు ఫిర్యాదు చేశారనే విషయంపై వివాదం రాజుకుంది. విషయం తెలుసుకున్న సీఐ ఎం.శేషగిరిరావు, ఎస్ఐ సైదా రెండు గ్రూపుల వారిని సమన్వయం చేయడంతో సమస్య తాత్కాలికంగా సద్దుమణిగింది.

ఆరుగురు జూదరుల అరెస్టు

పర్చూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండల పరిధిలోని ఏదుబాడులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై సోమవారం ఎస్సై మాల్యాద్రి ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టుచేసి, రూ.7200 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తామన్నారు.

గుప్త నిధుల కోసమా?

గోపాలపురంలో క్షుద్రపూజల కలకలం



పూజ సామగ్రి, పూజ చేస్తున్న వ్యక్తి

అద్దంకి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : అపరిచిత వ్యక్తులు శింగరకొండ దిగువ భాగంలో నామ్ రోడ్డు వెంబడి అర్ధ రాత్రి సమయంలో పూజలు నిర్వహించడం కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. అద్దంకి మండలంలోని గోపాలపురం సమీపంలో శింగరకొండ దిగువన రాజమండ్రి, నంద్యాల తదితర ప్రాంతాలకు చెందిన కొత్త వ్యక్తులు ఆదివారం రాత్రి పూజలు చేశారు. విషయం తెలుసుకున్న గోపాలపురం గ్రామస్థులు అక్కడకి వెళ్లి ప్రశ్నించేందుకు ప్రయత్నించగా వారిపై వారు రాళ్లదాడికి ప్రయత్నించారు. దీంతో మరి కొంత మంది గ్రామస్థులను కలుపుకొని మూకుమ్మడిగా వెళ్లగా నలుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. మరో ఇద్దరు పరారయ్యారు. దొరికిన వ్యక్తులను గ్రామస్థులు ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలు చెప్పడంతో అనుమానానికి తావిస్తుంది. గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చి ఆ నలుగురినీ అప్పగించినట్లు సమాచారం. పోలీసుల విచారణలో అసలు విషయం తెలియాల్సి ఉంది. శింగరకొండ మీద గుప్త నిధులు ఉండి ఉంటాయన్న అనుమానంతో పూజలు నిర్వహించి ఉంటారని అనుమానాలు వ్యక్తం అవుతుండగా, మరి కొందరు మాత్రం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ప్రోద్బలంతో క్షుద్రపూజలు జరిగినట్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన్నట్లు సీఐ కృష్ణయ్య తెలిపారు.

పాత నేరస్థుల బైండోవర్

చీరాలటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సోమవారం ఏడుగురు పాత నేరస్థులను ఎక్సైజ్ పోలీసులు చీరాల తహసీల్దార్ గోపీకృష్ణ వద్ద బైండోవర్లు చేశారు. ఈసందర్భంగా అధికారులు వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. నేరాలను వీడి మానవ మనుగడలో సంతోషంగా జీవించాలని సూచించారు. పునరావృతమైతే కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

రికార్డులను విధిగా నిర్వహించాలి



రికార్డులు పరిశీలిస్తున్న వెంకటేశ్వర్లు

చీరాలటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కార్యాలయ పరిధిలోని రికార్డులను విధిగా నిర్వహించాలని అసిస్టెంట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరిండెంట్ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం చీరాల ఎక్సైజ్ కా ర్యాలయాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా రికార్డుల ను పరిశీలించి పలు సూచనలు చేశారు. పాత బకాయిలు, ఆఫ్ టేక్ మద్యం నిల్వలపై ఆరా తీశారు. కేసులకు సంబంధించి పూర్వాపరాలపై రివ్యూ నిర్వహించారు. సిబ్బందికి పలు సూచనలు సలహాలు అందించారు. కార్యక్రమంలో సీఐ నాగేశ్వరరావు, ఎస్సై శ్రీహరి స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

శనగ రైతు దిగాలు

ఇంకొల్లు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గత ఏడాది శనగపంట సాగు చేసి శీతల గిడ్డంగులలో నిల్వ చేసుకున్న రైతులు దిగాలు చెందుతున్నారు. రోజుల కిందట జేజీ11 రకం శనగలు క్వింటా రూ.7300 పలకింది. ఆ సమయంలో నిల్వలు ఉంచుకున్న రైతులు రూ.8వేలకు చేరుకుంటుందని ఆశతో అమ్మలేదు. ప్రస్తుతం శనగ చేతికందిన సమయంలో ఉన్న ధర దిగొచ్చి రూ.6400 పలుకుతోంది. కాక్-2 రకం శనగలు నెల కిందట క్వింటా రూ.10,500 పలకగా ప్రస్తుతం రూ.2వేలు తగ్గి క్వింటా రూ8,500 ఉంది.



సైదాపురం : సిద్ధలకోనలో పూజలందుకున్న సత్యనారాయణ స్వామి ఉత్సవ మూర్తులు

హరహర.. మహాదేవ!

- మార్మోగిన శైవక్షేత్రాలు
- ఘనంగా నాలుగో కార్తీక సోమవారం పూజలు
- పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులు



నెల్లూరు (సాంస్కృతికం) నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని శైవక్షేత్రాలు కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా భక్తులతో పోటెత్తాయి. హరహర.. మహదేవ.. శంభో శంకర.. ఓం నమశ్శివాయః.. తదితర నామస్మరణలతో శివాలయాలు మారుమోగిపోయాయి. పాలభిషేకం కోసం సూర్యోదయానికి ముందే శివాలయాలకు భక్తులు బారులు తీరారు. అలాగే సముద్ర స్నానాల కోసం రామతీర్థం, ఇస్కపల్లి, కాటేపల్లి, కోడూరు, మైపాడు బీచ్‌లకు భారీ సంఖ్యలో భక్తులు తరలివెళ్లారు. సముద్రస్నానాలు చేసి, ఉపవాస దీక్షలు చేపట్టారు. సమీప శివాలయాల్లో పాలభిషేకాల్లో పాల్గొన్నారు ఈ సందర్భంగా శివాలయాల్లో అన్నాభిషేకాలు, ప్రాకారోత్సవాలు, కార్తీక దీపాల అలంకరణలు, ఉత్సవాలు నిర్వహించారు. కార్తీక దీపాలతో ఆలయాలన్నీ కళకళలాడాయి.

● వెండినందిపై కామాక్షితాయి

బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ ఆలయంలో సోమవారం రాత్రి మల్లికార్జునస్వామి, కామాక్షి తాయి అమ్మవార్లు చిన్న వెండి నంది వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. శాశ్వత ఉభయకర్తలుగా దొడ్ల జానకమ్మ మల్లికార్జునస్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి శ్రీచక్ర నవావరణ పూజలు నిర్వహింపచేశారు. ఆలయంలో భక్తులు శివలింగాకృతిలో కార్తీక దీపాలు వెలిగించారు.

● సైదాపురం మండలంలోని శ్రీసిద్దేశ్వరకోనలో నాలుగో కార్తీక సోమవారం తిరునాళ్ల నిర్వహించారు. ఈ సందర్భంగా నవకోటి సిద్దేశ్వర, నవనాథ సిద్దేశ్వర, శిష్యుడు సారంగధర స్వాములకు దేవరులు విశేష పూజలు నిర్వహించారు. 108 జంటలతో అన్నవరం సత్యనారాయణ స్వామి వ్రతం, అనంతరం కల్యాణం నిర్వహించారు.

● సీతారామపురం మండలంలోని శైవక్షేత్రలైన ఘటిక సిద్దేశ్వరం, భైరవకోన, సీతారామపురం శివాలయంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కార్తీక సోమవారం పూజలు నిర్వహించారు. భైరవకోన జలపాతంలో స్నానాలు చేసి దీపాలు వెలిగించారు.



బుచ్చి : జొన్నవాడలో చిన్న వెండి నంది వాహనంపై మల్లికార్జునస్వామి, కామాక్షితాయి



భైరవకోనలోని జలపాతం వద్ద కార్తీక స్నానాలు చేస్తున్న భక్తులు



నెల్లూరు : మూలస్థానేశ్వరాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

- ఇటీవల జరిగిన గ్రామసభల్లో భూసమస్యలపై భారీగా అర్జీలు
- రాష్ట్రంలోనే అత్యధికంగా 8,406 ఫిర్యాదులు
- వీటి పరిష్కారంలో మాత్రం అట్టడుగున జిల్లా
- ఇప్పటికి పరిష్కరించింది 173, ఆన్‌లైన్ చేసినవి 3,058
- అధ్వానంగా రెవెన్యూశాఖ పనితీరు

కలెక్టర్ హెచ్చరించినా మారని అధికారుల ధోరణి

పరిష్కారమెప్పుడు?

నెల్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఏదైనా ఓ సమస్యను సులువుగా సృష్టించగలిగిన రెవెన్యూ అధికారులు.. ఆ సమస్యను పరిష్కరించడంలో మాత్రం చాలా కష్టపడుతున్నారు. గత ప్రభుత్వంలో అసలు పని వదిలి వైసీపీ నేతల సేవలో తరించిన రెవెన్యూ సిబ్బంది.. తద్వారా భూసమస్యలు పెరిగిపోవడానికి కారణమయ్యారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆ భూసమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. ఈ క్రమంలోనే ఇటీవల గ్రామసభలు నిర్వహించింది. ఈ సభల్లో ఊహకందని విధంగా రాష్ట్రంలోనే అత్యధికంగా అర్జీలు జిల్లాలో అందాయి. అయితే ఈ సమస్యల పరిష్కారం మాత్రం నత్తనడకన సాగుతోంది. ఈ సభలు ముగిసి పది రోజులు గడిచినా, ఇంతవరకు చాలా అర్జీలను ఆన్‌లైన్ చేయలేదంటే రెవెన్యూ శాఖ పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వం మారినా రెవెన్యూ శాఖ పనితీరులో మాత్రం మార్పు రావడం లేదు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పలువురు తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బందికి నోటీసులు జారీ చేస్తున్నప్పటికీ ఇంకా వారిలో మార్పు కనిపించడం లేదు.

● లెక్కకు మించి వినతులు

అక్టోబరు 19 నుంచి ఈనెల 14వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించగా మొత్తం 8406 అర్జీలు వచ్చాయి. ఇవన్నీ భూసమస్యలే కాగా, అందులో సర్వే విభాగానికి చెందినవి 3486 అర్జీలు ఉన్నాయి. వీటిలో ఇప్పటి వరకు 3058 అర్జీలను ప్రజా విజ్ఞప్తుల వేదిక(పీజీఆర్ఎస్)లో నమోదు చేశారు. ఇంకా సగానికిపైగా అర్జీలను అన్‌లైన్ చేయాల్సి ఉంది. అయితే, ఇప్పటి వరకు పరిష్కరించిన అర్జీల సంఖ్యను చూస్తే ముక్కున వేలేసుకోవాల్సిందే..! గత 19 నుంచి అర్జీలు వస్తుండగా ఇప్పటి వరకు కేవలం 173 మాత్రమే పరిష్కరించినట్లు సర్వే విభాగం లెక్కలు చెబుతున్నాయి. దీన్నిబట్టి రెవెన్యూ శాఖ పనితీరు ఏ విధంగా ఉందో స్పష్టమవుతోంది. రాష్ట్రంలోనే అత్యధిక అర్జీలు వచ్చింది నెల్లూరు జిల్లాలో కాగా, పరిష్కారంలో అట్టడుగున స్థానంలో ఉన్నది కూడా నెల్లూరు జిల్లానే కావడం గమనార్హం.



సర్వేఅధికారి నాగ శేఖర్‌కు వినతి ఇస్తున్న కాగితాలపూరు రైతులు (ఫైల్)

గ్రామసభల్లో వచ్చిన మొత్తం అర్జీలు	8,406
భూసర్వేకు సంబంధించిన సమస్యలు	3,486
ఇతర భూసమస్యలపై..	4,920
ఇప్పటి వరకు ఆన్‌లైన్ చేసినవి	3,058
ఇప్పటి వరకు పరిష్కరించినవి	173

● తప్పించుకునే యత్నం

జిల్లాను ఇప్పుడు భూసమస్యలు అతలాకుతలం చేస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో భూ ఆక్రమణలు, భూ రికార్డుల మార్పులు ఎక్కువగా జరిగాయి. ఆ ఐదేళ్లలో తహసీల్దార్ స్థాయి నుంచి వీఆర్వో స్థాయి వరకు వంద మందికిపైగా సిబ్బంది సస్పెండ్ అయ్యారంటే నాడు ఏ విధంగా రెవెన్యూ శాఖ పనితీరు ఉందో అర్థం చేసుకోవచ్చు. రీసర్వే పుణ్యమా అంటూ కొత్త సమస్యలు కూడా వచ్చి పడ్డాయి. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌లో సగానికి పైగా భూ సమస్యలే ఉంటుండడం గమనార్హం. అయితే ఈ భూసమస్యలను పరిష్కరించడంలో - మిగతా 6లో..

వచ్చే నీళ్లతో వరి పండేనా?

- సోమశిల నుంచి రాళ్లపాడుకు రావాల్సింది 150 క్యూసెక్కులు
- వస్తున్నది 50 క్యూసెక్కులే..

● ఇలాగయితే ఆయకట్టులో సాగు ఎలా...? ● నీటి విడుదల పెంచాలంటున్న రైతులు

లింగసముద్రం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టులో ప్రస్తుతం ఉన్న నీటితోపాటు, సోమశిల ప్రాజెక్టు నుంచి వచ్చే 1.50 టీఎంసీల నీటితో వరిపైరు పండుతుందని ఆయకట్టు రైతులు ఆశించారు. అయితే సోమశిల నుంచి గొట్టిపాటి కొండపనాయుడు(జీకేఎన్) ఉత్తర కాలువ ద్వారా అరకొరగా నీరు వస్తున్నది. దీంతో ఆయకట్టు రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాగైతే ప్రాజెక్టులోని నీరు ఆయకట్టుకు సరిపోదని రైతులు చెబుతున్నారు.ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో నాలుగైదేళ్ల నుంచి వరి సాగు లేదు. ఈ ఏడాది ఎలాగైనా వరి పండించాలని, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కూడా ఉత్తర కాలువను వెడల్పు చేసి 1.50 టీఎంసీల నీటిని ఇవ్వాలని ఇటీవల అసెంబ్లీలో కోరారు. అంతేకాక గతనెలలో జిర్రావారిపాలెం వద్ద కూడా నీరు సరిగా రాకపోవడంతో ఇంటూరి సొంత నిధులతో కల్వర్టు నిర్మాణం చేయించారు. కానీ ప్రస్తుతం సోమశిల నుంచి రాళ్లపాడుకు కేవలం 50 క్యూసెక్కుల నీరు వస్తున్నట్టు అధికారు లు తెలి పారు.

● రాజోలు నుంచి ఉత్తర కాలువకు 200 క్యూసెక్కుల నీరు

సోమశిల ప్రాజెక్టు నుంచి 700 క్యూసెక్కుల నీరు విడుదల అవుతున్నా 67వ కిలోమీటరు వద్ద ఉన్న ఏఎస్‌పేట మండలం రాజోలు చెరువుకు కేవలం 220 కూసెక్కులకు మించి నీరు రావడం రాలేదు. అక్కడి నుంచి శ్రీకొలను, రాళ్లపాడు వైపు 180 నుంచి 200 క్యూసెక్కుల నీరు వస్తున్నట్టు అధికారులు తెలిపారు. రాజోలు చెరువు దిగువన ఉన్న శ్రీకొలను, మఱ్ఱిగుంట చెరువు వరకు ఉన్న వివిధ ఆయకట్టు భూములకు 150 క్యూసెక్కుల నీరు పోతుండడంతో రాళ్లపాడుకు కేవలం 50 క్యూసెక్కుల నీరు మాత్రమే వస్తోంది. అయితే రాజోలు చెరువుకు 300 కూసెక్కుల నీరు వచ్చి, 280 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలైతే అక్కడి నుంచి శ్రీకొలను ఇతర ఆయకట్టుకు 180 క్యూసెక్కుల నీరు పోయినా, రాళ్లపాడుకు వంద క్యూసెక్కుల నీరు వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.అధికారులు ఈ దిశగా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

● డైవర్షన్ నిర్మించాలి

సోమశిల నుంచి వచ్చే నీరు మఱ్ఱిగుంట చెరువులోకి వెళ్లకుండా డైవర్షన్ నిర్మించి, అక్కడి నుంచి నేరుగా మఱ్ఱిగుంట చెక్‌డ్యామ్ నుంచి రాళ్లపాడుకు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. సోమశిల నీరు రాజోలు చెరువుకు వెళ్లకుండా ప్రస్తుతం ఆ చెరువు వద్ద డైవర్షన్ పనులు జరుగుతున్నాయని, ఉత్తర కాలువ వెడల్పు పనులు కూడా సాగుతున్నాయని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.ఈ ప్యాకేజీలో మఱ్ఱిగుంట చెరువు డైవర్షన్ పనులు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



సోమశిల ఉత్తర కాలువ (ఉప్పుటేరు) నుంచి అరకొరగా మఱ్ఱిగుంట చెరువుకు వస్తున్న నీరు

ఎంఎస్‌ఎంఈ పార్కు ఏర్పాటుకు యత్నాలు

● ఆమంచర్లలో వివాదాస్పద భూమి పరిశీలన ● త్వరలో కలెక్టర్‌కి నివేదిక : ఆర్డీవో

నెల్లూరు (వెంకటేశ్వరపురం), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ మండలం ఆమంచర్ల ప్రాంతంలోని వివాదాస్పద భూమిని సోమవారం నెల్లూరు ఆర్డీవో అనూష ఆధ్వర్యంలో అటవీ, (ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్) ఏపీఐఐసీ అధికారుల బృందం పరిశీలించారు. జిల్లాలో మైక్రో స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజెస్(ఎంఎస్‌ఎంఈ) పార్కు ఏర్పాటు కోసం ఏపీఐఐసీ దాదాపు రూ.55 కోట్లు చెల్లించి, 550 ఎకరాల భూమిని 2016లో రెవెన్యూశాఖ నుంచి కొనుగోలు చేసింది. పార్కుకు శంకుస్థాపన చేసేందుకు ప్రయత్నించే సమయంలో అటవీశాఖ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. రెవెన్యూకి కేటాయించిన భూమి రిజర్వుఫారెస్ట్ పరిధిలో ఉందని, ఇందులో పార్కు ఏర్పాటు చేయరాదని తేల్చి చెప్పారు. అయితే, గత వైసీపీ ప్రభుత్వం ఈ సమస్యపై ఎలాంటి చర్యలు చేపట్టలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో ఆమంచర్లలోని ఎంఎస్‌ఎంఈ భూమి వివాదాన్ని పరిష్కారించే దిశగా అధికారులు చర్యలు ప్రారంభించారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ ఆనంద్ ఆదేశాలతో నెల్లూరు ఆర్డీవో అనూష ఆధ్వర్యంలో అటవీశాఖ, ఏపీఐఐసీ అధికారులు సోమవారం ఉదయం ఆమంచర్లలోని వివాదాస్పద భూమిని పరిశీలించారు. అటవీశాఖ మ్యాప్‌లను పరిశీలించారు. రెవెన్యూశాఖ రికార్డులను పరిశీలించి పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని ఆర్డీవో తెలిపారు. ఆర్డీవో వెంట ఏపీఐఐసీ జెడ్ఎం వీరశేఖరరెడ్డి, డీజెడ్ఎం వెంకటసురేష్, నెల్లూరు ఫారెస్ట్ రేంజర్ మాల్యాద్రి, రెవెన్యూ అధికారులు ఉన్నారు.



ఎంఎస్ఎంఈ పార్క్ స్థలం మ్యాపును పరిశీలిస్తున్న ఆర్డీవో అనూష, ఫారెస్ట్, ఏపీఐఐసీ అధికారులు



కానరాని క్లోరినేషన్

- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- గ్రామాల్లో శుభ్రతలేని తాగునీటి ట్యాంకులు
- బోర్డులు తప్ప రాతలు ఏవీ ?

6

వరినాట్లు నిలిపివేయాలి

అల్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వాతావరణ శాఖ సూచన మేరకు మంగళవారం నుంచి ఈనెల 28వ తేదీ వరకు జిల్లాకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు వరినాట్లు వేయరాదని మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు సోమవారం ఓ ప్రటనలో తెలిపారు. వారం రోజుల నుంచి వరినాట్లు ముమ్మరంగా జరుగుతున్న నేపథ్యంలో జిల్లాకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నాయని పేర్కొన్నారు. కలెక్టరు ఆదేశాలతో రైతులు తమ పొలాల వద్ద ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.

గృహ నిర్మాణాలకు దరఖాస్తు చేసుకోండి

కందుకూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సహకారంతో సొంత ఇంటి నిర్మాణానికి అర్హులైన నిరుపేదలంతా పీఎంఏవై స్కీం ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం (నేడు) మీ పరిధిలోని గ్రామ సచివాలయంలో ఆన్‌లైన్ ద్వారా గృహ మంజూరుకు దరఖాస్తు చేసుకుని సంబంధిత డాక్యుమెంట్లు అందజేయాలని ఆయన తెలిపారు.

వైరల్ ఫీవర్... ఫీవర్

- ఎక్కడ చూసినా జ్వరపీడితులే..
- పెరుగుతున్న అస్తమా, నిమోనియా, బ్రాంకైటిస్ వ్యాధులు
- వాతావరణ మార్పులతోనే అనారోగ్యాలు
- తస్మాత్ జాగ్రత్త అంటున్న వైద్యులు

నెల్లూరు (వైద్యం) నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం జిల్లాలో చోటుచేసుకున్న వాతావరణ మార్పులతో వైరల్ ఫీవర్, డెంగ్యూ జ్వరం, అస్తమా, నియోనియా, బ్రాంకైటిస్ తదితర వ్యాధులు ప్రబలుతున్నాయి. ఇప్పటికే పలువురు వ్యాధిగ్రస్థులు వివిధ ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు. ఈ వ్యాధులపై ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాంతకంగా మారే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిసి, చలితీవ్రత పెరుగుతోంది. దీనికితోడు వ్యాధుల సీజన్ కావటంతో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. ఎక్కడ చూసినా డెంగ్యూ కేసులు నమోదు అవుతుండడంతో బాధితులు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు.

● వేలల్లో జ్వరపీడితులు

జిల్లాలో 20వేలకుపైగా జ్వరపీడితులు నమోదయ్యారని వైద్య ఆరోగ్యశాఖ గణాంకాలు చెబుతున్నాయి. అయితే ఇందుకు ఆరురెట్లు అధికంగా జ్వరాల కేసులు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ప్రైవేట్ ఆసుపత్రులకు వచ్చే వ్యాధిగ్రస్థుల్లో ప్రస్తుతం జ్వరాల కేసులే 40 శాతం ఉంటున్నాయంటే జ్వరాల నమోదు ఎలా ఉందో తెలుస్తుంది. స్థానికంగా ఉన్న గ్రామీణ వైద్యులను ప్రతిరోజూ పదుల సంఖ్యలో జ్వరపీడితులు కలుస్తూ చికిత్స చేయించు కుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 52 పీహెచ్‌సీలు ఉండగా గత వారం రోజుల్లో ఆయా పీహెచ్‌సీల పరిధిలో 100 మందికిపైగా జ్వరాల బాధితులు నమోదయ్యారని వైద్యాధికారులు చెబుతున్నారు. ఇక ఏరియా, జిల్లా ఆసుపత్రులతోపాటు, నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి రోజూ వేలకు మందికిపైగా వివిధ రకాల రోగులు వస్తుండగా, ఇందులో జ్వరపీడితులు ఎక్కువగానే ఉన్నారు. ఇక జిల్లాలో రెండు వేలకుపైగా ప్రైవేట్ ఆసుపత్రులు ఉండగా ఇక్కడకు వచ్చే - మిగతా 6లో..



జీజీహెచ్‌లో ఓపీ కోసం క్యూలో ఉన్న బాధితులు

● కావలి రూరల్ మండలానికి చెందిన సుగుణమ్మ వాతావరణ మార్పుల కారణంగా తీవ్రంగా అస్తమాకు గురైంది. ఊపిరి ఆడక ఇటీవల నెల్లూరులోని వైద్య నిపుణులను సంప్రదించారు. వారు పూర్తిస్థాయి పరీక్షలు నిర్వహించి అస్తమా ఎక్కువగా ఉందని, నాలుగు రోజులు ఆసుపత్రిలో ఇన్‌పేషెంట్‌గా చేర్చుకుని వైద్యచికిత్సలు అందించారు. వ్యాధి తీవ్రత తగ్గాక డిశ్చార్జ్ చేశారు. ప్రస్తుతం బాధితురాలు కొంత వరకు కోలుకుంది. వైద్యుడు రాసిన మందులతోపాటు పీల్చే మందులు కూడా వాడుతోంది.

● ఇందుకూరుపేటకి చెందిన వెంకట్రామయ్య తీవ్ర అనారోగ్యంతో స్థానిక ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్నా జ్వరం తగ్గుముఖం పట్టలేదు. ఇక లాభంలేదని నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, అతడికి డెంగ్యూ లక్షణాలు ఉన్నట్లు నిర్ధారణ అయింది. ప్లేట్లేట్లు 10వేలకు పడిపోవటంతో బాధితుడిని కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం చెన్నైకి తరలిగించారు. ప్రస్తుతం బాధితుడు కోలుకుంటున్నారు.



భైరవకోనకు పోటెత్తిన భక్తులు

కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా మండలంలోని శైవ క్షేత్రాలైన ఘటిక సిద్దేశ్వరం, భైరవకోన, సీతారామపురంలోని శివాలయాలకు అధిక సంఖ్యలో భక్తులు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు కార్తీక దీపాలు వెలిగించి పరమశివుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు శివునికి ప్రత్యేక రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకం, బిల్వార్చనలు చేశారు. భక్తులు స్వామివారికి ఇష్టమైన బిల్వపత్రాలు, నాగలింగ పుష్పాలతో పూజలో పాల్గొన్నారు.

- సీతారామపురం (ఆంధ్రజ్యోతి)

కఠిన చట్టాలతో అత్యాచారాలు అరికట్టాలి



సమాజంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అత్యాచారాల నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం కఠినమైన చట్టాలు తీసుకురావాలని రాపూరులో సోమవారం గ్రామీణ నిర్మూలన సంస్థ వెలుగు ఆద్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సంఘమిత్రలతో వెలుగు ఏపీఎం రాధమ్మ ప్రతిజ్ఞ చేయించారు. ఆమె మాట్లాడుతూ సమాజంలో బాల్య వివాహాలను అరికడతామని, బాల్య, బలవంతపు వివాహాలు, గృహహింసను వ్యతిరేకిస్తామని తెలిపారు. ర్యాలీలో పొదుపు సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

- రాపూరు (ఆంధ్రజ్యోతి)

అందెల రవళి

పువ్వు పుట్టగానే పరిమళిస్తుదన్న సత్యాన్ని జాహ్నవి రుజువుచేశారు. దేశ,విదేశాల్లో ఆమె 800కిపైగా ప్రదర్శనలు ఇచ్చి పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు సొంతం చేసుకున్నారు. నృత్యమే ప్రాణంగా భావించిన ఆమె కూచిపూడిలో డిప్లమా, పీజీ పూర్తిచేసుకుని, భావితరాలకు నాట్యకళను అందించాలన్నా సంకల్పంతో జయం కూచిపూడి నాట్యాలయాన్ని స్థాపించారు.

- నాట్యాచారిణిగా జాహ్నవి
- ఎంతోమందికి కూచిపూడిలో శిక్షణ
- 800కి పైగా ప్రదర్శనలు
- పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డుల కైవసం



నృత్య భంగిమలో జాహ్నవి



జాహ్నవి శిష్యులను సర్టిఫికెట్లతో అభినందిస్తున్న ప్రముఖ నాట్యాచార్యుడు వేదాంతం రామలింగేశ్వరశాస్త్రి

తిరుపతి జిల్లా నాయుడుపేటకి చెందిన మధుసూదన్‌రావు-ఉషారాణి దంపతుల కుమార్తె జాహ్నవి. చిన్నతనం నుంచే నాట్యంపై మక్కువ పెంచుకుంది. కావలిలో అమ్మమ్మ జమున వద్ద ఉంటూ చదువుకుంది. టీవీల్లో కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్యాలను తిలకిస్తూ నాట్య సాధన చేసేది.

● హైదరాబాద్‌లో నృత్యశిక్షణ

జాహ్నవి ఆసక్తిని గుర్తించిన అమ్మమ్మ హైదరాబాదులోని ప్రముఖ నాట్యాచార్యులు వేదాంతం సత్యనరసింహశాస్త్రి వద్ద శిక్షణ ఇప్పించారు. గురువు వద్ద రోజుకు రెండు గంటల శిక్షణ , మరో రెండుగంటలు సాధన చేస్తూ నాట్యంలో మెలకువలు నేర్చుకుంది. కూచిపూడిలోని 48 ముద్రలు వంటపట్టించుకుని ప్రదర్శనలివ్వసాగింది. జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రదర్శనలు ఇచ్చింది. ఎన్నో అవార్డులు సొంతం చేసుకుంది.

గిన్నిస్ బుక్‌లో స్థానం

జాహ్నవి హైదరాబాదులోని గచ్చిబౌలిలో జరిగిన అంతర్జాతీయ కూచిపూడి నృత్యోత్సవాల్లో పాల్గొని గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించింది. ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి కూచిపూడి నృత్య ప్రదర్శనలో ఎక్సలెన్స్ పర్ఫార్మెన్స్ అవార్డు, 2012 సింగపూర్‌లో జరిగిన ఒలింపియాడ్స్‌లో ప్రతిభ కనబరచడంతో నాట్యబాల అవార్డు అందుకున్నారు. ఆమె ప్రదర్శనలకు మెచ్చి నర్తనబాల, బాలమేధావి, నాట్యబాల, నాట్యజ్యూరీ, నాట్య మయూరి తదితర అవార్డులు ప్రదానం చేశారు.

● ప్రముఖుల నుంచి ప్రశంస

అప్పటి సీఎంలు చంద్రబాబు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి, షీలా దీక్షిత్, కేంద్ర మంత్రులు వెంకయ్య నాయుడు, జైరామ్ రమేష్, పురంధేశ్వరి, పనబాక లక్ష్మి, గవర్నర్లు రంగరాజన్, రామేశ్వర్ ఠాకూర్, రమాదేవి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పొంగూరు నారాయణ, ఆనం రామనారాణ రెడ్డి, దేవినేని ఉమ, కొల్లు రవీంద్ర తదితర ప్రముఖుల నుంచి ప్రశంలందుకున్నారు.

● నాట్యాలయ స్థాపన

జాహ్నవి వివాహ నంతరం అమ్మమ్మ ప్రోత్సాహంతో 2017లో జయం కూచి పూడి నాట్యాలయాన్ని స్థాపించారు. ఇప్పటి వరకు ఎంతో మంది చిన్నారులను చేరదీసి నాట్యంలో శిక్షణ ఇచ్చారు. శిష్యబృందం కూడా దేశం నలుమూలల పలు ప్రదర్శనలందిస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు.

● సామాజిక సేవలోనూ...

జాహ్నవి విద్యాదశ నుంచే సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నారు. ఎన్‌సీసీ కేడెట్‌గా, ఎన్ఎస్ఎస్ వలంటీర్‌గా పర్యావరణ పరిరక్షణ, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, వన సంరక్షణ, బాలికా విద్య, బాల్య వివాహాల నిర్మూలన, మద్యపాన నిర్మూలన తదితర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కూచిపూడి కళ అంతరించకుండా విస్తరించడం జీవిత ఆశయమని జాహ్నవి పేర్కొన్నారు.

- కావలి టౌన్ (ఆంధ్రజ్యోతి)



తన వద్ద నాట్యం నేర్చుకుంటున్న విద్యార్థులతో జాహ్నవి

వైరల్ ఫీవర్.. ఫీవర్ !

(5వ పేజీ తరువాయి)

రోగులలో డెంగ్యూ వ్యాధిగ్రస్థుల సంఖ్య ఆందోళన కలిగిస్తుంది. జిల్లా వ్యాప్తంగా 26.60 లక్షల మంది జనాభా ఉండగా, ప్రస్తుతం 60 వేలమందికిపైగా జ్వరపీడితులు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

● అవగాహన ఏదీ ?

వైద్య ఆరోగ్యశాఖ ప్రజారోగ్యం కోసం రూ.కోట్లలో ఖర్చు చేస్తున్నా విషజ్వరాలు డెంగ్యూ, మలేరియా, నెమ్ము వ్యాధులపై మాత్రం తగిన ప్రచారం లేదు. ప్రజలకు అవగాహన కల్పించడంలో ఆ శాఖ వైఫల్యం చెందింది. వ్యాధులపై అవగాహన కల్పించే అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు అందుబాటులో ఉన్నారు. అయితే చిన్నపాటి జ్వరాలపై కూడా ప్రజలను అప్రమత్తం చేయడంలో వారు విఫలమవుతున్నారు. ఈ చలికాలంలో ప్రాణాంతకమైన దోమల సంఖ్య కూడా విపరీతంగా పెరిగే అవకాశం ఉంది. దీనిపై ప్రజలను అప్రమత్తం చేయాల్సిన శాఖాధికారులు అటు వైపు కూడా చూడడం లేదు.



నెల్లూరు పెద్దాసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

వాతావరణ మార్పులతోనే వ్యాధులు



ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పుల వల్ల నెమ్ము వ్యాధులు వస్తున్నాయి. డెంగ్యూ, విషజ్వరాలు కేసులు కూడా ఎక్కువగా నమోదవుతున్నాయి. ఎంతకూ తగ్గని జ్వరం ఉంటే డెంగ్యూ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి. అయితే కొంతమంది ప్లెట్లేట్‌లు తగ్గాయని ఆందోళన చెందుతూ చెన్నై తదితర ప్రాంతాలకు పరుగులు తీస్తున్నారు. ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- డాక్టర్ కాలేషా సాహెబ్, అసోసియేట్ ప్రొఫెసర్, జీజీహెచ్

ఈ సీజన్‌లో జాగ్రత్తలు అవసరం



ప్రస్తుత సీజన్‌లో ఎక్కువగా వైరల్ ఫీవర్‌లు వస్తున్నాయి. మలేరియా, డెంగ్యూ కేసులు అధికంగా నమోదవుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల కంటే ప్రైవేట్ ఆసుపత్రులలోనే కేసులు ఎక్కువగా ఉంటున్నాయి. విషజ్వరాలు ఉన్నవారు,సాధారణ జ్వరపడీడితులు వ్యాధి తీవ్రతను బట్టి డెంగ్యూ పరీక్షలు చేయించుకోవాలి. వైరల్ ఫీవర్‌పై ప్రతి ఒక్కరూ అప్రమత్తగా ఉండాలి.

- డాక్టర్ ఎంవీ రమణయ్య, ప్రజారోగ్య పరిరక్షణ వేధిక రాష్ట్ర అధ్యక్షుడు

పరిష్కారమెప్పుడు ?

(5వ పేజీ తరువాయి)

రెవెన్యూ యంత్రాంగంలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. క్షేత్రస్థాయిలో రెవెన్యూ సిబ్బంది తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు తప్ప సమస్యను పరిష్కరిద్దామన్న ఉద్దేశం చాలా మందిలో కనిపించడం లేదని ఆ శాఖవర్గాలే చెబుతున్నాయి. బాధితుడి ఫిర్యాదుకు తూతూమంత్రంగా సమాధానం ఇచ్చి ముగించేస్తున్నారు. ఆ సమస్యతో మళ్లీ బాధితుడు ఉన్నతాధికారుల వద్దకు పరిగెడుతున్నాడు. ఇప్పుడు గ్రామసభల్లో కూడా వచ్చిన అర్జీలు, వాటి పరిష్కార వేగం చూస్తుంటే.. వచ్చిన 8406 అర్జీలను పరిష్కరించడానికి ఎన్ని సంవత్సరాలు సమయం తీసుకుంటారోనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

● కలెక్టర్ మెమోలు జారీ చేసినా..

గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తహసీల్దార్లకు ఇటీవల కలెక్టర్ ఓ ఆనంద్ మెమోలు జారీ చేశారు. ఇలాగైనా మిగిలిన వారిలో మార్పు వస్తుందని అనుకుంటే ఆ పరిస్థితులు కనిపించేలా లేవని రెవెన్యూ వర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి. భూ సమస్యల అర్జీలు స్వీకరించడానికి ప్రత్యేకంగా 329 గ్రామాల్లో సభలు నిర్వహించారు. ఇప్పుడు వాటిని పరిష్కరించడానికి కూడా ప్రత్యేక డ్రైవ్‌లు ఏర్పాటు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఓ వైపు తమ సమస్యను ఎప్పుడు పరిష్కరిస్తారా..? అని బాధితులు కళ్లల్లో ఒత్తులేసుకొని ఎదురుచూస్తున్నారు. నిత్యం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు గ్రామసభల్లో వచ్చిన అర్జీలు పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అంతర్ జిల్లా నేరస్థుడికి రిమాండ్

ఉలవపాడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లుగా జాడ తెలియకుండా తిరుగుతున్న అంతర్ జిల్లా నేరస్థుడిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ అంకమ్మ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. చీరాల వద్ద ఈపురుపాలెంకు చెందిన కుంజా దుర్గాప్రసాద్ అలియాస్ గణ జాతీయ రహదారిపై రాత్రుళ్లు ఆగి ఉన్న లారీలు, కార్లను టార్గెట్ చేసి డ్రైవర్లు నిద్రిస్తున్న సమయంలో నగదు, సెల్‌ఫోన్‌లు దొంగతనం చేస్తుంటాడు. 2022లో ఉలవపాడు జాతీయ రహదారిపై ఆగి ఉన్న కారు నుంచి భారీగా నగదు చోరీ అయినట్లు కేసు నమోదు అయ్యింది. అంతేకాకుండా పలు పోలీస్ స్టేషన్‌ల్లో సదరు నిందితుడిపై వివిధ రకాల కేసులు నమోదు అయ్యాయి. అప్పటినుంచి అతని జాడపై నిఘా ఉంచి అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రాజ్యాంగ దినోత్సవ పోటీల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ



అధికారుల నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న విద్యార్థిని

నెల్లూరు(విద్య), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవ పోటీల్లో జిల్లా విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపి విజేతలుగా నిలిచారు. గుంటూరులో జోనల్ స్థాయిలో జరిగిన ఈ పోటీల్లో డిబేట్ విభాగంలో సీటీ నగర్ నగరపాలక పాఠశాల విద్యార్థులు ఏ.ప్రవీణ్, విష్ణువర్ధన్‌లు ప్రథమస్థానం, వ్యాసరచన పోటీల్లో గండవరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని బి.సుచిత్ర ప్రథమస్థానం, వక్తృత్వ పోటీల్లో చెన్నపల్లిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని బి.లాలన ద్వితీయస్థానం, దేశభక్తి గీతాల విభాగంలో గండవరం జడ్పీ పాఠశాల విద్యార్థిని బి.సుచిత్ర తృతీయస్థానంలో నిలియారు. వీరు అన్ని విభాగాల్లో విజేతలుగా నిలిచేందుకు డీఈవో డాక్టర్ ఆర్.బాలాజీరావు, డిప్యూటీ ఈవోలు ప్రసన్నలక్ష్మి, రఘురామయ్య, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు పూర్తి సహకారం అందించారని ఉపాధ్యాయులు ఫణికుమార్, కట్టా సురేష్, పుల్లయ్య, ఖాదర్‌బాషాలు తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు చాకిచర్ల విద్యార్థి



శ్రీరామ్‌ను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

ఉలవపాడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : చాకిచర్ల జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఊటుకూరి వెంకట శ్రీరామ్ ఈ నెల 27న బీహార్ రాష్ట్రం పట్నాలో జరిగే జాతీయస్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు జనార్ధన్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని సోమవారం పాఠశాలలో హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ ఆర్ సుధాకర్, విద్యార్థులు, గ్రామ పెద్దలు అభినందనలు తెలిపారు. ఉత్తమ ప్రతిభ ప్రదర్శించి జాతీయస్థాయిలో గ్రామం, పాఠశాల పేరు నిలపెట్టాలని ఆకాంక్షించారు.



కానరాని క్లోరినేషన్

● కొరవడిన పర్యవేక్షణ ● గ్రామాల్లో శుభ్రతలేని నీటి ట్యాంకులు ● బోర్డులు తప్ప రాతలు ఏవీ ?



ట్యాంకు బోర్డుపై కానరాని రాతలు

మనుబోలు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వర్షాకాలంలో గ్రామీణులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాల్సిన బాధ్యత పంచాయతీ పాలకులపై ఉంది. కుళాయిల నుంచి వచ్చే నీటిని క్లోరినేషన్ చేసి విడుదల చేయాల్సి ఉంది. లేకుంటే సీజనల్ వ్యాధులు ప్రబలేఅవకాశం ఉంది. అయితే, ఎప్పుడో పారిశుధ్య వారోత్సవాలు, మాసోత్సవాలు నిర్వహించినప్పుడు మాత్రమే క్లోరినేషన్ చేసి చేతులు దులుపుకుంటున్నారు. గత పాలనలో పంచాయతీ నిధులు దారిమళ్లించడంతో బ్లీచింగ్ అనేది కానరాలేదు. ఎమ్మెల్యే, కలెక్టర్, ఇతర అధికారులు ఎవరైనా పర్యటిస్తారం టేనే బ్లీచింగ్ చల్లి వదిలేస్తారు. వారానికి ఒకసారి తప్పనిసరిగా తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలి. ప్రతి 15రోజులకొకసారి ట్యాంకులను శుభ్రం చేయించాలి. ట్యాంకుల వద్ద ఏర్పాటుచే సిన బోర్డుపై ఎప్పుడు శుభ్రం చేశారన్నది రాసిఉంచాలి. కానీ అలాంటి కార్యక్రమాలు చాలా పంచాయతీల్లో కానరావడం లేదు. మండలంలో 19 పంచాయతీలతోపాటు 80 మజరాలు ఉన్నాయి. వీటిల్లో 33రక్షిత మంచి నీటి ట్యాంకులు, రెండు మినీరక్షిత మంచినీటి ట్యాంకుల ఉన్నాయి. ఇవికాక 49చోట్ల నేరుగా కుళాయిలకే తాగునీటిని వదులుతున్నారు. 33 నీటి ట్యాంకుల్లో పదికిపైనే దెబ్బతిన్నాయి. అయితే వీటిపై అధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉంది. గతంలో డీపీవో ఓ పంచాయతీ తనిఖీ చేసినప్పుడు ఒకసారి శుభ్రం చేసిన ఫొటోనే పలుమార్లు పెట్టి ప్రతి నెలా శుభ్రం చేస్తున్నట్లు చూపారు. దీన్ని గుర్తించి ఆ కార్యదర్శిని ఆమె మందలించారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు ఇకనైనా ట్యాంకుల్లో క్లోరినేషన్ జరిగేలా చర్యలు చేపట్టాలి.



దెబ్బతిన్న జట్లకొండూరు ట్యాంకు మెట్లు

కందుకూరులో వసతులు మెరుగుపరచండి

కందుకూరులోని నివాస ప్రాంతాల్లో సమస్యలు పరిష్కరించాలని, మౌలిక వసతులు మెరుగుపరచాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆద్వర్యంలో మహిళలు, స్థానికులు సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయం నుంచి సబ్ కలెక్టరు కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. పట్టణంలోని ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని, రూరల్ పోలీస్‌స్టేషన్ నుంచి కోటారెడ్డి హాస్పటల్ వరకు, పంచాయతీరాజ్ ఆఫీసు నుంచి ఆక్స్‌ఫర్డ్ స్కూల్ వరకు రోడ్డుకు ఇరువైపులా ప్రమాదకరమైన మ్యాన్‌హోల్స్ ఉన్నాయని తక్షణమే వాటికి మరమ్మతులు చేయించాలని కోరారు. అనంతరం సబ్ కలెక్టరు శ్రీపూజకు సమస్యలు వివరిస్తూ వినతిపత్రం అందజేశారు.

- కందుకూరు (ఆంధ్రజ్యోతి)

'రామదూత స్వామిని అరెస్టు చేయాలి'

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గంలోని తెట్టు మండపం చేవూరు వద్ద 25 ఏళ్లుగా ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఆశ్రమం నడుపుతున్న రామదూత స్వామిని అరెస్టు చేసి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్నే వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వం విశాఖపట్నం వద్ద రూ.250కోట్లు విలువ చేసే భూమిని స్వరూపానందస్వామికి కారుచౌకగా ధారాదత్తం చేస్తే ప్రస్తుత ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని తెలిపారు. రామదూత ఆక్రమించిన ప్రభుత్వ భూమికి కందుకూరు ఆర్డీవో ఆన్‌లైన్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. గతంలో రాష్ట్ర ప్రిన్సిపల్ కార్యదర్శి ఇచ్చిన రద్దు ఉత్తర్వులపై జిల్లా కలెక్టర్, తహసీల్దారు నాటకాలు ఆడుతున్నారని తెలిపారు. తాజాగా స్వామీజీ ఆక్రమించిన భూమి ఎకరా రూ.15కోట్లు విలువ చేస్తుండగా దానిని కారుచౌకగా స్వామీజీకి విక్రయించేందుకు కొత్త ప్రతిపాదనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. స్వామీజీలకు చౌకగా భూములు కట్టబెట్టి గత ప్రభుత్వం తెచ్చుకున్న చెడ్డపేరును రామదూత విషయంలో తెచ్చుకోవదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా హేతువాద సంఘంగా నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్ పరిధిలోని వెంగళరావు నగర్‌కు చెందిన ఏసుపాదం అదృశ్యంపై వేదాయపాలెం పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. వెంగళరావునగర్‌కు చెందిన పిట్టి ఏసుపాదంకు వివాహమై కుమార్తె ఉన్నారు. అతను పెయింటింగ్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆ క్రమంలో ఈనెల 24వ తేది రాత్రి ఏసుపాదంకు తెలిసిన వ్యక్తులు ఇంటికి వచ్చి ఏదో పని ఉందని తీసుకు వెళ్లారని, అప్పటి నుంచి అతను తిరిగి ఇంటికి రాలేదని కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

ఎన్నాళ్లీ నీటి వృథా.. ?



అయ్యవారిపల్లె- మాలకొండ గ్రామాల మధ్య ఉన్న జాతీయ రహదారి సమీపంలోని చుండి చెర్లోపాలెం రక్షిత మంచినీటి పథకం తాగునీటి పైప్‌లైన్ లీకేజీతో నీరు వృథాగా పోతోంది. అధికారులు దీనికి వాల్వ్ ఏర్పాటు చేయకపోవడంతో నీరు ఐదారు అడుగులు ఉవ్వెత్తున ఎగిసి పడుతుంది. ఈ సమస్యతో ఈ మంచినీటి పథకం పరిధిలోని గ్రామాలకు పూర్తిస్థాయిలో నీరు అందడం లేదు.

- వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి)

సబ్ రిజిస్ట్రార్ బాధ్యతల స్వీకరణ

ఉదయగిరి రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా పల్లపు మెల్కిరోషన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు రిజిస్ట్రార్ కార్యాలయ ఆడిట్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మెల్కిరోషన్‌ను ఇక్కడికి బదిలీ చేయడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

అధికారుల గైర్హాజరు

వలేటివారిపాలెం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రతివారం చేపట్టనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అధికారులు గైర్హాజరయ్యారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమానికి తహసీల్దార్, ఎంపీడీఓ మాత్రమే హాజరై మిగిలిన శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. నాలుగునెలలుగా ఈ కార్యక్రమానికి ఒకరిద్దరూ మాత్రమే వస్తున్నా సంబంధిత ఉన్నతాధికారులు పట్టించుకోడంలేదు. అధికారులు లేకపోవడంతో ఫిర్యాదు చేయడానికి వచ్చిన ప్రజలు ఉసూరుమంటూ వెనుదిరిగి వెళ్లారు. కేవలం మూడు అర్జీలు మాత్రమే వచ్చినట్లు తహసీల్దార్ అబ్దుల్‌అమీర్ తెలిపారు.

- శిథిలావస్థలో గట్టుపల్లి ఆరోగ్య కేంద్రం
- బిక్కుమంటూ సిబ్బంది విధుల నిర్వహణ

ఇదా పీహెచ్‌సీ..?



రోగులకు ఏర్పాటు చేసిన మంచాలపై పడిన శ్లాబు పెచ్చులు

జలదంకి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గట్టుపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం అంటే గతంలో ఎంతో ఘనకీర్తిగా ఉండేది. నేడు ఈ పీహెచ్‌సీకి వెళ్తే ఇదేమి పీహెచ్‌సీ అని అందులోకి వెళ్లిన వారు నోరెళ్ల బెడుతున్నారు. చుట్టుపక్కల 15గ్రామాలకు చెందిన వైద్యసేవలందించే ఆస్పత్రి భవనం ఇలా శిథిలావస్థకు చేరిఉన్నా అధికారులు పట్టించుకోక పోవడం విచారకరం అని వైద్య సేవలకు వెళ్లిన రోగులే చర్చించుకుంటున్నారు. ఇక విధులు నిర్వహించే వైద్యులు, సిబ్బంది పరిస్థితి ఎలా ఉంటుందో ఒకసారి ఊహించుకోండి. వర్షం కురిస్తే భవనమంతా ఉరుస్తుంది. ఈ సమయంలో వైద్యపరికరాలు తడవకుండా ఉండేందుకు ఫ్లెక్సీలను సిబ్బంది అడ్డం కట్టుకుని కాలం వెల్లదీస్తున్నారు. రోగులకు కోసం ఏర్పాటు చేసిన మంచాలపై శ్లాబు పెచ్చెలూడి పడి భయానకంగా ఉంది.



భవనం శ్లాబు పెచ్చులూడి బయటపడ్డ ఇనుపచువ్వలు



వానొస్తే పరికరాలు తడవకుండా ఫ్లెక్సీ అడ్డుగా ఏర్పాటు

ఆకస్మిక తనిఖీలు

ఉలవపాడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై సోమవారం వ్యవసాయ శాఖ ఇంటర్నల్ స్క్వాడ్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. వీరి వెంట కావలి సహాయ వ్యవసాయ సంచాలకులు సీహెచ్ నాగరాజు, మండల వ్యవసాయ అధికారిణి తిరుమల జ్యోతి ఉన్నారు.

పొగాకు సాగుచేయొద్దు

లింగసముద్రం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులు ఈ ఏడాది అధిక విస్తీర్ణంలో పంట సాగు చేయద్దని కందుకూరు పొగాకు బోర్డు 27వ వేలం కేంద్రం నిర్వహణ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. మొగిలిచెర్లలో పొగాకు సాగు నియంత్రణపై రైతులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ గ్రేడింగ్ అధికారి రాజగోపాలరెడ్డి, ఐటిసి ప్రతినిధి రాజశేఖర్, జీపీఐ కంపెనీ ప్రతినిధి ఉన్నం శ్రీనివాసులు పాల్గొన్నారు.

మాన్యం భూములు కాపాడాలి

వింజమూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పీర్ల మాన్యం భూములను కాపాడాలని తహసీల్దారు హమీద్‌కి ముస్లింలు వినతిపత్రం అందజేశారు. ఈ భూములను కొంతమంది వ్యక్తులు అక్రమంగా అమ్మకానికి ప్రయత్నాలు చేస్తున్నారని సోమవారం వారు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, పీర్ల మాన్యం మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

సీతారామపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చిన్ననాగంపల్లి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బెడుసుపల్లి బసిరెడ్డి రమణారెడ్డి, బసిరెడ్డి పద్మావతి దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. వీరు బైక్‌పైన భైరవకోన నుంచి సొంత గ్రామానికి వస్తుండగా కారు వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టినట్లు తెలిపారు. స్థానికులు 108కి సమాచారమివ్వగా క్షతగాత్రులను 108 వాహనంలో స్థానిక పిహెచ్‌కి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఉదయగిరికి తరలించారు.

భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు

ఆత్మకూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కరటంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా రామయ్యస్వామి, నాగరాజస్వామి వ్యవహరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పెంచలరెడ్డి, తెలుగు టీచర్ రజనీప్రియ, సత్యవతి, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కలువాయి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం ప్రభావంతో మంగళవారం నుంచి మూడురోజుల పాటు భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు అంతా అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి ప్రతాప్ కోరారు. వరి సాగు, నాట్లు వేసేవారు వర్షాల అనంతరం వేసుకోవాలని సూచించారు.

ఉపాధ్యాయుడికి అవార్డు

సంగం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి):గాంధీజన సంఘం ఉన్నత పాఠశాల తెలుగు పండిట్, తెలుగు భారతి సేవా సమితి ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి హైదరాబాదులో సోమవారం ఏపీజే అబ్దుల్ కలాం లెజెండరీ అవార్డు అందుకున్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

ఉదయగిరి రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తహసీల్దారు కార్యాలయం ఎదుట మంగళవారం నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని జిల్లా రైతు సంఘం నాయకులు కాకు వెంకటయ్య సోమవారం పట్టణంలో కరపత్రాలు పంపిణీ చేశారు.

కావలి పట్టణాభివృద్ధిపై ఎమ్మెల్యే సమీక్ష

కావలి టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ శ్రావణ్‌కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి సోమవారం పట్టణాభివృద్ధిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని 40వార్డుల ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పన, 9కిమీలో మీటర్ల పరిధిలోని ట్రంకురోడ్డు అభివృద్ధి, ప్రతి ఇంటికి తాగునీటి కులాయి తదితర అభివృద్ధి సంక్షేమ పనులపై ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. గతపాలకుల నిర్లక్షంతో రూ.52కోట్ల (పైలెట్ ప్రాజెక్ట్) అమృత్ పథకానికి అధోగతి పట్టించారన్నారు. ట్రంకురోడ్డు విస్తరణ పేరుతో రూ.7కోట్ల విలువైన పైపులైన్లు ధ్వంసం చేసారని వాటి రికవరీకి చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. ఇళ్లులేని పేదలకు 2సెంట్లు స్థలం కేటాయిస్తామని, స్థలం ఉన్న లబ్ధిదారులకు గృహాలు మంజూరు చేస్తామని 30లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. సమావేశంలో గుత్తికొండ కిషోర్, మలిశెట్టి వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్ చౌదరి పాల్గొన్నారు.

ప్రజాసేవకు ఎల్లప్పుడూ ముందుంటాం...

- ఎంపీపీ తాళ్లూరు వెంకటకృష్ణప్రసాద్ నాయుడు



మాట్లాడుతున్న వెంకటకృష్ణప్రసాద్ నాయుడు

దగదర్తి, (బిట్రగుంట) నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సేవలు చేసే విషయంలో తాళ్లూరు కుటుంబసభ్యులు ముందుంటారని ఎంపీపీ తాళ్లూరు వెంకటకృష్ణప్రసాద్ నాయుడు తెలిపారు. మండలంలోని చెన్నూరు, బోడగుడిపాడు గ్రామాల్లో తాళ్లూరు రమణయ్యనాయుడు సుజాతమ్మల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఉచిత మినిరల్ వాటర్ ప్లాంట్లను సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో తాళ్లూరు రమణయ్యనాయుడు మనుమరాళ్ళు, మనుమలు డీ.చరణ్, అలేఖ్య, బీ.సుమంత్, అశ్రీత, టీ.వెంకటసాయి, శివాణి పాల్గొన్నారు.

ముఖ్యమంత్రితో మాలేపాటి సోదరులు



సీఎం చంద్రబాబునాయుడుతో మాలేపాటి సోదరులు

దగదర్తి, (బిట్రగుంట) నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలానికి చెందిన టీడీపీ ఉపాధ్యక్షులు మాలేపాటి సుబ్బానాయుడు, మాజీ ఇరిగేషన్ బోర్డు డైరెక్టర్ మాలేపాటి రవీంద్రనాయుడు సోమవారం అమరావతిలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం వారితో మాట్లాడారు. పార్టీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని పార్టీ కోసం కష్టపడి పనిచేయాలన్నారు. వారి వెంట టీడీపీ యువనేత మాలేపాటి భానుచంద్రర్ నాయుడు, కంచర్ల కృష్ణ తదితరులు ఉన్నారు.

మోసపోయాం... ఆదుకోండి

- తహసీల్దారుకు బాధితుల మొర



తహసీల్దారుకు ఫిర్యాదు చేస్తున్న కోటితీర్థం ఎస్సీ కాలనీ వాసులు

చేజర్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో తాము సాగు చేస్తున్న భూమికి పట్టాలు ఇప్పిస్తామని చెప్పి తమ వద్ద నగదు వసూలు చేసి నకిలీ పాసు పుస్తకాలు ముట్టచెప్పి తమను మోసం చేశారని, ఆదుకోవాలని కోటితీర్థం ఎస్సీలు సోమవారం ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమంలో తహసీల్దారుకు మొర పెట్టుకున్నారు. పూర్తి వివరాల మేరకు.. చేజర్ల మండలం కోటితీర్థం గ్రామానికి చెందిన కొంత మంది ఎస్సీలు కొంతకాలంగా భూమిని సాగు చేస్తున్న నేపథ్యంలో భూ పంపిణీలో పట్టాలు ఇప్పిస్తామని సదరు గ్రామానికి చెందిన కాకి పెంచలయ్య నమ్మబలికి తమ వద్ద నగదు వసూలు చేసినట్లు వారు తెలిపారు. అనంతరం తమకు పాసుపుస్తకాలు అందజేసినట్లు, అయితే ఇటీవల ఆ పాసు పుస్తకాలను పెట్టి బ్యాంకులో లోనుకు సంప్రదించగా అవి నకిలీవని తేలిందన్నారు. వెంటనే తమను మోసం చేసిన కాకి పెంచలయ్యను నిలదీయగా మీకు దిక్కున్న చోట చెప్పుకోండి అంటూ సమాధానం ఇచ్చినట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు గత్యంతరం లేక సోమవారం చేజర్ల తహసీల్దారుకు తమ వద్ద ఉన్న ఆధారాలతో అర్జీ అందచేసినట్లు వారు తెలిపారు. దీనిపై చేజర్ల తహసీల్దారు ఆర్ మస్తానయ్యను వివరణ కోరగా విచారించి చర్యలు తీసుకంటామని తెలిపారు.

మట్టి తొలగింపు

కావలి రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక వైకుంఠపురం అన్నపుగుంట బజారులోని సీసీరోడ్డుపై వైసీపీ నేతలు వేయించిన గ్రావెల్‌ను సోమవారం మున్సిపల్ సిబ్బంది తొలగించారు. చిన్నపాటి వర్షాలు కురిసినా అన్నపుగుంట బజారు వర్షపు నీటితో నిండి ఇళ్లలోకి నీరు పోతుండటంతో అధికారులు ఈ చర్యలు తీసుకున్నారు. ఎమ్మెల్యే ఆదేశాలతో పనులు చేపట్టామని అధికారులు తెలిపారు.

వెటర్నరీ కాలేజీకి ప్రతిపాదనలు

కొండాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వెటర్నరీ కళాశాల ఏర్పాటుకు ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడంపై టీడీపీ మండల కన్వీనర్ మామిళ్లపల్లి ఓంకార్, మాజీ వైస్ ఛైర్మెన్ పోలినేని చంద్రబాబు నాయుడులు హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని చింతలదేవిలో కళాశాలకు అనువైన ప్రదేశం ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రైతు కార్యదర్శి పోలినేని రమేష్, తెలుగు యువత అధ్యక్షుడు దాసరి అశోక్, చైతన్య పాల్గొన్నారు.

7న మెగా పేరెంట్స్‌డే

కందుకూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ ఆధ్వర్యంలో అన్ని మండలాల్లో వచ్చే నెల 7న మెగా పేరెంట్స్ డే నిర్వహిస్తున్నట్లు కందుకూరు ఉప విద్యాశాఖాధికారి జానకీరామ్ తెలిపారు. సోమవారం ఆయన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసి డే నిర్వహణకు జరుగుతున్న ఏర్పాట్లను వివరించారు.

పెట్రోలు బంకు నిర్మాణం తగదు

- సబ్ కలెక్టరుకు వినతి

కందుకూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కార్యాలయాల ఆవరణలో పెట్రోలు బంకు ఏర్పాటుకు అనుమతి ఇవ్వటం శోచనీయమని తక్షణం ఆ ఉత్తర్వులను రద్దు చేయాలని నియోజకవర్గ అభివృద్ధి మండలి ప్రతినిధులు కోరారు. ఈ విషయంపై సోమవారం సబ్ కలెక్టరు శ్రీపూజకు వినతిపత్రం ఇచ్చారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన

ఉలవపాడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : యువతను పెడదారి పట్టించే గంజాయి, మాదక ద్రవ్యాలపై స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఎస్సై అంకమ్మ సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సెల్‌ఫోన్స్ వాడకం పెరిగిపోవడంతో చెడు వ్యసనాల వైపు దృష్టి సారించొద్దన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ మోసపూరిత కుట్ర

- అంబేడ్కర్ యువజనసంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాల్మన్‌రాజు



నిరసన వ్యక్తం చేస్తున్న దళితులు

అల్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ రాజకీయ నాయకులు చేపట్టే ఒక మోసపూరిత కుట్ర అని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు ఆ రోపించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన సంఘం సభ్యులతో కలిసి ఆందోళన చేపట్టి మాట్లాడారు. దళితులంతా ఒక్కటే అని మాల, మాదిగలు కలసి మెలసి ఉన్నామని ఇరువులను విడదీసి మాలలకు అన్యాయం చేసేందుకే ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టారని మండిపడ్డారు. కార్యక్రమంలో అరగల రమణయ్య, శ్రీనివాసులు, పంగులూరు సుధాకర్, నరేంద్ర, గంగపట్నం సతీష్, వెంకటేష్, ప్రణయ్ పాల్గొన్నారు.

జగనన్న లే అవుట్ పనులపై విజిలెన్స్ తనిఖీలు



పనులను పరిశీలిస్తున్న అధికారులు

కొండాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో సాయిపేట స్థానిక చెరువు సమీపంలో ఏర్పాటు చేసిన జగనన్న లే అవుట్ల పనులపై సోమవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తుది బిల్లు మంజూరుకు కాంట్రాక్టరు కోర్టును ఆశ్రయించగా కోర్టు ఆదేశాలతో పనులను పరిశీలించేందుకు వచ్చినట్లు డ్వామా సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి వాసిలి సురేష్‌బాబు తెలిపారు. అనంతరం వెలిగండ్ల, గరిమెనపెంట గ్రామాలలో జరిగిన పనులను పరిశీలించారు. పరిశీలనల నివేదికను డ్వామా ఉన్నతాధికారులకు అం దజేస్తామన్నారు. కార్యక్రమంలో జూనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారులు ఖలీలుల్లా, కిషోర్‌బాబు ఉన్నారు.

యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌కి సన్మానం



నాగరాజును సన్మానిస్తున్న నాయకులు

గుడ్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ జనిగర్ల నాగరాజును స్థానిక విద్యావనరుల కార్యాలయంలో మండల యూటీఎఫ్ నాయకులు మక్కెన రమేష్, మనోహర్‌లు శాలువా పూలమాలలతో సన్మానించారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నాగరాజు పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో గోవర్ధన్, ఉపాధ్యాయులు జొన్నల గడ్డ వెంకటాద్రి, గొర్రెపాటి మధుసూదన్ రావు, తిరపతిస్వామి, వెంకటేశ్వరు ఉన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం



ఎమ్మెల్యేకు విరాళం ఇస్తున్న ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు

కందుకూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు ప్రైవేటు హాస్పటల్స్ వైద్యులు రూ.3.8లక్షలు విరాళాలను సేకరించారు. ఈ మొత్తాన్ని సోమవారం వారు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును కలిసి అందజేశారు. పట్టణంలో భద్రతను పెంపొందించటం కోసం తమవంతు సహకారం అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వరరావు ఉన్నారు.

బాల్య వివాహాల నిర్మూలన చట్టాలపై అవగాహన

కావలిటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెంగళరావునగర్ 18వ వార్డులో సోమవారం బాల్య వివాహాల నిర్మూలన చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో సౌజన్య, డిప్యూటి డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ బ్రిజిత, ఎంఈవో గోవిందయ్యలు పాల్గొని చట్టాలపై అవగాహన కల్పించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు సమాచారముంటే వెంటనే ఐసీడీఎస్ అధికారులకు తెలపాలని పిల్లల తల్లితండ్రులతో కలిసి వాటి అనర్థాల గురించి వివరించి వివాహాలు వాయిదా వేయించాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేసి ర్యాలీ నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక చివరి సోమవార పూజలు



సంగం: హోమంలో పూర్ణాహుతి వేస్తున్న ఆర్టీసీ రీజనల్ జోనల్ ఛైర్మన్ సురేష్‌రెడ్డి దంపతులు

ఆత్మకూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా ఆత్మకూరులోని శైవాలయాలు భక్తుల శివనామ స్మరణతో మారుమోగాయి. భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణ శివాలయంలో, వెంకటేశ్వరస్వామి ఆలయం, అభయాంజనేయస్వామి, కన్యకాపరమేశ్వరి ఆలయం, అలఘు నాదస్వామి ఆలయాల్లో కార్తీక పూజలు నిర్వహించారు. అలాగే షిర్డీ సాయిబాబా మందిరంలో సోమవారం సాయంత్రం ఇస్కాన్ నెల్లూరు హరేకృష్ణ మందిరం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ రాధా ప్రతిమలు ఆవిష్కరించి దీపోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.

- సంగం: స్థానిక సంగమేశ్వరాలయంలో మహిళలు ఉదయం పెన్నమ్మకు పూజలు చేసి సంగమేశ్వరాలయంలో కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే తిరుమనకొండలో శ్రీ రాజరాజేశ్వరిదేవి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి జ్ఞానపీఠంలో పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. నెల్లూరు ఆర్టీసీ రీజనల్ జోనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి దంపతులు జ్ఞానపీఠం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- అనంతసాగరం: చిలకలమర్రి అటవీ ప్రాంతం మల్లెంకొండేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. కామిరెడ్డిపాడు ఉన్నత విద్యార్థులు వనభోజనలో పాల్గొన్నారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వసుంధరాదేవి, సిబ్బంది హజరత్, వ ం నో జ్ క ం వ ా ల్, వెం క ట ర వ ం ణ రాజు పాల్గొన్నారు.



ఆత్మకూరులో..

- ఉదయగిరి రూరల్: గండిపాళెం జలాశయం ప్రాంగణం లో ఉన్న శ్రీసిద్ధేశ్వర స్వామికి మహాభస్మాభిషేకం, సహస్ర జ్యోతిర్లింగార్చన సహిత జ్వాలతోరణ కార్యక్రమాలను అర్చకులు వైభవంగా చేపట్టారు. గ్రామంతోపాటు పరిసర గ్రామాల భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.
- దుత్తలూరు: నర్రవాడ గ్రామ దొడ్డకొండపై ఉన్న శ్రీవెంగమాంబ పేరంటాలమ్మ అమ్మవారికి కార్తీక సోమవారం సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి వెట్టిగుంట ఉషశ్రీ ఆధ్వర్యంలో అర్చకులు పూజలు నిర్వహించారు. దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.
- బిట్రగుంట: బోగోలు చెన్నకేశవ ఆంజనేయస్వామి ఆలయంలో సామూహిక సత్య నారాయణ స్వామి వ్రతపూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితులు నరసింహాచార్యులు, నాగేంద్రస్వామి, సత్యనారాయణ చార్యులు శాస్త్రోక్తంగా స్వామివారికి పూజలు జరిపించారు. మధ్యాహ్నం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో జరిగిన వనభోజన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. రామస్వామిపాలెంలోని జ్ఞానప్రసన్నాంబ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. కార్యక్రమాలో ఈవో రాధాకృష్ణ, పెద్దలు ఉన్నారు.

రైల్వే అభివృద్ధికి కలిసి పోరాడుదాం

బిట్రగుంట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే అభివృద్ధికి సమిష్టిగా పోరాడుదామని నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి అళహరి సుధాకర్ అన్నారు. సోమవారం మండలానికి వచ్చిన ఆయన్ను బీజేపీ మండల అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్, బిట్రగుంట రైల్వే విశ్రాంత ఉద్యోగులు సన్మానించారు. అనంతరం తహసీల్దారు సురేష్‌బాబును కలసి రైల్వే, ప్రభుత్వ భూముల వివరాలు కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు తిరుమలశెట్టి వెంకటేష్, గోవిందరాజు, విజయరాజు, రాజన్న, భాస్కర్ ఉన్నారు.

జూనియర్, డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయండి

కావలి టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలని విద్యారంగ హక్కుల సాధన కమిటీ సభ్యులు సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో, ఎమ్మెల్యే కృష్ణారెడ్డిలను కలిసి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ ఎస్ శ్యామల, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఎస్ సుబ్బారావు, గురునాదశర్మ, మాజీ కౌన్సిలర్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఓవర్‌హెడ్ ట్యాంక్ తొలగించాలని ఆందోళన

సీతారామపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో కూలేందుకు సిద్ధంగా ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్‌ను తొలగించాలని సోమవారం గ్రామప్రజలు ఆందోళన చేశారు. గతంలో పంచాయతీ ప్రజలకు నీటి సరఫరా చేసేందుకు వాటర్ ట్యాంక్‌ను నిర్మించారు. నిర్వహణ లోపంతో శ్లాబ్ పెచ్చులు ఊడి పోయి కూలేందుకు సిద్ధంగా ఉంది. వాటర్ ట్యాంకును తొలగించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు పలుమార్లు మొర పెట్టుకున్నా పట్టించు కోవడంలేదని, ఏదైనా ప్రమాదం జరగకముందే అధికారులు వాటర్ ట్యాంక్ ను తొలగించాలని ప్రజలు కోరారు.

14మద్యం సీసాల పట్టివేత

కావలి రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చలంచర్లలో సోమవారం బెల్టు దుకాణంపై ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మద్యం బాటిళ్ల అమ్మకాలు చేపడుతున్న పొట్టపల్లి పుల్లమ్మను అదుపులోకి తీసుకుని ఆమె వద్ద 14 బాటిళ్ల స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

చేజర్ల ఎస్ఐగా తిరుమలరావు

చేజర్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చేజర్ల ఎస్ఐగా జే తిరుమలరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషిచేస్తానని తెలిపారు.

ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోండి

- శరత్, హౌసింగ్ ఏఈ అనంతసాగరం



అనంతసాగరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు లేని వారు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ఇన్‌చార్జి హౌసింగ్ ఏఈ శరత్ తెలిపారు.

ముఖాముఖి

? పీఎంఏవై 2.0 పథకానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చా.

! కొత్త గృహాల మంజూరుకు ఆన్‌లైన్ ప్రక్రియ మొదలైంది. విషయంపై ప్రజలకు అవగాహన కల్పిస్తు న్నాం.

? ఆన్‌లైన్‌కు కావల్సిన పత్రాలు ఏమిటి.. ఎవర్ని సంప్రదించాలి.

! ఆన్‌లైన్ కోసం ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, లబ్ధిదారుని ఆదాయం సరిఫికెట్, బ్యాంక్ అకౌంట్, లబ్ధిదారుని ఫోటో, పాన్‌కార్డు, మెయిల్ ఐడీ, ఫోన్ నెంబరు అవస రం. సచివాలయాలు, హౌసింగ్ ఏఈ కార్యాలయాన్ని సంప్ర దించాలి.

? నిర్మాణదశ ఇళ్లకు బిల్లు చెల్లిస్తున్నారా.

! గతంలో ఇళ్లు మంజూరై నిర్మాణదశలో ఉన్న వాటిపై దృష్టి సారించాం. బిల్లులు చెలించేలా చర్యలు తీసుకుం టున్నాం.

? పాతబిల్లుల బకాయిల సంగతేంటి.

! పాతబిల్లుల బకాయిలు చెల్లించే విష యంపై ఉన్నతాధికారుల ఆదేశాలతో సర్వే పూర్తిచేసి నివేదిక అందించాం. మంజూరైన వెంటనే లబ్ధిదారులకు నగదు పడుతుంది.